ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుని గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 281 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | బుధవారం 7 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### భారీగా తగ్గిన వెండి

భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుతున్నాయనే సంకేతాల నేపథ్యంలో వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పడిపోయాయి. సోమవారం ఎంసిఎక్స్ మార్కెట్లో కిలో వెండి ధర ఒక్క రోజే రూ.21 వేలు తగ్గింది. మధ్యాహ్నం తర్వాత ఒక్క గంటలోనే కిలో వెండి ధర భారీగా తగ్గి రూ.2,33,120 కు చేరింది. ముఖ్యంగా ఉక్రెయిన్-, రష్యా యుద్ధానికి సంబంధించి సానుకూల పరిణామాలు కనిపించడంతో పెట్టుబడిదారుల్లో లాభాల స్వీకరణ కనిపించింది.

### ఇవి బ్యాటరీలకు ఆధార్ తరహా నెంబర్లు

కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ శని వారం ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల సంబందిత కీలక ముసాయిదా మార్గదర్శకాలు వెలువరించింది. ఇవి కార్లు ఇతర వాహనాలకు అత్యవసరంగా వాడే బ్యాటరీలకు ఇకపై ఆధార్ తరహా నిర్దిష్ట క్రమ సంఖ్యలను పొందుపర్చేందుకు ప్రతిపాదించారు. సమర్థవంతమైన రీ ఛార్జింగ్‌కు, వీటి ఉనికి తెలుసుకునేందుకు (ట్రెసిబులిటి) ఈ నెంబర్ల ప్రక్రియ ఉపయోగపడుతుందని మార్గదర్శకాలలో మంత్రిత్వ శాఖ తెలిపింది.

# వెనెజువెలా సంక్షోభం...

భారత్‌కు మేలు చేస్తుందంటున్న నిపుణులు!

వెనెజువెలా సంక్షోభంతో భారత్ ఆయిల్ బిల్లుపై తక్షణ ప్రభావం ఉండదన్న నిపుణులు

ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ సరఫరాలు మిగులు స్థాయిలో ఉన్నాయని వెల్లడి

ఇతర దేశాలతో పోలిస్తే వెనెజువెలా నుంచి భారత్‌కు తక్కువ ధరకే చమురు

అమెరికా జోక్యంతో భవిష్యత్తులో ధరలు తగ్గే అవకాశం ఉందని అంచనా




### హిల్ట్ పాలసీపై చర్చ ..

# అవి ప్రభుత్వ భూములు కావు

- "హిల్ట్ పాలసీ కింద ఆరు నెలల గడువు ఇస్తాం
- స్వచ్ఛందంగా ముందుకొస్తేనే భూములు కన్వర్ట్ చేస్తాం
- పాలసీ గురించి అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తున్నారు
- దశాబ్దాల కిందటే గత ప్రభుత్వాలు వారికి భూములు అమ్మేశాయి.



హైదరాబాద్

పారిశ్రామిక వేత్తల భూములను.. ప్రభుత్వ భూములని ప్రచారం చేస్తున్నారని.. అవి ప్రభుత్వ భూములు కావు.. పరిశ్రమలకు అమ్మిన భూములు అంటూ మంత్రి శ్రీధర్‌బాబు స్పష్టత నిచ్చారు. తెలంగాణ అసెంబ్లీలో హిల్ట్ పాలసీపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన వాతావరణం ఇవ్వాలన్నదే తమ ఆలోచన అని.. పర్యావరణం బాగుచేయాలనే ఆలోచనతోనే హిల్ట్ పాలసీ తీసుకువచ్చినట్లు తెలిపారు. "హిల్ట్ పాలసీ కింద ఆరు నెలల గడువు ఇస్తాం. స్వచ్ఛందంగా ముందుకొస్తేనే భూములు కన్వర్ట్ చేస్తాం. - మిగతా3లో



### భారత సైన్యం దెబ్బకు అప్పుడు అమెరికాకు పరుగుపెట్టిన పాకిస్థాన్

- 50కి పైగా సమావేశాలు!
- ఆపరేషన్ సిందూర్ కోసం అమెరికాతో పాక్ లాబీయింగ్ కోసం ప్రయత్నం
- ప్రభుత్వాధికారులు, చట్ట సభ్యులు, మీడియా సంస్థలతో 50కి పైగా సమావేశాలు



### యూపీలో 'ఎస్ఐఆర్'

- వివిధ కారణాలతో 2.8 కోట్ల ఓట్ల తొలగింపు
- 15.44 కోట్ల నుంచి ఎస్ఐఆర్ తర్వాత 12.56 కోట్లకు తగ్గిన ఓటర్లు
- శాశ్వత వలస, మరణాలు, ఒకటి కంటే ఎక్కువ చోట రిజిస్ట్రేషన్ల ఓటర్ల తొలగింత
- అభ్యంతరాలు ఉంటే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సమర్పించవచ్చన్న అధికారులు

## మన పిల్లల భవిష్యత్‌ను నిర్దేశించేదే

# రైజింగ్ 2047

శాసనసభలో భట్టి విక్రమార్క

కఠినమైన లక్ష్యాలు నిర్దేశించుకుని ప్రభుత్వం ముందుకెళ్తున్నాం

- క్యూర్, ప్యూర్, రేర్ లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుంది
- కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్న భట్టి
- ఇది రాష్ట్ర, పిల్లల భవిష్యత్‌కు చాలా ముఖ్యం
- 2047పై సూచనలు, సలహాలు ఇవ్వాలి
- సింగరేణి ఆసుపత్రుల్లో మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది ఖాళీల భర్తీ
- సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ లాబ్ ప్రారంభిస్తాం
- సింగరేణిపై అసెంబ్లీలో సభ్యుల ప్రశ్నకు డిప్యూటీ సీఎం సమాధానం



హైదరాబాద్

మన పిల్లల భవిష్యత్‌ను నిర్దేశించేదే తెలంగాణ రైజింగ్-2047 అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. మనం కీలమైన మలుపు 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వద్ద ఉన్నామని అన్నారు. 1.2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని నిపుణులు చెబుతున్నారని 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఎదిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తెలంగాణకు భారీగా స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని కఠినమైన లక్ష్యాలు నిర్దేశించుకుని ముందుకెళ్తున్నట్లు తెలిపారు. క్యూర్, ప్యూర్, రేర్ అనే లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుందని ఉపముఖ్యమంత్రి భట్టి తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, తెలంగాణ రైజింగ్ 2047పై చర్చించాలని ప్రతిపక్షాలను కోరుతున్నట్లు చెప్పారు. ఇది రాష్ట్ర, పిల్లల భవిష్యత్‌కు చాలా ముఖ్యమని, 2047పై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. "మన పిల్లల భవిష్యత్‌ను నిర్దేశించేదే రైజింగ్ 2047. మనం కీలమైన మలుపు వద్ద నిలబడి ఉన్నాం. 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వద్ద ఉన్నాం. 1.2ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతామని - మిగతా3లో

## వాయు కాలుష్యంపై కారణాలు గుర్తించండి

ఢిల్లీ ప్రభుత్వానికి సుప్రీం సూచన

ఈ మేరకు వాయు కాలుష్యంపై ఏర్పాటైన క్యామ్‌కు ఆదేశాలు జారీ

సమస్యకు మూలాలు, కారణాలు కనుక్కోకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నా లాభం లేదు



## కేసీఆర్ ఒక రైతు.. రేవంత్‌రెడ్డిలా రియల్ ఎస్టేట్

# బ్రోకర్ కాదు

రేవంత్‌రెడ్డి పాలన చేతగాక బీఆర్ఎస్ మీద నిందలు వేస్తున్నాడు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

రైతులకు యూరియా ఇవ్వడంలో రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విఫలమైంది


సరిపడా యూరియా అందక రైతులు గోస పడుతున్నరు

'రైతులకు యూరియా తెలివిలేక నాటకాలాడుతున్న దద్దమ్మలు ఈ కాంగ్రెసోళ్లు'



జనగామ

సీఎం రేవంత్‌రెడ్డిపైన, రాష్ట్ర ప్రభుత్వంపైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించారు. రేవంత్‌రెడ్డి పాలన చేతగాక బీఆర్ఎస్ మీద నిందలు వేస్తున్నాడని ఆరోపించారు. ఏదో అడ్డిమారి గుడ్డిసూటిల సీఎం అయిన రేవంత్‌రెడ్డి.. మూడేళ్లు టైమ్‌పాస్ చేసిపోక అవాకులు, చెవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డికి రైతులకు యూరియా ఇయ్య చేతగాదుగానీ.. అబద్ధాలు అనర్గళంగా వస్తయని ఎద్దేవా చేశారు. 'కేసీఆర్‌ను మల్ల మొలకెత్తనియ్యను' అంటూ సీఎం రేవంత్‌రెడ్డి శపథం చేయడంపైనా కేటీఆర్ ఫైరయ్యారు. 'నువ్వేంది కేసీఆర్‌ను మొలకెత్తనియ్యకపోయేది' - మిగతా3లో



### కేంద్ర బడ్జెట్ 2026

## తేదీపై సందిగ్ధత

- ఫిబ్రవరి 1 లేదా 2..?
- సంప్రదాయాన్ని అనుసరిస్తారా..?
- బడ్జెట్‌పై మధ్యతరగతి ప్రజలు, రైతులు, యువత.. ఇలా ప్రతీ ఒక్కరూ కోటి ఆశలు
- నిర్మలమ్మ ప్రవేశపెట్టే ఈ బడ్జెట్ గురించి ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్రంగా చర్చ
- ఏటా బడ్జెట్‌ను ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది
- ఈ సారి ఫిబ్రవరి 1వ తేదీన ఆదివారం పడింది. దీంతో ఆ రోజు సెలవు కావడంతో బడ్జెట్ ప్రవేశ పెడతారా..? లేదా? అనే దానిపై సందిగ్ధత

## తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు

# లైన్ క్లియర్

- తెలంగాణ శాసనసభలో మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- 2019 మున్సిపల్ చట్టంలో కీలక మార్పు చేస్తూ బిల్లుకు సభ్యులు ఆమోదం
- ఓటర్ల జాబితా సవరణకు 60 రోజుల ముందే సమాచారం ఇవ్వాలన్న నిబంధన తొలగింపు
- ఈ నెల 10న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది




హైదరాబాద్

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు లైన్ క్లియర్ అయ్యింది. తెలంగాణ శాసనసభలో మున్సిపల్ చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. 2019 మున్సిపల్ చట్టంలో కీలక మార్పు చేస్తూ బిల్లుకు సభ్యులు ఆమోదం తెలిపారు. ఓటర్ల జాబితా సవరణకు 60 రోజుల ముందే సమాచారం ఇవ్వాలన్న నిబంధన తొలగించారు. దీంతో భారత ఎన్నికల సంఘానికి ముందస్తు సమాచారం అవసరం ఇక లేదు. ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ ప్రారంభం కాగా, ఈ నెల 10న తుది ఓటర్ల జాబితా విడుదల కానుంది. చట్ట సవరణతో మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ వేగవంతం కానుంది. ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వానికి పూర్తి వెసులుబాటు వచ్చింది. - మిగతా3లో

## సంపాదకీయం

# ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు, తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది. ప్రొఫెషనల్ అసిస్టెన్స్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ ఏప్రిల్‌లో ప్రచురించిన స్టేటస్ ఆఫ్ ఆదివాసీ లైవ్లీహుడ్ రిపోర్ట్, 2021 ప్రకారం, భారతదేశం లోని ఆదివాసీ జనాభా ఆదివాసీయేతర జనాభాతో పోలిస్తే పేద జీవన ప్రమాణాలను కలిగి ఉంది. దేశ జనాభాలో 8.6% మంది షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) ఉన్నారు. వారిలో ఎక్కువ మంది 'కొండలు మరియు అడవులు' తెగలుగా వర్గీకరించ బడ్డారు. ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ఆదివాసీ సంఘాలు అధికంగా నివసించే ప్రాంతాలను గుర్తించాలని రాష్ట్రాన్ని ఆదేశిస్తుంది. ఈ ప్రాంతాలలో వారిని, వారి గుర్తింపును పెంపొందించడానికి, వారిని అభివృద్ధి ప్రక్రియలో ఏకీకృతం చేయాలని నిర్దేశిస్తుంది. ఆర్టికల్ 275 రాష్ట్రాలకు ఆర్థిక కేటాయింపులు చేయడానికి స్పష్టమైన నిబంధనలను చేస్తుంది. ఆర్టికల్ 275 కింద నిధులతో కేంద్ర మద్దతు ఉన్న గిరిజన ఉప ప్రణాళికలతో పాటు గిరిజన ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి అనేక నిర్దిష్ట కార్యక్రమాలు రూపొందించి అమలు చేయబడ్డాయి. అయితే, ఈ ప్రయత్నాల ఫలితాలపై చాలా తక్కువ సమాచారం అందుబాటులో ఉందని నివేదిక ఎత్తి చూపింది. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో గతకేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంది కూడా. పోడు చేసుకుంటున్న ఆదివాసీలపై, పోడు భూముల్లో ఆదివాసీలు వేసుకున్న గుడిసెలను అటవీశాఖ అధికారులు తొలగించడం, దాడులు చేయడం, తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం, తమ గుడిసెలు తొలగించవద్దంటూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేయడం అక్కడక్కడా చోటు చేసుకుంటు న్నాయి. 1/70, పీసా, అటవి హక్కుల చట్టం అమలు చేయాలని, ఏజెన్సీలో భూ దురాక్రమణపై కమిటీ వేయాలని, ఏజెన్సీ ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా కలిపి స్వయం పాలన కల్పించాలని, ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు సంపూర్ణంగా ఆదివాసీలకే కేటాయించాలని, గొండు, కోయ వారికి పదో తరగతి వరకు వారి మాతృభాషలోనే బోధన చేయాలని, జిఒనెం.3ని అమలు చేయాలని ఆదివాసీలు చేసే డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తూ,

# శీతాకాలం.. గుండె పదిలం!



తీవ్రమైన చలివాతావరణం, ఆకస్మిక శీతగాలులు గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి. ఈ సీజన్‌లో గుండెపోటు కేసులు అత్యధికంగా నమోదవ్వటంతోపాటు గుండె సంబంధిత మరణాలు కూడా ఎక్కువగా కనిపిస్తుంటాయి. చలిగాలులు, జీవనశైలి మార్పులు గుండెపై ప్రభావాన్ని చూపిస్తాయి. చలివల్ల మనలో చురుకుతనం తగ్గటం, నిద్రమత్తు ఎక్కువగా ఉండటం, సోమరితనం, ఒకేచోట కదలకుండా ఎక్కువసేపు ఉండిపోవడంవల్ల గుండె ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది. ఈరోజు వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వయస్సుల వారికి గుండె సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా యువతలో గుండెపోటు సమస్యలకు శీతాకాలం ట్రిగ్గర్‌గా పనిచేస్తుంది. చలి, ఒత్తిడి, అనారోగ్యకరమైన అలవాట్లు మొదలైవి. శీతాకాలంలో గుండెపోటు రావడానికి కారణాలు అవుతున్నాయి. అతిచల్లదనంవల్ల శరీరం వెచ్చఉండటానికి రక్తనాళాలు ముఖ్యంగా కరోనరీ ఆర్టరీస్ (ధమనులు)సంకోచించడం, ఈ కాలంలో శరీర వ్యాయామం తక్కువయ్యి చెమట తక్కువగా ఉండటం వల్ల రక్తపరిమాణం పెరగటంతో రక్తపోటు అధికమవ్వడం, చలికి జీవక్రియ (మెటబాలిజం) నెమ్మదించడం, కొన్ని హార్మోన్ల ప్రభావంతో రక్తం గడ్డకట్టే స్వభావం ఎక్కువయ్యి గుండె సిరల్లో చిక్కుకొని రక్తప్రసరణను అడ్డుకోవడం వల్ల గుండెపోటు ప్రమాదాలు ఎక్కువ అవుతాయి. శీతాకాలం హృదయనాళ వ్యవస్థను అనేక విధాలుగా ప్రభావితం చేస్తుంది. అంతర్లీన గుండెజబ్బులు ఉన్నవారు ఈ సీజన్‌లో చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా వయో వృద్ధులు, హై బి.పి, షుగర్, ఇదివరకే గుండెజబ్బు ఉన్నవాళ్లు చాలాజాగ్రత్తగా ఉండాలి. 'కరోనరీ ఆర్టరీ డిసీజ్ ఉన్న వారిలో శీతాకాలంలో 'ఆంజినా'(ఛాతీ నొప్పి) తరుచూ వచ్చే అవకాశం ఉంటుంది. చల్లని వాతావరణంవల్ల రక్తనాళాలు కుచించుకుపోయి (వాసోకన్‌స్ట్రక్షన్), సహజ ప్రతిస్పందనవల్ల రక్త పోటు పెరగటం, గుండెకు ఆక్సిజన్ సరఫరా డిమాండ్ పెరగటం, శరీరానికి కావలసిన రక్తాన్ని గుండె సరిగా సరఫరా చెయ్యలేకపోవటం వల్ల గుండె వేగంగా కొట్టుకోవడం, గుండెపై ఒత్తిడి పెరిగి స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంటుంది. ఇంకొక సాధారణ సమస్య 'అరిథ్మియా'. ఆకస్మిక ఉష్ణోగ్రత మార్పుల వల్ల, శీతాకాలంలో క్రమరహిత గుండె లయలు ఏర్పడుతాయి. చల్లనిగాలి గుండె విద్యుత్ వ్యవస్థను చికాకుపెడుతూ, దుర్బలవ్యక్తుల్లో అసాధారణ లయలు ఏర్పడుతాయి. శీతాకాలంలో శారీరక చురుకుదనం తగ్గిపోవడం, వేపుళ్లు, మసాలాలు ఎక్కువగా తినడం, అధిక ఒత్తిడి కూడా గుండెకు చేటుతెస్తాయి. శరీరం బరువును అదుపులో ఉంచుకోవాలి. ఎందుకంటే, అధిక బరువువల్ల ముఖ్యంగా యువతలో హృదయ స్పందనరేటు పెరుగుతుంది తద్వారా గుండెపై భారం పడుతుంది. చలికాలంలో గుండె సమస్యలు ఇబ్బంది పెట్టకుండా ఎలా నిర్వహించాలి? శరీర ఉష్ణోగ్రతలు పడిపోకుండా వెచ్చని దుస్తులు ధరించాలి. నడక, యోగలాంటి స్వల్ప వ్యాయామాలు చెయ్యాలి. మెడిటేషన్ (ధ్యానం ) కూడా బాగా ఉపయోగపడుతుంది. పొగతాగడం, మద్యం మానెయ్యాలి లేదా బాగా తగ్గించాలి. పోషకాలు అధికంగా ఉండే తాజా ఆహార పదార్థాలు, పప్పుధాన్యాలు, పండ్లు, గింజలు, తృణధాన్యాలు మొదలైవి ఎక్కువగా తీసుకుంటూ, దాహం అనిపించకపోయినా మంచినీళ్లు బాగా (గోరువెచ్చగా) తాగాలి. దీనివల్ల ఆరోగ్యం ఆకస్మికంగా ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. గుండె వైఫల్యం చెందేవరకు మనం గమనించలేమని తెలుసుకోవాలి. వృద్ధులు, గుండెజబ్బులు ఉన్నవారు, అధికరక్తపోటు, మధుమేహం ఉన్న వారు, శరీరబరువు అధికంగా ఉన్నవారు, అతి బలహీనంగా ఉన్నవారు, మానసికంగా ఒత్తిడిలో ఉన్నవారు, ఆరుబయట ఎక్కువసేపు పని చేసేవారు, చలిప్రభావం వల్ల మాత్రమే అసౌకర్యంగా ఉండవచ్చని నిర్లక్ష్యం చెయ్యకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని, అవసరం అనిపిస్తే వైద్య సలహా తీసుకోవడం మంచిది. రక్తపోటు(బిపి), షుగర్, కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోండి. ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా తలతిరుగుతున్నట్లు అనిపిస్తే, ఎడమచేయి, మెడ, దవడతోపాటు వీపుకు ప్రసరించే నొప్పి, అసాధారణ అలసట, ఆకస్మిక బలహీనత, మైకంగా ఉండటంవంటి లక్షణాలు నిరంతరంగా ఉన్నట్లు అనిపిస్తే వెంటనే సపంలోని వైద్యుడిని సంప్రదించండి. ఈ చిన్నమార్పులతో, శీతాకాలంలో గుండెపోటు ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. అకాల మరణాలను కూడా నివారించవచ్చు !

# ఎంజీ నరేగా పై దాడి.. రాజ్యాంగ నిర్మూలనకు ముందస్తు సంకేతమా?



డా. దామోదర రావు తానికొండ
ఏఐసీసీ నేషనల్ కోఆర్డినేటర్ (ఎస్సీ విభాగం

ఇటీవలి కాలంలో బీజేపీ ప్రభుత్వం తీసుకుంటున్న అత్యంత ప్రమాదకర నిర్ణయాలలో ఒకటి లిమహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజీ నరేగా)ను బలహీనపరచడం, క్రమంగా దాన్ని నిర్వీర్యం చేయడం, చివరికి పూర్తిగా తీసేయాలన్న దిశగా అడుగులు వేయడమే. లిఎంజీ నరేగా కేవలం ఒక పథకం కాదు. అది ఈ దేశంలో దళితులు, బహుజనులు, ఆదివాసీలు, గ్రామీణ పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా రాజ్యాంగం ఇచ్చిన జీవన హక్కుకు ప్రత్యక్ష రూపం. పని అడిగితే పని ఇవ్వాలి అనే భావన – ఇది దానం కాదు, ఇది హక్కు. ఈ హక్కును బీజేపీ ప్రభుత్వం లక్ష్యంగా చేసుకోవడం అనేది యాదృచ్ఛిక నిర్ణయం కాదు. ఇది ఒక రాజకీయ సామాజిక సంకేతం. బీజేపీ ఈ దేశ ప్రజలకు ఏమి చెబుతోంది? "మేము దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన, కోట్ల మంది జీవితాలతో ముడిపడి ఉన్న చట్టాన్నే తీసేయగలము." "మేము కోరుకుంటే రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కూడా తుడిచివేయగలము."లి "మాకు ఎలాంటి ప్రతిఘటన రాదు."లి ఇది కేవలం ఎంజీ నరేగా మీద దాడి కాదు. ఇది రాజ్యాంగ నిర్మూలనకు రిహార్సల్. డా. బి.ఆర్. అంబేద్కర్ హెచ్చరించిన మాటలు ఇక్కడ గుర్తు చేసుకోవాలి: "హక్కులు ఒకసారి కోల్పోతే, తిరిగి సాధించడం రక్తపాతం లేకుండా సాధ్యం కాదు." ఎంజీ నరేగా అనేది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వం), ఆర్టికల్ 21 (జీవన హక్కు), ఆర్టికల్ 23 (బలవంతపు శ్రమ నిషేధం) ల ఆత్మకు నేరుగా అనుసంధానమైన చట్టం. అలాంటి చట్టాన్ని తొలగించాలన్న ప్రయత్నం అంటే, రాజ్యాంగాన్ని పక్కన పెట్టగలమనే అహంకార ప్రకటన మనుస్మృతి ఆధారిత వ్యవస్థ వైపు తీసుకెళ్లే స్పష్టమైన అడుగు మనుస్మృతి లో ఉపాధి హక్కు లేదు. అక్కడ కేవలం ఎవరు పని చేయాలి ఎవరు పాలించాలి ఎవరు సేవ చేయాలి అనే నిర్ణయాలు మాత్రమే ఉంటాయి. ఎంజీ నరేగా ను చంపాలన్న ప్రయత్నం అంటే, గ్రామీణ పేదలను మళ్లీ బానిసలుగా మార్చే ప్రయత్నం దళిత బహుజనులను ప్రభుత్వంపై ఆధారపడకుండా, పైకులాల దయపై ఆధారపడే స్థితికి నెట్టే యత్నం అంబేద్కర్ చాలా స్పష్టంగా చెప్పారు: "ఆర్థిక ప్రజాస్వామ్యం లేకుండా, రాజకీయ ప్రజాస్వామ్యం ఒక మాయ మాత్రమే." అని ఎంజీ నరేగా లాంటి పథకాలను ధ్వంసం చేయడం ద్వారా, బీజేపీ ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని తొలగించి, రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ఖాళీ నినాదంగా మార్చుతోంది. ఇది ఒక హెచ్చరిక. ఇది ఒక బలమైన ప్రమాద సూచిక. ఈ రోజు ఎంజీ నరేగా. రేపు రిజర్వేషన్లు. ఎల్లుండి రాజ్యాంగమే. కాబట్టి ఇది ఇక రాజకీయ చర్చ కాదు. ఇది రాజ్యాంగం బతకాలా? లేక మనువాదం పాలించాలా? అనే తుది నిర్ణయం. ఎంజీ నరేగా పై దాడి మనకు ఇచ్చిన సంకేతాన్ని దేశం విస్మరించకూడదు. ఇది ప్రారంభం మాత్రమే. డా. అంబేద్కర్ చివరి హెచ్చరికను ఈ దేశం మళ్లీ వినాలి: "మీ స్వేచ్ఛను ఎవరూ దోచుకోలేరు; మీరు నిర్లక్ష్యం చేస్తే మాత్రమే అది పోతుంది." ఇప్పుడు మౌనంగా ఉంటే చరిత్ర క్షమించదు. నిలబడితే మాత్రమే రాజ్యాంగం నిలబడుతుంది. రాజ్యాంగం నిలబడితేనే భారతదేశం నిలబడుతుంది. రాజ్యాంగం లేదా మనుస్మృతి?లిభారత ప్రజాస్వామ్యం నిలబడుతుందా, కూలిపోతుందా?లి ఆర్ఎస్ఎస్ బీజేపీ అధికార రాజకీయాల వెనుక దాగిన అసలు అజెండా దళితులు, బహుజనులు, మైనారిటీలపై జరుగుతున్న మౌన యుద్ధం. భారతదేశం ఈ రోజు ఒక సాధారణ రాజకీయ మలుపులో లేదు. ఇది ఎన్నికల పోరాటం మాత్రమే కాదు. ఇది రాజ్యాంగం మరియు మనుస్మృతి మధ్య జరుగుతున్న నిర్ణయాత్మక యుద్ధం. ఈ యుద్ధంలో గెలిచేది ఎవరు అన్నదానిపై కాదు భారతదేశం భవిష్యత్తు ఉంటుందా ఉండదా అన్నదానిపై ఫలితం ఆధారపడి ఉంది. ప్రస్తుతం ఆర్ఎస్ఎస్ భావజాలానికి రాజకీయ రూపంగా మారిన బీజేపీ ప్రభుత్వం, ప్రజాస్వామ్యాన్ని క్రమంగా ఖాళీ చేస్తూ అధికారాన్ని తమ చేతుల్లో కేంద్రీకరించే దిశగా వేగంగా ప్రయాణిస్తోంది. ఓటు హక్కును కట్టడి చేసే ప్రక్రియలు, ఓటర్ల జాబితాల మార్పులు, ఈవీఎంలపై అనుమానాలు, ఎన్నికల కమిషన్ స్వతంత్రతపై ప్రశ్నలు ఇవన్నీ విడివిడిగా జరిగే సంఘటనలు కావు. ఇవన్నీ ఒకే దిశలో నడిచే సంఘటిత వ్యూహం. బీజేపీ లక్ష్యం కేవలం అధికారం కాదు అది వ్యవస్థ మార్పు బీజేపీని కేవలం "ఒక రాజకీయ పార్టీ"గా చూడడం పెద్ద పొరపాటు. అది ఒక రాజకీయ సాధనం మాత్రమే. దాని వెనుక పనిచేస్తున్న శక్తి ఆర్ఎస్ఎస్. ఆర్ఎస్ఎస్ లక్ష్యం ఎన్నికలు గెలవడం కాదు; సామాజిక వ్యవస్థను తిరిగి మనువాద దిశగా మలచడం. భారత రాజ్యాంగం ఈ దేశాన్ని లౌకికంగా సమానత్వ ఆధారంగా హక్కుల ఆధారంగా నిర్మించింది. అదే ఆర్ఎస్ఎస్ బీజేపీకి ప్రధాన సమస్య. ఎందుకంటే రాజ్యాంగం ఉన్నంత కాలం దళితుడు తలెత్తి నిలబడగలడు, బహుజనుడు ప్రశ్నించగలడు, మైనారిటీ పౌరుడిగా హక్కులు కోరగలడు, మహిళ స్వేచ్ఛగా జీవించగలదు. అందుకే రాజ్యాంగం వీరికి అడ్డంకి. డా. బి.ఆర్. అంబేద్కర్ హెచ్చరించారు: "హిందూ రాజ్యం ఏర్పడితే, అది ఈ దేశానికి అతి పెద్ద విపత్తు అవుతుంది. దాన్ని ఏ ధర చెల్లించి అయినా అడ్డుకోవాలి." ఈ మాటలు ఈ రోజు అత్యంత సమకాలీనమైనవి. మనుస్మృతి : చరిత్ర కాదు తిరిగి తీసుకు రావాలనుకుంటున్న భవిష్యత్తు చాలామంది అనుకుంటారు మనుస్మృతి ఒక పాత గ్రంథం, చరిత్రలో మిగిలిపోయింది అని. అది నిజం కాదు. మనుస్మృతి ఒక పుస్తకం మాత్రమే కాదు; అది ఒక ఆలోచనా వ్యవస్థ. ఆ ఆలోచన ఏమిటంటే: కొంతమంది మాత్రమే పాలించాలి మిగిలినవారు సేవ చేయాలి దళితుడు ఎప్పటికీ దిగువవాడే మహిళ స్వతంత్రంగా ఆలోచించకూడదు ఈ ఆలోచనలే మనువాదం. ఈ రోజు మనుస్మృతి గురించి ప్రత్యక్షంగా మాట్లాడకపోయినా, రాజ్యాంగాన్ని అవమానించడం, అంబేద్కర్‌ను తక్కువచేయడం, సమానత్వాన్ని "పాశ్చాత్య ఆలోచన"గా తిట్టడం ఇవన్నీ అదే మనువాదానికి మార్గం సుగమం చేయడం. అంబేద్కర్ అన్నారు: "మనుస్మృతి భారతదేశంలో అత్యంత అన్యాయమైన గ్రంథం. అది మానవత్వానికి విరుద్ధం." ఈ రోజు అదే గ్రంథాన్ని తిరిగి సామాజిక చైతన్యంలోకి తీసుకురావాలన్న ప్రయత్నం జరుగుతోంది. దళితులు, మహిళలు, మైనారిటీలు మొదటి బలులు మనువాద రాజ్యం ఏర్పడితే మొదటగా నష్టపోయేది ఎవరు? స్పష్టమైన సమాధానం దళితులు, బహుజనులు, మైనారిటీలు, మహిళలు. ఒకప్పుడు దళితులకు దేవాలయ ప్రవేశం లేదు మహిళలకు చదువు లేదు ప్రశ్నించే హక్కు లేదు ఇవన్నీ చట్టబద్ధంగా ఉండేవి. ఈ వ్యవస్థను కూల్చింది రాజ్యాంగం. అంబేద్కర్ స్పష్టంగా చెప్పారు: "రాజకీయ ప్రజాస్వామ్యం, సామాజిక ప్రజాస్వామ్యం లేకుండా నిలబడదు." రాజ్యాంగం లేకపోతే, ఈ సమాజం మళ్లీ వెనక్కి నడుస్తుంది శతాబ్దాల వెనక్కి. ప్రతిపక్షాల వైఫల్యం చరిత్ర క్షమించదు ఈ ప్రమాదకర సమయంలో ప్రతిపక్ష రాజకీయ పార్టీలు చిన్నచిన్న లెక్కల్లో చిక్కుకుని ఉన్నాయి. ఎవరి స్వార్థాలు వారు చూసుకుంటూ, బీజేపీని ఎదుర్కోవడంలో విఫలమవుతున్నారు. ఆంధ్రప్రదేశ్ విభజనను చూపిస్తూ కాంగ్రెస్‌ను శాశ్వత శత్రువుగా భావించే ధోరణి ఉంది. కానీ ప్రశ్న ఇది కాదు కాంగ్రెస్ మంచిదా చెడ్డదా ప్రశ్న ఇది రాజ్యాంగం బతకాలా? లేక మనువాదం రావాలా? ఒక పెద్ద శత్రువును ఎదుర్కోవాలంటే, గత విభేదాలను పక్కన పెట్టాల్సిందే. ఇది రాజకీయ వ్యూహం కాదు; ఇది జాతీయ అవసరం. అంబేద్కర్ అన్నారు: "ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉన్నప్పుడు, తటస్థంగా ఉండడం కూడా ఒక నేరమే." చిన్న రాష్ట్రాలు అంబేద్కర్ ఆలోచనకు వక్రీకరణ చిన్న రాష్ట్రాలు ప్రజా ప్రయోజనానికి అనుకూలమని అంబేద్కర్ చెప్పారు. పరిపాలన ప్రజలకు చేరువ అవుతుందని ఆయన విశ్లేషించారు. కాబట్టి రాష్ట్ర విభజనను మాత్రమే కారణంగా చూపి ప్రజాస్వామ్య శక్తులకు దూరంగా ఉండటం రాజకీయ అజ్ఞానం మాత్రమే కాదు చారిత్రక తప్పిదం. ఇది ఓటు కాదు ఇది నిర్ణయం ఇది సాధారణ ఎన్నిక కాదు. ఇది ఓటు కాదు తీర్పు. రాజ్యాంగం వైపా? మనుస్మృతి వైపా? అంబేద్కర్ చివరగా హెచ్చరించారు: "రాజ్యాంగం ఎంత మంచిదైనా, దాన్ని రక్షించే ప్రజలు లేకపోతే అది నిరుపయోగమే." ఈ రోజు ఆ బాధ్యత మనందరి మీద ఉంది. మౌనంగా ఉంటే చరిత్ర మన్నించదు. నిలబడితే మాత్రమే భారతదేశం నిలబడుతుంది.

# వెనెజువెలా సంక్షోభం

అమెరికా, వెనెజువెలా మధ్య కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారతదేశంపై తక్షణ ప్రభావం చూపబోవని, ప్రస్తుత పరిస్థితుల్లో భారత దేశ చమురు దిగుమతి వ్యయం పెరిగే అవకాశం లేదని మంగళవారం విడుదలైన ఒక నివేదిక స్పష్టం చేసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు సరఫరా అవసరానికి మించి (గ్లట్ మోడ్) ఉండటం, అంతర్జాతీయ ఉత్పత్తిలో వెనెజువెలా వాటా కేవలం 1 శాతం మాత్రమే కావడం ఇందుకు ప్రధాన కారణాలు. అందువల్ల, వెనెజువెలాలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నా, భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నివేదిక భరోసా ఇచ్చింది. వెనెజువెలాలో నిరూపితమైన చమురు నిల్వలు చాలా ఎక్కువని, ప్రపంచ మొత్తం నిల్వల్లో దాదాపు 19.4 శాతం అక్కడే ఉన్నాయని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక పేర్కొంది. ఈ భారీ నిల్వలను వెలికితీసి, సరఫరా పెంచేందుకు అమెరికా కంపెనీలు రంగంలోకి దిగవచ్చన్న మార్కెట్ అంచనాలతో ఇప్పటికే అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. ఈ పరిణామం భారత్‌కు మేలు చేసే అంశమని విశ్లేషకులు భావిస్తున్నారు. "ప్రస్తుత ప్రపంచ సరఫరా పరిస్థితులు, మిగులు నిల్వలను పరిగణనలోకి తీసుకుంటే, సమీప భవిష్యత్తులో భారత్ ఆయిల్ దిగుమతి బిల్లు పెరిగే ప్రమాదం కనిపించడం లేదు" అని నివేదికలో స్పష్టం చేశారు. ఒకవేళ అమెరికా కంపెనీలు వెనెజువెలాలో ఉత్పత్తిని పెంచితే, అంతర్జాతీయంగా ధరలు మరింత తగ్గి, భారత్ సహా అన్ని దేశాలకూ లబ్ధి చేకూరుతుందని మరో నివేదికలో విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.





**భారత్-వెనెజువెలా వాణిజ్య సంబంధాలు**

భారత్, వెనెజువెలా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ప్రస్తుతం 1.9 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో భారత్ నుంచి ఎగుమతులు 217 మిలియన్ డాలర్లు కాగా, దిగుమతులు 1.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ దిగుమతుల్లో పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్స్ (ఫూూా) వాటానే అత్యధికం. "భారత్ దిగుమతి చేసుకుంటున్న దేశాలతో పోలిస్తే వెనెజువెలా నుంచి వస్తున్న ముడి చమురు యూనిట్ విలువ తక్కువగా ఉంది. ఇది మన దిగుమతి ఖర్చులను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది" అని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థికవేత్త దీపాన్వితా మజుందార్ వివరించారు.

అయితే, గత ఐదేళ్లుగా వెనెజువెలాకు భారత ఎగుమతులు సగటున ఏటా 8.8 శాతం మేర క్షీణిస్తున్నాయి. ఇదే సమయంలో ప్రపంచానికి భారత్ చేస్తున్న మొత్తం ఎగుమతులు 6.9 శాతం వృద్ధి చెందాయి. దీన్నిబట్టి వెనెజువెలాతో వాణిజ్య సంబంధాలు మందగించాయని అర్థమవుతోంది. వెనెజువెలా నుంచి ముడి చమురును అధికంగా ఎగుమతి చేసుకుంటున్న దేశాల్లో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత చైనా, భారత్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొనసాగుతున్న చర్చల్లో చమురు దౌత్యం కీలక పాత్ర పోషిస్తోంది. కాగా, ఈ ప్రాంతంలోని భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా వెనెజువెలాలో భారీ పెట్టుబడులు పెట్టడానికి కంపెనీలు వెనకడుగు వేయవచ్చని, ఇది చమురు ఉత్పత్తి పెంపునకు అడ్డంకిగా మారవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# కేంద్ర బడ్జెట్ 2026 తేదీపై సందిగ్ధత

కొంగొత్త ఆశలతో కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టాం. కేంద్ర ప్రభుత్వం కూడా వచ్చే ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టేందుకు సిద్ధమవుతోంది. ఈ బడ్జెట్‌పై మధ్యతరగతి ప్రజలు, రైతులు, యువత.. ఇలా ప్రతీ ఒక్కరూ కోటి ఆశలు పెట్టుకున్నారు. అదే సమయంలో నిర్మలమ్మ ప్రవేశపెట్టే ఈ బడ్జెట్ గురించి ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్రంగా చర్చ నడుస్తోంది.



**ఎందుకంత చర్చ..?**

ఏటా బడ్జెట్‌ను ఫిబ్రవరి 1వ తేదీన ప్రవేశపెట్టడం ఆనవాయితీగా వస్తోంది. 2017 నుంచి ఇదే సంప్రదాయం కొనసాగుతోంది. అయితే, ఈ సారి ఫిబ్రవరి 1వ తేదీన ఆదివారం పడింది. దీంతో ఆ రోజు సెలవు కావడంతో బడ్జెట్ ప్రవేశ పెడతారా..? లేదా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం బడ్జెట్‌ను ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టొచ్చన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఈ అంశం ఆసక్తికరంగా మారింది. అయితే, దీనిపై కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు.

**ఆదివారం కూడా పార్లమెంట్..**


అయితే, వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టడం కొత్తేమీ కాదు. 2016 తొలిసారి అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ వార్షిక బడ్జెట్‌ను ఆదివారమే ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 2025లో బడ్జెట్‌ను నిర్మలమ్మ శనివారం ప్రవేశపెట్టారు. గతంలో ఆదివారాల్లో పార్లమెంట్ సమావేశమైన సందర్భాలు కూడా ఉన్నాయి. కరోనా సమయంలో (2020), అలాగే పార్లమెంట్ తొలి సమావేశం 60వ వార్షికోత్సవం సందర్భంగా 2012, మే13వ తేదీన ఆదివారం నాడు సభ జరిగింది. ఈ లెక్కన పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం నాడు కూడా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం లేకపోలేదు.

**ఫిబ్రవరి 1నే ఎందుకు..?**

పలు నివేదికల ప్రకారం.. గతంలో కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి రోజున సమర్పించేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద ప్రక్రియ ఆలస్యమయ్యేది. దీంతో కొత్త ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి ప్రభుత్వ ఖర్చుల కోసం భారత కన్సాలిడేటెడ్ ఫండ్ నుంచి నిధులను ఉపసంహరించుకునేందుకు వీలుగా పార్లమెంట్ 'ఓట్ ఆన్ అకౌంట్'ను ఆమోదించాల్సి వచ్చేది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీలు శాఖాపరమైన డిమాండ్లను వివరంగా పరిశీలించిన తర్వాత, మిగిలిన సంవత్సరానికి పూర్తి బడ్జెట్‌ను ఆమెదించేవారు. ఇది తీవ్ర జాప్యాలకు దారితీస్తుండటంతో.. దీన్ని నివారించేందుకు 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల ఏప్రిల్ 1న ఆర్థిక సంవత్సరం ప్రారంభానికి ముందే అంటే మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తుంది.

# స్టాలిన్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ.. స్తంభంపై దీపం వెలిగించేందుకు కోర్టు అనుమతి

తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. మధురైలోని తిరుపరంకుండ్రం కొండపై ఉన్న రాతి స్తంభంపై దీపం వెలిగించొచ్చు అంటూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను తాజాగా మద్రాస్ హైకోర్టు (మధురై బెంచ్) సమర్థించింది. గత కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ స్తంభంపై దీపం వెలిగించేందుకు ప్రయత్నించగా.. ప్రభుత్వం అడ్డుకుంది. అక్కడ దీపం వెలిగించడానికి వీల్లేదని ఆదేశించింది. పక్కనే దర్గా ఉండటం వల్ల, శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని ప్రభుత్వం అభిప్రాయపడింది. అంతేకాదు.. అక్కడ దీపం వెలిగించకూడదని శాస్త్రాల్లో ఉన్నట్లు ప్రభుత్వం తెలిపింది. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రామ రవికుమార్ సహా పలువురు గత డిసెంబర్ 1న మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్తంభంపై దీపం వెలిగించేందుకు అనుమతించాలని కోరారు. దీనిపై స్పందించిన సింగిల్ జడ్జి.. దీపం వెలిగించేందుకు అనుమతిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు ప్రభుత్వం, దర్గా కమిటీ, వక్ఫ్ బోర్డు మద్రాస్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సింగిల్ జడ్జి నిర్ణయాన్ని కొట్టివేయాలి కోరారు. ఈ సందర్భంగా పలు అంశాల్ని కోర్టుకు తెలిపారు. దీప స్తంభం ఉన్న దేవాలయం దర్గాకు చెందినదని, ఇక్కడ దీపం వెలిగించకూడదని శాస్త్రంలో ఉందని, అలాగే దీపం వెలిగించడం వల్ల శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని తమిళనాడు ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ జి.జయచంద్రన్, జస్టిస్ కేకే రామకృష్ణన్ లతో కూడిన ధర్మాసనం ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకించింది. ఏడాదిలో ఒక రోజు దీపం వెలిగించినంత మాత్రాన శాంతి భద్రతల సమస్య తలెత్తదని అభిప్రాయపడింది. అలాగే దీపం వెలిగించొద్దని శాస్త్రాల్లో లేదనేందుకు తగిన ఆధారాల్ని కోర్టుకు సమర్పించలేదని తెలిపింది. ఈ విషయంలో ప్రభుత్వ రాజకీయ దురుద్దేశం కనిపిస్తోందని కోర్టు అభిప్రాయపడింది. ఒకవేళ ఇక్కడ ఇబ్బంది కలిగితే.. అది ప్రభుత్వమే చేయించడానికి అవకాశం ఉందని, ప్రభుత్వం అలా దిగజారబోదని భావిస్తున్నట్లు తెలిపింది. ఇరు పక్షాల వాదనలు విన్న ధర్మాసనం ఆ రాతి స్తంభంపై దీపం వెలిగించేందుకు అనుమతించింది. గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సమర్థిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంపై తమిళనాడు బీజేపీ నేత అన్నామలై హర్షం వ్యక్తం చేశారు.



## వాయు కాలుష్యంపై కారణాలు గుర్తించండి..

ఢిల్లీలో పెరిగిపోతున్న వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. వాయు కాలుష్యాన్ని నియంత్రించాలంటే ముందుగా.. కాలుష్యానికి గల కారణాలు గుర్తించాలని సూచించింది. ఈ మేరకు వాయు కాలుష్యంపై ఏర్పాటైన క్యామ్ (కమిషన్ ఫర్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్ మెంట్)కు ఆదేశాలు జారీ చేసింది. వాయు కాలుష్యానికి పరిష్కారాలు వెతకడానికి ముందు.. కారణాలు కనుగొనడంపై దృష్టి పెట్టాలని సూచించింది. ఢిల్లీలో వాయు కాలుష్యంపై దాఖలైన పలు పిటిషన్లపై విచారణ జరిపిన చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. సమస్యకు మూలాలు, కారణాలు కనుక్కోకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నా లాభం లేదని అభిప్రాయపడింది. రెండు వారాల్లోగా వివిధ రంగ నిపుణులను గుర్తించి, వారితో చర్చించి, ఢిల్లీ వాయు కాలుష్యానికి గల కారణాలు తెలుసుకోవాలని ఆదేశించింది. వివిధ రంగాలకు చెందిన నిపుణుల్ని గుర్తించి, అందరినీ ఒకే తాటిపైకి తీసుకురావడం, సరైన వివరాలు నమోదు చేయడం క్యామ్ బాధ్యత అని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాల్ని ప్రజలకు అందుబాటులో ఉంచి, జవాబుదారీతనాన్ని పాటించాలని సూచించింది. వాయు కాలుష్యంపై కోర్టుకు పూర్తి అవగాహన లేకపోవచ్చని, అయితే, నిపుణుల ద్వారా సరైన నిర్ణయం తీసుకునేలా చూస్తామని తెలిపింది. సమస్యలు గుర్తిస్తే, పరిష్కారం అదే లభిస్తుందని కోర్టు అభిప్రాయపడింది. ఎక్కువ వాయు కాలుష్యానికి కారణమవుతున్న వాటిని ముందుగా గుర్తించి, వాటిని అడ్డుకునేందుకు దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకెళ్లాలని, అయితే, క్యామ్ కు అంత తొందరేం కనిపించడం లేదని కోర్టు అభిప్రాయపడింది. ఏటికేడు ఢిల్లీలో వాయు కాలుష్యం పెరిగిపోతున్న విషయాన్ని గుర్తించాలని సూచించింది. కాలుష్యానికి కారణమవుతున్న నిర్మాణాలు, వాహనాలపై ప్రధానంగా దృష్టి పెట్టాలని కోరింది.

## భారత సైన్యం దెబ్బకు అప్పుడు అమెరికాకు పరుగుపెట్టిన పాకిస్థాన్...



భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ అమెరికాతో లాబీయింగ్ కోసం ప్రయత్నించింది. ఈ మేరకు 50కి పైగా సమావేశాలు నిర్వహించినట్లు తెలుస్తోంది. యూఎస్ ఫారిన్ ఏజెంట్స్ రిజిస్ట్రేషన్ యాక్ట్ కింద దాఖలైన పత్రాలను ఉటంకిస్తూ ఓ జాతీయా మీడియా సంస్థ కథనాన్ని ప్రచురించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో అమెరికా ప్రభుత్వాధికారులు, చట్ట సభ్యులు, మీడియా సంస్థలతో పాక్ బృందాలు 50కి పైగా సమావేశాలు జరిపినట్లు సమాచారం. 60 మంది అధికారులు, మధ్యవర్తులకు ఈ-మెయిల్స్, ఫోన్ కాల్స్ చేశాయి. అమెరికా అధికారులతో వ్యక్తిగత సమావేశాలు కూడా నిర్వహించాయి. భారత సైనిక చర్యను ఆపే లక్ష్యంతో వాషింగ్టన్ జోక్యం చేసుకునేందుకు షెహబాజ్ షరీఫ్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నించింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో జరిగిన ఈ సమావేశాల్లో కశ్మీర్ అంశం, ప్రాంతీయ భద్రత, అరుదైన ఖనిజాలు, ద్వైపాక్షిక సంబంధాల గురించి కూడా చర్చించినట్లు తెలుస్తోంది. లాబీయింగ్ కోసం ఆ దేశం భారీగా ఖర్చు చేసిందని, ఆపరేషన్ సిందూర్ జరిగిన సమయంలో ఆ మొత్తం భారీగా పెరిగిందని అమెరికాలోని ఓ ప్రముఖ మీడియా సంస్థ పరిశోధనలో తేలినట్లు వెల్లడించింది. ట్రంప్ యంత్రాంగానికి మరింత చేరువయ్యేందుకు దౌత్య, వాణిజ్యపరమైన అంశాల్లో అనుకూల ఫలితాలు పొందేందుకు లాబియింగ్ సంస్థలతో ఒప్పందం కూడా కుదుర్చుకుంది.

## యూపీలో 'ఎస్ఐఆర్'..



ఉత్తరప్రదేశ్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసింది. మొత్తం 15.44 కోట్ల మంది ఓటర్లలో 2.8 కోట్ల మంది ఓటర్లను తొలగించినట్లు ఈసీ తెలిపింది. శాశ్వతంగా వలసపోయిన వారు, మరణించిన వారు, బహుళ రిజిస్ట్రేషన్లు వంటి కారణాల వల్ల ఈ తొలగింపులు జరిగాయని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి నవదీప్ రిన్వా తెలిపారు. ప్రస్తుతం 12.55 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితాలో కొనసాగించినట్లు ఆయన వెల్లడించారు. తొలగించిన 2.89 కోట్ల మందిలో 46 లక్షల మంది మరణించారని, 2.17 కోట్ల మంది ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లారని, 25.47 లక్షల మంది ఒకటి కంటే ఎక్కువచోట్ల ఓటర్లుగా నమోదు చేసుకున్నారని అధికారులు తెలిపారు. ప్రత్యేక సమగ్ర సవరణకు ముందు ఉత్తరప్రదేశ్‌లో 15.44 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వివిధ కారణాల వల్ల ఓటర్ల తొలగింపుల అనంతరం ఆ సంఖ్య 12.56 కోట్లకు తగ్గింది. ఓటర్లు తమ పేరు ముసాయిదా జాబితాలో ఉందో లేదో యాప్ ద్వారా లేదా ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని అధికారులు సూచించారు. ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ విధానాల్లో అభ్యంతరాలను స్వీకరిస్తామని, వాటిని పరిష్కరించిన తర్వాత తుది జాబితాను మార్చి 6న విడుదల చేస్తామని అధికారులు తెలిపారు.

## ముంబై, ఢిల్లీ నుంచి కోనసీమకు ఓఎన్జీసీ నిపుణుల బృందం



**మోరి:** కోనసీమలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జిల్లా మలికిపురం మండలం ఇరుసమండలోని మోరి-5 డ్రిల్లింగ్ సైటులో సోమవారం భారీ స్థాయిలో అగ్నిజ్వాలలు ఎగిసిపడిన విషయం తెలిసిందే. ఆ అగ్నికీలలు సుమారు 25 మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ మంటల్ని ఆర్పేందుకు ఓఎన్జీసీ నిపుణుల బృందం ముంబై, ఢిల్లీ నుంచి వస్తున్నట్లు అధికారి తెలిపారు. అయితే సోమవారంతో పోలిస్తే ఇవాళ కాస్త అగ్నిమంటల తీవ్రత తగ్గినట్లు తెలుస్తున్నది. మహారత్న కంపెనీ దీన్ని ఆపరేట్ చేయడం లేదు. అహ్మదాబాద్‌కు చెందిన డీప్ ఇండస్ట్రీస్ కంపెనీ ఈ వెల్‌ను ఆపరేట్ చేస్తున్నది. ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు అగ్నిమాపక సిబ్బంది నీటి గొడుగును తయారు చేసింది. కానీ ఇంకా కొంత వరకు జ్వాలలు వస్తూనే ఉన్నాయి. అయితే నిపుణుల బృందం వచ్చిన తర్వాత పరిస్థితిని అంచనా వేస్తారని, ఆ తర్వాత మంటల్ని ఆర్పే ప్రక్రియ చేపడుతారని కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ టీ నిషాంతి తెలిపారు. ముంబై, ఢిల్లీ నుంచి నిపుణుల బృందం వస్తున్నట్లు చెప్పారు. అగ్నిజ్వాలలు ఎగిసిపడిన ప్రదేశం సమీపంలో ఉన్న సుమారు 600 మంది గ్రామస్థులను సురక్షిత ప్రాంతానికి తరలించారు. డీప్ ఇండస్ట్రీస్ సంస్థ మోరి-5 వెల్‌ను గత ఏడాది నుంచి ఆపరేట్ చేస్తున్నది.

# మన పిల్లల భవిష్యత్‌ను నిర్దేశించేదే రైజింగ్ 2047

-మొదటిపేజీ తరువాయి

నిపుణులు చెబుతున్నారు. 3 ట్రిలియన్ డాలర్లకు ఎదిగేలా ప్రభుత్వం కృషి చేస్తుంది. తెలంగాణకు భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. కఠినమైన లక్ష్యాలు నిర్దేశించుకుని ప్రభుత్వం ముందుకెళ్తున్నాం. క్యూర్, ప్యూర్, రేర్ లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకుంది. కోటి మంది మహిళలను కోటీశ్వర్లుగా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంది. తెలంగాణ రైజింగ్ 2047పై చర్చించాలని ప్రతిపక్షాలను కోరుతున్నా" -భట్టి విక్రమార్క, ఉపముఖ్యమంత్రి

### భవిష్యత్ తరాల కోసమే

పూర్వీకులు స్వచ్ఛమైన ప్రకృతిని వారసత్వంగా అందించారని మంత్రి శ్రీధర్‌బాబు శాసన సభలో మాట్లాడారు. రేపటి తరానికి స్వచ్ఛమైన ప్రకృతిని అందజేస్తున్నామా? లేదా అని ఆత్మవిమర్శ చేసుకోవాలని సూచించారు. మనం వారసత్వంగా ఇచ్చిన సంపద వారి ప్రాణాలను కాపాడుతుందా? అని ప్రకృతి ఒకసారి నాశనమైతే తిరిగి తీసుకురాలేమని తెలిపారు. భవిష్యత్‌తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందించడం మన బాధ్యత అని స్పష్టం చేశారు. రేపటి తరాల భవిష్యత్, నేల మనుగడ కోసం హిల్ట్‌పాలసీ తీసుకొస్తున్నామని వివరించారు. హిల్ట్‌పాలసీని సాదాసీదా భూమార్పిడిగా చూస్తున్నారని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. తమపై బురద చల్లాలని విమర్శలు చేసేవారు ఆత్మవిమర్శ చేసుకోవాలని అన్నారు. హిల్ట్‌పాలసీ ద్వారా పారిశ్రామిక ప్రాంతం నివాసప్రాంతంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఓఆర్‌ఆర్ లోపలి ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా చేసేందుకు సీఎం యత్నిస్తున్నారని, నగరంలోని పరిశ్రమలను ఓఆర్‌ఆర్ అవతలివైపునకు తరలిస్తామని స్పష్టం చేశారు. జీడిమెట్ల, ఉప్పల్, సనత్‌నగర్, చర్లపల్లి ప్రాంతాలు ఇండస్ట్రియల్ జోన్లుగా ఉండేవని, ఒకప్పుడు జనావాసాలకు దూరంగా ఉండేవని తెలిపారు. 50 ఏళ్లలో హైదరాబాద్ మహానగరంగా విస్తరించిన నేరథ్యంలో ఒకప్పటి నగర శివారు ప్రాంతాలు ప్రస్తుతం రెసిడెన్షియల్ కాలనీస్‌గా మారాయని అన్నారు.

### భూగర్భజలం విషపూరితం అవుతోంది

ప్రస్తుతం పరిశ్రమలకు పక్కనే అపార్టుమెంట్లు ఉన్నాయని, పరిశ్రమల నుంచే వచ్చే పొగను ప్రత్యక్షంగా పీలుస్తున్నామని శ్రీధర్ బాబు చెప్పారు. పరిశ్రమలు, రెసిడెన్షియల్ ప్రాంతాలకు మధ్య బఫర్‌జోన్లు లేవని, బఫర్‌జోన్లు లేకపోవడం వల్ల ఎల్జీ పాలిమర్స్, భోపాల్ గ్యాస్ దుర్ఘటనలు జరిగినట్లు గుర్తుచేశారు. నగరంలోని భూగర్భజలాల్లో విషపూరిత పదార్థాలు ఉన్నాయన్న శ్రీధర్ బాబు పారిశ్రామిక రసాయనాల వల్లే భూగర్భజలాల్లో విషపూరిత పదార్థాలు చేరాయని తెలిపారు. ఇప్పటికీ మేల్కొకపోతే హైదరాబాద్ కూడా దిల్లీ లాంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తోందని హెచ్చరించారు. హిల్ట్‌పాలసీ విషయంలో శాసన సభ్యులు రాజకీయాలు పక్కనపెట్టాలని, చైనాలో బ్లూస్కై పాలసీ ద్వారా భారీ పరిశ్రమలను నగరం అవతలివైపునకు తరలించారని శ్రీధర్ బాబు గుర్తు చేశారు. పారిశ్రామిక ప్రగతి కంటే ప్రజల ప్రాణాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. దిల్లీలో నివాసాల మధ్య ఉన్న 168 పరిశ్రమలను తరలించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రాతిపదికన హిల్ట్‌పాలసీ తీసుకొచ్చినట్లు వివరించారు. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు ఓఆర్‌ఆర్ లోపల ఉండకూడదని హిల్ట్‌పాలసీ తీసుకొచ్చామన్నారు. హిల్ట్‌పాలసీ తాము కొత్తగా చేస్తున్నది కాదని, దీని కోసం విస్తృతంగా చర్చలు జరిగాయన్నారు. వనరులు సమకూర్చేందుకు ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుందని, హిల్ట్‌పాలసీ గురించి తెలియకుండా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

### కాలుష్యం నుంచి రక్షించాలనేదే మా లక్ష్యం

జీవోఎంఎస్ 19కు సంబంధించి లీజ్ ల్యాండ్స్‌పై ప్రభుత్వానికి సర్వాధికారాలు ఉంటాయని గత ప్రభుత్వం జీవో తెచ్చిందని శ్రీధర్‌బాబు గుర్తుచేశారు. తమ ప్రభుత్వం పారదర్శకంగా ఉండేలా పాలసీ తీసుకువచ్చిందని, స్వచ్ఛందంగా ముందుకు వస్తే భూములు కన్వర్ట్ చేస్తామన్నారు. నగరవాసులను కాలుష్యం నుంచి రక్షించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తల భూములను ప్రభుత్వానివని ప్రచారం చేస్తున్నారని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీకి రహస్య అనుబంధం ఉందని శ్రీధర్ బాబు కీలక వ్యాఖ్యలు చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ నేతల అసత్య ప్రచారం నమ్మకుండా జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను గెలిపించారని చెప్పారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులు గెలిచారని అన్నారు. హిల్ట్‌పాలసీ పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపడతామన్న ఆయన ప్రతిపక్షాలు గోబెల్స్ ప్రచారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు.

### జీవోలు దాచి పెడుతున్నారు

హిల్ట్ పాలసీ లీక్‌కావడంపై ప్రభుత్వంలో ఆందోళన ఉందని బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అన్నారు. హిల్ట్‌పాలసీకి సంబంధించి వేసిన సబ్‌కమిటీ నిర్ణయాలు బయటపెట్టలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోను రద్దు చేసే అధికారం ప్రస్తుత ప్రభుత్వానికి ఉందని చెప్పారు. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 43,462 జీవోలు దాచిపెట్టిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం 19,064 జీవోలు ఇస్తే 3,290 జీవోలు మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల కోసం కేటాయించిన భూములు, 22 పారిశ్రామికవాడలను అన్యాక్రాంతం చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో అతిప్రమాదకరమై ఐడీఏ బొల్లారంను ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. ఫ్యూచర్ సిటీలో భూములు ఇస్తే చాలా ఉపయోగం ఉంటుందని, పార్మాసిటీ కాకుండా ఫోర్త్ సిటీ చేస్తున్నారని విమర్శించారు.

### పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియ

శాసనసభలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. 75 రోజుల్లో గోదావరిఖనిలో క్యాత్ లాబ్ ప్రారంభిస్తామని తెలిపారు. సింగరేణి ఆసుపత్రుల్లో మార్చి నాటికి వైద్యులు, సిబ్బంది ఖాళీల భర్తీ చేస్తామని వెల్లడించారు. సింగరేణి కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఆయన అసెంబ్లీలో మాట్లాడుతూ స్పష్టం చేశారు. సింగరేణిపై అసెంబ్లీలో పలువురు సభ్యుల ప్రశ్నలకు డిప్యూటీ సీఎం భట్టి సమాధానం ఇచ్చారు. 32 మంది డాక్టర్ల కోసం నోటిఫికేషన్ ఇచ్చామని వాటిని త్వరలో భర్తీ చేస్తామన్నారు. ఇప్పటికే 176 మంది పారామెడికల్ సిబ్బంది నియామక ప్రక్రియ జరుగుతోందన్నారు. రామగుండంలో క్యాత్ ల్యాబ్ నిర్మాణం పీపీపీ మోడల్‌లో చేపడుతున్నట్లు తెలిపారు. కాంట్రాక్ట్ అవార్డు పూర్తయిందని, 75 రోజుల్లో ప్రారంభిస్తామన్నారు. విశ్రాంత ఉద్యోగులకు సింగరేణి ఆసుపత్రుల్లో ఔషధాల సౌకర్యం కల్పిస్తున్నారు.

### ఖాళీ స్థలాల కేటాయింపుపై చర్చిస్తాం

సీపీఆర్ఎంఎస్ పథకం అందుబాటులో ఉందని, విశ్రాంత ఉద్యోగులు రూ.8 లక్షల వరకు మందులు తీసుకునే అవకాశం ఇస్తున్నామని భట్టి తెలిపారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగుల ఇళ్ల స్థలాల కేటాయింపుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. సింగరేణి పరిధి ఖాళీ స్థలాల్లో కేటాయింపుపై బోర్డులో చర్చిస్తామన్నారు. సింగరేణి సంస్థను కాపాడుకోవడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అభిప్రాయపడ్డారు.

### సింగరేణికి ఇవ్వకుండా వేలం వేస్తున్నారు

కేంద్ర విధానాలతో రాష్ట్ర బొగ్గు గనులు సింగరేణికి ఇవ్వకుండా వేలం వేస్తున్నారని ఉపముఖ్యమంత్రి ఆక్షేపించారు. బొగ్గు గనుల వేలం ద్వారా ప్రైవేట్ ఏజెన్సీలు రంగ ప్రవేశం చేస్తున్నాయన్నారు. గతంలో వేలంలో పాల్గొనకపోవడం వల్ల సింగరేణి కొన్ని గనులను కోల్పోయినట్లు గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణికి కొన్ని బొగ్గు బావులు దక్కేలా చేసినట్లు చెప్పారు.

"సూపర్ స్పెషాలిటీ హస్పిటల్‌కు సంబంధించి ఇప్పటికే ఉద్యోగుల కోసం రెఫరల్ ఆసుపత్రులను కూడా చూస్తున్నాం. అట్లాగే ఖాళీగా ఉన్న హస్పిటల్స్‌లో కొంతమంది డాక్టర్లు స్పెషలిస్టులు లేరని సభ్యులు అడిగారు. దీనికి సంబంధించి నోటిఫికేషన్ కూడా ఇచ్చాం. 11 మంది కాంట్రాక్ట్ డాక్లర్లు పనిచేస్తున్నారు. మిగిలిన 32 మందికి సంబంధించి ప్రకటన ఇవ్వడం జరిగింది. త్వరలోనే వాటిని కూడా భర్తీ చేస్తారు. అలాగే 175 మంది పారామెడికల్ సిబ్బంది అంతర్గత నియామక ప్రక్రియలో ఉన్నది. 2026 మార్చి నెలలో చేపట్టడం జరుగుతావుంది. రిటైర్డ్ అయిన ఎంప్లాయిస్‌కి మెడిసిన్ ఫెసిలిటీ ఉంది. వారికి సీపీఆర్ఎమ్ఎస్ స్కీమ్ కూడా అందుబాటులో ఉంది. మిగతా టర్మినల్ బెనిఫిట్స్ కూడా అందచేయడం జరుగుతుంది. క్యాత్ ల్యాబ్‌కు సంబంధించి ఇప్పటికే పీపీపీ మోడల్‌లో పిలిచారు. కాంట్టాక్ట్ అవార్ట్ చేయడం కూడా జరిగింది. రామగుండంలో దీనిని 75 రోజుల్లో ప్రారంభిస్తాం. ఒకప్పుడు బొగ్గు తీయడం అనేది మోనోపాలి. ఇప్పుడు ఆ మోనోపాలి నుంచి ప్రైవేటైజేషన్‌లోకి దేశం ప్రపంచం కూడా వచ్చేసింది. కేంద్రప్రభుత్వం మన రాష్ట్రంలోని బొగ్గుబావులు కేటాయించాల్సింది పోయి ఇప్పుడు వేలం వేస్తుంది. ఈ పోటీలో ప్రైవేటు సంస్థలు కూడా పాల్గొంటున్నాయి. ఈ కారణంగా సింగరేణి తట్టుకుని నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. సింగరేణి ఉద్యోగులకు మాత్రం సంక్షేమంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తున్నాం"

జాబ్ క్యాలెండర్ విషయంలో సామాజిక అంశాన్ని పరిశీలిస్తున్నామని ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హ్యూసెంట్రియో, సిస్టా ఐటీ సంస్థల ద్వారా వెయ్యి చొప్పున ఉద్యోగాలు వస్తాయన్నారు. పోచారం ఇన్ఫోసిస్ సంస్థ విస్తరణ ద్వారా 17 వేల మంది ఉపాధి పొందుతున్నారని చెప్పారు. విప్రో సంస్థ విస్తరణ ద్వారా మరో 5 వేల మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. 70 గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు తెచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని స్పష్టం చేశారు.

## కేసీఆర్ ఒక రైతు..
## రేవంత్‌రెడ్డిలా రియల్ ఎస్టేట్ బ్రోకర్ కాదు

-మొదటిపేజీ తరువాయి

అని ఘాటుగా వ్యాఖ్యానించారు. మీ కాంగ్రెస్ పార్టీ 60 ఏండ్లు తెలంగాణను తొక్కిపట్టిందని, తెలంగాణను మొలకెత్తనివ్వమని విర్రవీగిందని, అసుంటి కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి తెలంగాణను మొలిపించిన మొగోడు, మొనగాడు కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. రైతులకు యూరియా ఇవ్వడంలో రేవంత్‌రెడ్డి సర్కారు పూర్తిగా విఫలమైందని కేటీఆర్ విమర్శించారు. సరిపడా యూరియా అందక రైతులు గోస పడుతున్నరని ఆవేదన వెలిబుచ్చారు. 'రేవంత్ పాలనలో యూరియా షాప్‌ల లేదు, యాప్‌ల లేదు' అని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కొత్తగా కార్డు అంటూ కొత్త పాట అందుకున్నరని అన్నారు. 'రైతులకు యూరియా తెలివిలేక నాటకాలాడుతున్న దద్దమ్మలు ఈ కాంగ్రెసోళ్లు' అని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో రైతులకు సరిపడా ఎరువులు అందాయని, ఎరువుల దుకాణాల ముందు రైతులు లైన్‌లలో నిలబడాల్సిన అసవరం రాలేదని కేటీఆర్ గుర్తుచేశారు. కేసీఆర్ స్వయంగా రైతు కాబట్టి రైతుల సమస్యలు తెలుసని, ఆయన రేవంత్‌రెడ్డిలా రియల్ ఎస్టేట్ బ్రోకర్ కాదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. జనగామలో ఇటీవల గెలిచిన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో ఆత్మీయ సమ్మేళనంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు.

# సర్వేల్లో నేతలు...

**మహబూబ్ నగర్ :** 2025 జనవరి 25 మున్సిపాలిటీ పాలక వర్గం గడువు ముగిసింది. పాలకవర్గం ముగిసిన రోజు నుండి ప్రత్యేక అధికారుల పాలన లో మున్సిపాలిటీ శాఖ పని చేస్తున్న విషయం అందరికి తెలిసిందే. త్వరలో మున్సిపాలిటీ ఎన్నికలకు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశాలు జారీ అయ్యాయి. అందులో భాగంగానే ఓటర్ల జాబితా సవరణ ముసాయిదా వంటి కార్యక్రమాలు కూడా వేగవంతం దిశగా పనుల్లో సంబందించిన అధికారులు నిమగ్నమయ్యారు. మున్సిపాలిటీ పీఠం పై తమ పార్టీ జెండా పాగ వేసేందుకు అధికార, ప్రతి పక్ష పార్టీలు ఇప్పటికే ఎత్తులకు పై ఎత్తులను వేసే పనిలో నిమగ్నమయ్యారు. ఏ వార్డు లో ఏ అభ్యర్థి నిలబడితే గెలుస్తారో వంటి సర్వే చేసే పనిలో అటు అధికార పార్టీ ఇటు ప్రతిపక్ష పార్టీలు నిమగ్నమయ్యారు. ఇప్పటికే సోషల్ మీడియా, అభ్యర్థులకు తెలియని వ్యక్తుల నుండి మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డు లో గెలుపు గుర్రాల సర్వే ను నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆర్థికంగా ఉన్నారు అటువంటి వారికీ ఇవ్వడం కన్నా ఆయా వార్డులో అభ్యర్థి ప్రవర్తన, పరిచయాలు, ప్రత్యర్థి కన్నా ఎక్కువ ఖర్చు పెట్టగలడా ఒక వేల పార్టీ నుండి బి ఫామ్ (టికెట్) ఇస్తే గెలుస్తాడా లేదా వంటి విషయాలపై లోతుగా సర్వే చేస్తున్నట్లు సమాచారం. గెలుపు గుర్రాలకు టికెట్ ఇస్తేనే మున్సిపాలిటీపై తమ పార్టీ జెండా పాగ ఉంటుందని ఆ దిశగా నాయకులు ఆలోచిస్తూ అడుగులు వేస్తున్నారు. పార్టీ ని నమ్ముకుని చాలా రోజుల నుండి పార్టీకి సేవ చేస్తున్నాము పార్టీ ఏ పిలుపునిచ్చిన పని చేసాం మా వార్డులో ప్రజల మద్దత్తు పుష్కలంగా ఉంది సంవత్సరం నుండి వార్డు లో వినాయక చవితి, దసరా నవరాత్రి ఉత్సవాలు, బతుకమ్మ, పండుగలు, పబ్బాలు,



చావులు ఇలా ఎన్నో కార్యక్రమాలకు హాజరు కావడం తో పాటు ఆర్థిక సహాయకారాలు అందిస్తూ ప్రజల మధ్యలో ఉన్నాము మాకే పార్టీ టికెట్ ఇవ్వాలని నేతల ముందుకు నాయకులతో ఆశావహులు పావులు కదుపుతున్నారు. కొన్ని వార్డు లో అధికార, ప్రతిపక్ష పార్టీలో సైతం ఇద్దరు ముగ్గురు ఆశావహులు వారి వారి ప్రయత్నాలు చేస్తున్నారు. సంవత్సరం నుండి ఎదురు చూస్తున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో తాము కూడా పోటీలో ఉన్నామంటూ తమకు మద్దతు ఇవ్వాలని ఇప్పటికే ఆయా వార్డు లో యువత, ముఖ్యులతో ఇప్పటికే ఆశవహులు లోలోపల సమావేశాలను నిర్వహించుకుంటున్నారు. ఎలక్షన్ లో నాకు సపోర్ట్ చేస్తే వార్డులో జరుగబోయే అభివృద్ధి పనుల్లో పనులు ఇప్పిస్తా ఎం పని అడిగిన ఖచ్చితంగా చేసి పెడతాను ఇలా లెక్కకు మించి హామీలను ముఖ్యలకు హామీలను సైతం ఇస్తున్నట్లు తెలుస్తోంది.

## తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు లైన్ క్లియర్

-మొదటిపేజీ తరువాయి

కాగా, మున్సిపల్ ఎన్నికల దిశలో అడుగులు వడివడిగా పడుతున్నాయి. ఈ నెలలోనే ఎన్నికలకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వాలని, ఫిబ్రవరిలో ఈ ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సంక్రాంతికి ముందు లేదంటే ఆ తర్వాత కచ్చితంగా షెడ్యూల్ ప్రకటించి ఆ వెనువెంటనే నోటిఫికేషన్ ఇవ్వడానికి రాష్ట్ర ఎన్నికల సంఘానికి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ నెల 11న లేదంటే 20న షెడ్యూల్ ప్రకటించే అవకాశా లున్నాయి. ఫిబ్రవరి రెండు లేదా మూడో వారంలోగా ఎన్నికల తతంగాన్ని పూర్తి చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించింది.

## హిల్ట్ పాలసీపై చర్చ ..
## 'అవి ప్రభుత్వ భూములు కావు'

-మొదటిపేజీ తరువాయి

పాలసీ గురించి అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తున్నారు. దశాబ్దాల కిందటే గత ప్రభుత్వాలు వారికి భూములు అమ్మేశాయి. రాజకీయాల పక్కనపెట్టి ఆలోచించాలి" అని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి, నీరు ఇవ్వలేని నాగరికత అసమర్థ నాగరికతే.. అభివృద్ధి పేరిట పర్యావరణ విధ్వంసం జరుగుతోందని శ్రీధర్‌బాబు హెచ్చరించారు. "డెవలప్‌మెంట్ అంటే ప్రకృతిని నాశనం చేయడం కాదు. పిల్లలకు ఆస్తులు కాదు.. క్లీన్ ఎన్విరాన్‌మెంట్ నిజమైన వారసత్వం. బంగారు గిన్నెలో విషం పెట్టినట్లవుతోంది మన పరిస్థితి. ప్రకృతి నాశనమైతే తిరిగి రాదు. మనమంతా భూమి యజమానులు కాదు. కేవలం ట్రస్టీలమే. ఫ్యూచర్ జనరేషన్లకు క్లీన్ ఎన్విరాన్‌మెంట్ ఇవ్వడం మన బాధ్యత. ఇది కేవలం ల్యాండ్ యూజ్ మార్పు కాదు. ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది. రేవంత్ రెడ్డి నేతృత్వంలో చారిత్రక నిర్ణయం తీసుకున్నాం. పిల్లల భవిష్యత్తు కోసం హిల్ట్ పాలసీ తీసుకొచ్చాం. ..ఓఆర్‌ఆర్ లోపల పరిశ్రమలు.. ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం. ఫ్యాక్టరీ గోడ పక్కనే ఇళ్లు.. ఇది సైంటిఫిక్ డిజాస్టర్. 1970లలో నగరం బయట పరిశ్రమలు.. నేడు నడిబొడ్డు ప్రాంతాలు బాలానగర్, సనత్‌నగర్, ఉప్పల్ ఇప్పుడు రెసిడెన్షియల్ జోన్లు. పరిశ్రమలను ఓఆర్‌ఆర్ అవతలికి తరలించడమే లక్ష్యం. పిల్లలకు స్వచ్ఛమైన గాలి, నీరు ఇవ్వడమే ప్రభుత్వ సంకల్పం. హిల్ట్‌పై కావాలనే తప్పుడు ప్రచారం జరుగుతోంది. మతలబు ఉందంటూ విమర్శలు బాధాకరం. తెలంగాణ నుంచే పర్యావరణ రక్షణకు చారిత్రక అడుగు.. మార్పు ఎప్పుడో కాదు.. ఇప్పుడే" అంటూ శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు.

## మావోయిస్టుల్లో మిగిలింది వారే...

**హైదరాబాద్ :** తెలంగాణను మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చే దిశగా ప్రభుత్వం వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో ఉన్న 17 మంది తెలంగాణ వాదులు జనజీవన స్రవంతిలో కలిస్తే.. రాష్ట్రం నుంచి ఆ సిద్ధాంతం పూర్తిగా కనుమరుగవుతుందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీతో పాటు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.తెలంగాణ రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చే దిశగా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వ్యూహాత్మక అడుగులు వేస్తోందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్న తెలంగాణ వాళ్లంతా జన జీవన స్రవంతిలో కలిస్తే.. రాష్ట్రం నుంచి ఆ సిద్ధాంతం పూర్తిగా కనుమరుగవుతుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అడవుల్లో ఉన్నవారు లొంగిపోయి శాంతియుత జీవనం గడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డీజీపీ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో తెలంగాణకు చెందిన 17 మంది ఉన్నారు వీరిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్‌గ్రౌండ్‌లో ఒకరితో పాటు మరొకరు ఉద్యమంలో కొనసాగుతున్నారు.ఈ 17 మంది మావోయిస్టులపై ప్రభుత్వం మొత్తం రూ. 2.25 కోట్ల భారీ రివార్డును ప్రకటించింది. వీరు గనుక ఆయుధాలు వీడి లొంగిపోతే.. పునరావాస ప్యాకేజీ కింద ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని డీజీపీ హామీ ఇచ్చారు. ప్రస్తుతం అడవుల్లో ఉన్న ఆ 17 మందిలో ఐదుగురు మహిళలు ఉన్నట్లు డీజీపీ అధికారికంగా ప్రకటించారు. వీరంతా కీలక బాధ్యతల్లో ఉన్నట్లు సమాచారం. మహిళా మావోయిస్టులు లొంగిపోతే వారి కుటుంబాలకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.కాగా, గత కొన్నేళ్లుగా తెలంగాణలో మావోయిస్టుల ప్రాబల్యం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. కీలక నేతలు చనిపోవడం, లొంగిపోవడం పార్టీని ఆత్మరక్షణలో పడేసింది. ఇటీవల మావోయిస్టు పార్టీలో కీలక నేతగా ఉన్న పాక హనుమంతు ఎన్‌కౌంటర్‌లో మరణించడం పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. సుదీర్ఘ కాలం పాటు అండర్‌గ్రౌండ్‌లో ఉన్న అగ్రనేత రాజిరెడ్డి ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు టాప్ మావోయిస్టు బర్సే దేవా మరికొందరు కీలక నాయకులు కూడా హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. ఈ పరిణామాలు మిగిలి ఉన్న 17 మందిపై కూడా ఒత్తిడి పెంచుతున్నాయి. 'ఆపరేషన్ కగార్' గడువు ముగిసేలోపే తెలంగాణ పూర్తిస్థాయిలో మావోయిస్టు రహిత రాష్ట్రంగా అవతరిస్తుందని డీజీపీ ధీమా వ్యక్తం చేశారు.మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సాయుధ పోరాటం ద్వారా సాధించేది ఏమీ లేదని, ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను పరిష్కరించుకోవాలని పోలీసులు కోరుతున్నారు. లొంగిపోయిన వారికి ఇంటి స్థలాలు, పిల్లల చదువు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం భరోసా కల్పిస్తున్నా

## అధికారుల్లో విజిలెన్స్ గుబులు

**హైదరాబాద్ :** పది, పదిహేను సంవ త్సరాలుగా నీటిపారుదల శాఖలో జరిగిన అనేక అవినీతి, అక్రమాలు, అవకత వకలపై రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వేగంగా స్పందించి విచారణ జరిపింది. అన్ని సాంకేతికాంశాలు పరిశీలించింది. అక్రమాల నిగ్గుదే ల్చింది. ముఖ్యంగా కాళేశ్వరంపై ప్రభు త్వం నుంచి విచారణకు ఆదేశాలు వచ్చిం దే తడవుగా.. పకడ్బందీగా విచారణ చేసి నివేదికను ప్రభుత్వానికి అందించింది.విజిలెన్స్ విచారణలో బయటపడ్డ వాస్తవాలను, అలాగే విజిలెన్స్ నివేదికలను కూడా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మెచ్చుకుని తమ నివేదికలోనూ అవే అంశా లను పొందుపర్చింది. దీనితో విజిలెన్స్ విచారణ పకడ్బందీగా, లోతుగా చేశారనే ప్రశంసలు సర్వత్రా వచ్చాయి. అయితే, మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణానికి సం బంధించి రూ. 1,000 కోట్ల అవినీతి, అక్రమాలు, అవకతవకలు జరిగాయని లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందడంతో.. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అధికారులు రంగంలోకి దిగారు.అలాగే కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంలో రూ. 500 కోట్ల వర కు, బుద్ధారం కెనాల్ నిర్మాణంలో రూ. 30 నుంచి 40 కోట్ల వరకు అక్రమాలు జరిగాయనే ఫిర్యాదులు అంద డంతో విజిలెన్స్ విభాగం అదే వేగంతో అంతే పకడ్బందీగా విచారణను చేపట్టింది. విచారణ అనంతరం సిద్ధం చేసిన మూడు నివేదికలు కూడా విజిలెన్స్ కమిషన్ వద్దకు చేరి నెలల కాలం అయ్యింది. ప్రభుత్వానికి మాత్రం చేరడం లేదు. ప్రభుత్వం నుంచి పచ్చజెండా ఊపితేనే.. ఈ విజిలెన్స్ నివేది కలకు మోక్షం కలుగుతుందనే విమర్శలకు ఊతమిస్తున్నాయి.ఇంతటి ముఖ్య మైన విజిలెన్స్ నివేదికలపై రాష్ట్ర ప్రభు త్వం ఎందుకు దృష్టి సారించడం లేదనే చర్చ అధికారవర్గాల్లోనూ మొదలయ్యిం ది. మిడ్ మానేరుపై విచారణ సందర్భంగానే అప్పటి నీటిపారుదల శాఖ ఈఎన్ సీని అక్కడి నుంచి మార్చాల్సి వచ్చింది. కారణం.. మిడ్ మానేరులో ఈ అవకతవకలు జరిగినప్పుడు ఆయన మిడ్ మానేరు సీఈగా బాధ్యతలు నిర్వర్తించారు.బీఆర్ఎస్ హ యాంలో కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంలో భారీగా అక్రమాలు జరిగాయని, అ లాగే బుద్ధారం కెనాల్ నిర్మాణంలోనూ కోట్ల విలువైన అవకతవకలు జరిగాయని విజిలెన్స్ విచారణలో వాస్తవాలు బయటపడ్డా యని సమాచారం. బయటపడ్డ వాస్తవాలు, అక్రమాలు, అవినీతి, అవకతవకలకు బాధ్యులనుకూడా గుర్తించి పూర్తిస్థాయి నివేదికల ను కమిషన్‌కు పంపించినా.. ప్రభుత్వం మా త్రం ఈ నివేదికలపై దృష్టి సారించకపోవడం గమనార్హం.ఫిర్యాదులు రాగానే.. ఎంత వేగంగా విచారణకు ఆదేశించారో, విచారణ నివేదికలు సిద్ధం అయిన తరువాత.. అదే స్థాయిలో సర్కారు స్పందించడం లేదనే వి మర్శలు వస్తున్నాయి. మూడు ముఖ్యమైన విజిలెన్స్ నివేదికలు కమిషన్ కార్యాలంలో మూలన పడిఉంటే.. కనీసం వీటిని బయటకు తీసుకొచ్చి, బాధ్యులపై చర్యలకు ఆదేశా లు ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మీనమేషాలు లెక్కపెట్టినట్టుగా వ్యవహరించడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

ధర్మఘంట

# బరువు తగ్గాలనుకునే వారికి అసలు గ్రీన్ టీ ఎలా సహాయం చేస్తుంది



అధికంగా ఉండే మన శరీర బరువే అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ఈ విషయాన్ని వైద్యులు తరుచూ చెబుతూ ఉండడంతో మనలో చాలా మందికి ఆరోగ్యం మీద స్పృహ వచ్చిందనే చెప్పవచ్చు.దీంతో శరీర బరువును అదుపులో ఉంచుకోవడానికి మనలో చాలా మంది అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. రోజూ వ్యాయామం చేయడం, కఠినమైన ఆహారాన్ని తీసుకోవడం, తగినంత నీటిని తాగడం, అధిక క్యాలరీలను తగ్గించడం, ఇష్టమైన ఆహారాన్ని వదులుకోవడం ఇలా అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక బరువు తగ్గాలని ఆహారాన్ని కూడా తక్కువగా తీసుకుంటూ ఉంటారు. దీంతో ఆకలితో అనేక బాధలు పడుతూ ఉంటారు. అయితే బరువు తగ్గాలనుకునే వారు అనవసరమైన ఆకలి బాధలు పడాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే ఆకలి బాధలను నియంత్రించడానికి ఒక చిట్కాను కూడా చెబుతున్నారు.ఆకలిని నియంత్రిస్తుంది..బరువు తగ్గడానికి ప్రయత్నించే వారు గ్రీన్ టీని తీసుకోవడం మంచిదని వారు చెబుతున్నారు. గ్రీన్ టీ లో ఎపిగాల్లోకాచెటిన్ గాలేట్ ( ఇజిసిజి) అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆకలిని నియంత్రించే అడిపోనెక్టిన్ అనే హార్మోన్ ను ఎక్కువగా ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. ఆకలి నియంత్రణలో ఉండడం వల్ల అతిగా తినాలనే కోరిక తగ్గుతుంది. చాలా మంది బరువు తగ్గాలనుకున్నప్పటికీ ఆకలిని నియంత్రించుకోలేక ఏదో ఒకటి తింటూ ఉంటారు. అలాంటి వారు గ్రీన్ టీని తీసుకోవడం వల్ల ఆకలి తగ్గి బరువును అదుపులో ఉంచుకోగలుగుతారు. అలాగే కొందరిలో విపరీతమైన ఆకలి ఉంటుంది. ఆకలిని వాళ్లు అస్సలు తట్టుకోలేక ఎప్పుడూ చూసినా తింటూనే ఉంటారు. అలాంటి వారు కూడా గ్రీన్ టీని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.చక్కెర స్థాయిలు అదుపులో..మీరు ఆకలిని నియంత్రించుకోవాలనుకుంటే ఇజిసిజి అధికంగా ఉండే గ్రీన్ టీని తాగడం మంచిది. అంతేకాకుండా గ్రీన్ టీని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. గ్రీన్ టీని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.బరువు తగ్గాలనుకునే వారు గ్రీన్ టీని తాగడంతో పాటు అనవసరమైన ఆకలిని నియంత్రించుకోవడానికి భోజనానికి ముందు ఇసాబ్‌గోల్ తీసుకోవడం చేయాలి. అలాగే ఆహారంలో ఎక్కువగా ప్రోటీన్, ఫైబర్ ఉండేలా చూసుకోవాలి. దీంతో ఎక్కువ సమయం ఆకలి అవ్వకుండా ఉంటుంది. చిరుతిండి తినాలనే కోరిక తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే ప్రయాణానికి ఆకలి బాధలు అడ్డుగా ఉండకూడదు అనుకునే వారు ఆకలిని నియంత్రించుకోవాలనుకునే వారు ఈ చిట్కాను పాటించడం మంచిది.

**పొట్ట చుట్టూ సమస్యలే**

ఫ్యాటీ లివర్, కొలొరెక్టల్, పేగు సంబంధిత వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధిక క్యాలరీలతో కూడిన ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్స్, మద్యపానం, అస్థిర జీవనశైలి తదితర కారణాలతో ఈ సమస్యలు యువతలోనే ఎక్కువగా చూస్తున్నాం. మన దేశంలో నమోదవుతున్న కొలొరెక్టల్ క్యాన్సర్ కేసుల్లో 30–40 శాతం మంది 50 ఏళ్లలోపు వారే ఉండటం ఆందోళన కలిగించే అంశం.

**క్యాన్సర్ దాడి**

ఈ మధ్య కాలంలో బ్రెస్ట్, ఒవేరియన్, గ్యాస్ట్రో ఎంటెస్టినల్ వంటి క్యాన్సర్లు ఎక్కువగా యువతలోనే కనిపిస్తున్నాయి. వయసుతో సంబంధం లేని ఈ వ్యాధిపై జన్యు లక్షణాలు, జీవనశైలి, పర్యావరణ ప్రభావాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, గుండె, మెటబాలిక్, కాలేయం, మూత్రపిండాలు, న్యూరాలజీ, జీర్ణవ్యవస్థలకు సంబంధించిన నివారించగల దీర్ఘకాలిక వ్యాధుల్లో 10–15 శాతం పెరుగుదల కనిపిస్తుంది. వీటిలో చాలా వ్యాధులను ప్రారంభదశలో స్రీనింగ్, జీవనశైలి మార్పులు, సమయానికి వైద్య పరీక్షల ద్వారా నివారించగలిగినవే.

**వారిపై తీవ్ర ప్రభావం**

మారుతున్న జీవనశైలి, పని ఒత్తిడి కారణంగా కొన్ని రంగాల్లో పనిచేసే ఉద్యోగులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. అందులో ముఖ్యంగా ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో పని చేసే యువత రోజుకు పది గంటలకు పైగా ఒకే చోట కూర్చుని పనిచేయడం, సరైన వ్యాయామం లేకపోవడం, ఎక్కువగా జంక్ ఫుడ్, ప్రాసెసింగ్ ఫుడ్‌పై ఆధారపడటం వల్ల అనారోగ్య సమస్యల్లో చిక్కుకుంటున్నారు. దేశ జీడీపీ, అభివృద్ధికి వెన్నెముకగా ఉండాల్సిన యువత అనారోగ్యం పాలవ్వడం దేశ భవిష్యత్తుకే ముప్పుగా పరిణమిస్తున్నది. ఈ అంశాన్ని ప్రతిఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలి. జబ్బు వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే, జబ్బు రాకుండా చూసుకోవడం ప్రధానం అని గ్రహించాలి. జీవనశైలిలో మార్పుల ద్వారా వ్యాధులను వృద్ధాప్యం వరకు వాయిదా వేయవచ్చు.

**ఆర్థికంగా దెబ్బ**

కార్పొరేట్ ఎంప్లాయి మొదలుకొని, సాధారణ ఉద్యోగి వరకు ఆరోగ్య బీమాపై అవగాహన కలిగి ఉంటున్నారు. ఉద్యోగంలో చేరగానే.. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్నారు. అయితే హెల్త్ ఇన్సూరెన్స్ చికిత్సకు అయ్యే ఖర్చును భరిస్తుందేమో కానీ, వ్యాధులను రాకుండా అడ్డుకోదు కదా! ఇక ఇన్సూరెన్స్ లేనివారి పరిస్థితి అగమ్య గోచరం. ఒక వ్యక్తి ఆస్పత్రి పాలైతే.. ఆ భారం కుటుంబం అంతా మోయాల్సి వస్తుంది. తీవ్రమైన వ్యాధులు తలెత్తితే.. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ఇలా జరగొద్దంటే?ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తించాలి. అందుకు తగ్గ జీవనశైలిని పాటించాలి. వ్యాధులను ప్రారంభదశలోనే గుర్తించడం వల్ల.. పెను ముప్పును తప్పించుకోవచ్చు.

# డబుల్ డిన్నర్ ట్రబుల్స్




ఆలస్యంగా తినడం అందరి సమస్యే. ఒక్కోసారి సమయం కలిసొచ్చి.. తినాల్సిన సమయం కంటే ముందే తింటారు. ఆలస్యంగా నిద్రపోవడం, రాత్రి పని చేసేవాళ్లకు అర్ధరాత్రి మళ్లీ ఆకలవుతుంది.రాత్రి రెండో డిన్నర్ లాగించేస్తారు. తరచుగా డబుల్ డిన్నర్ తినేవాళ్లకు ఆకలి సమస్యలు ఉంటాయి. నిద్రలేమి, అధిక బరువు అదనపు సమస్యలు తప్పవని ఆహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఓటీటీలో షోలు చూస్తూ, థియేటర్లో సినిమాలు, క్రికెట్ మ్యాచ్‌లు, మ్యూజిక్ కాన్సర్ట్, ట్రావెల్, రాత్రి వేళ ఉద్యోగ విధులు చేసేవాళ్లలో చాలామంది డబుల్ డిన్నర్ సమస్య ఎదుర్కొంటున్నారు. డిన్నర్ సరైన సమయానికే చేసినా.. రాత్రి ఎక్కువ సమయం మేల్కొని ఉండటం వల్ల వీళ్లకు మళ్లీ ఆకలవుతుంది. అప్పుడు భోజనం, లేకపోతే ఇష్టమైన స్నాక్స్‌ని కడుపునిండా ఆరగిస్తారు. అప్పటికే మొదటి డిన్నర్ ద్వారా శరీరానికి కావాల్సినంత ఎనర్జీ అందుతుంది.(సెకండ్) డిన్నర్‌కి నిద్ర పోవడానికి మధ్య తక్కువ సవయం ఉంటే తిన్నది జీర్ణం కాదు. ఫలితంగా నిద్ర సరిగ్గా పట్టదు. రెండోసారి తిన్నది శరీర అవసరాలకు ఉపయోగపడదు. అప్పటికే మొదటి డిన్నర్ నుంచి తయారైన గ్లూకోస్ శరీరానికి కావాల్సిన శక్తినిస్తుంది. సెకండ్ డిన్నర్‌లో తిన్న ఆహారం జీర్ణమైన తర్వాత కొవ్వుగా మారి, శరీర బరువును పెంచుతుంది. పార్టీలు, స్నేహితులతో షికార్లు చేస్తూ డాబా హోటళ్లు, రెస్టారెంట్లలో అర్ధరాత్రి తినేవాళ్లలో చాలామంది డబుల్ డిన్నర్ ఆరగించేవాళ్లే! ఇలా తినడం సరదాగా ఉంటుంది. కానీ, ఆరోగ్యానికి మాత్రం తీవ్రంగా హాని చేస్తుంది.సమయానికి పడుకునేవాళ్లకు తొందరగా రాత్రి భోజనం చేయడం మేలు చేస్తుంది. కానీ, ఆలస్యంగా పడుకునేవాళ్లు తొందరగా భోజనం చేస్తే ఆకలి సమస్య, అమితంగా తినడం సమస్యలు తప్పవు. కాబట్టి పడుకునే వేళల్ని, తినే వేళల్ని వృత్తికి తగ్గట్టుగా మార్చుకోవాలి.ఎన్ని గంటలకు పడుకుంటారో, దానికి మూడు గంటల ముందు తినడానికి ప్లాన్ రెడీ చేసుకోవాలి.రాత్రివేళ ఒకేసారి తినే పద్ధతి పాటించాలి. పగలు తిన్నట్టుగా భోజనం తర్వాత మరేదీ తినకూడదు.తిన్న తర్వాత నడవడం, ఏదైనా చిన్న పని చేస్తూ ఉండాలి. అప్పుడు తిన్న ఆహారం జీర్ణమవుతుంది. అధిక బరువు, ఆకలి, నిద్ర సమస్యలు ఉండవు.రాత్రి భోజనంలో ప్రొటీన్, ఫైబర్, హెల్తీ ఫ్యాట్ ఉండేలా చూసుకుంటే తేలికగా జీర్ణమవుతుంది. ఆకలి సరిగా ఉంటుంది.

# 14 రోజులు మానేస్తే..



పంచదార మన ఆరోగ్యానికి హానికరమని తెలిసినా అదేమీ పట్టించుకోకుండా టీ, కాఫీ, ప్రాసెస్డ్ ఫుడ్స్ పేరుతో ఏదో ఓ రూపంలో తినేస్తుంటారు. అతిగా తీసుకుంటూ బరువుతో పాటు షుగర్ లెవల్స్ పెంచుకుంటూ చాలామంది అనారోగ్యానికి గురవుతుంటారు. అయితే చక్కెరను కనీసం 14 రోజులు పూర్తిగా మానేస్తే ఎలాంటి లాభాలు ఉంటాయో తెలుసుకుందాం.తినే పదార్థాల్లో చెక్కర వేసుకోవడం వల్ల కేవలం కేలరీలు మాత్రమే పెరుగుతాయనుకుంటారు. అది మాత్రమే కాదు ఆకలి, క్రేవింగ్స్, ఇన్సులిన్, లివర్ ఫ్యాట్ లాంటి ఎన్నో సమస్యలు మెల్లగా అంటుకుంటాయి. అయితే, చక్కెరకు దూరంగా ఉండటం చెప్పినంత తేలిక కాదు. షుగర్ మానేయగానే ముందుగా క్రేవింగ్స్ పుడతాయి. దీంతోపాటు తలనొప్పి, అలసట, ఇరిటేషన్, మెదడు పనితీరు తగ్గడం వంటి సమస్యలూ పలకరిస్తాయి. ఎప్పుడెప్పుడు చక్కెరను నోట్లో వేసుకుందామా అనిపిస్తుంటుంది.అయితే, కాస్త ఓపిక పడితే చక్కెరను దూరం పెట్టమని మన శరీరానికి మెదడు చెబుతుంది. అలా ఓ 14 రోజులు చక్కెరకు పూర్తి దూరం పాటిస్తే? బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది. నిద్ర నాణ్యత పెరుగుతుంది. ఫాస్టింగ్ గ్లూకోజ్ ఇంప్రూవ్ అవుతుంది. మెటబాలిజంలో మార్పు వస్తుంది. లివర్ షుగర్ తగ్గుతుంది. చక్కెర మానేయడం పెద్ద కష్టమేమీ కాదు. రోజంతా ఉపవాసం ఉండాల్సిన అవసరం లేదు. పండ్లు పుష్కలంగా తినొచ్చు. ఆహారం తీసుకోవచ్చు. చక్కెర, చెక్కరతో చేసిన పదార్థాలకు మాత్రం దూరం పాటిస్తే సరి. ఈ పద్నాలుగు రోజులు సాఫ్ట్‌డ్రింక్స్, జ్యూస్‌లు, స్వీటెన్డ్ ఆల్కహాల్ లాంటి వాటిని తీసుకోవద్దు. ఒకసారి ప్రయత్నించి చూడండి.

# జాగ్రత్త మిత్రమా!.. వ్యాధుల ఉచ్చులో చిక్కుకోవద్దు



తస్మాత్ జాగ్రత్త! అన్ని విషయాల్లోనూ పెద్దలు చెప్పే మాట ఇది. ముందుచూపు ఉన్నవాడే ముందడుగు వేయగలడు. ఆర్థిక విషయాల్లోతప్పటడుగు వేస్తే.. రెండేండ్లకో, మూడేండ్లకో కోలుకునే అవకాశం ఉంటుంది. ఆరోగ్యం విషయంలో ఈ సూత్రం చెల్లదు. 'నాకేమవుతుంది!' అన్న నిర్లిప్త ధోరణి మిమ్మల్ని రోగాల విష వలయంలోకి నెట్టేయొచ్చు. ఆరోగ్య బీమా ఉంటే.. చికిత్సకయ్యే ఖర్చులు మీదపడకుండా ఉంటాయి కానీ, మీ బీమా రోగం రాదన్న ధీమా ఇవ్వదు కదా!! మరెలాగంటారా?!ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమబద్ధమైన జీవనశైలితో రాగల రోగాలను అడ్డుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఎలాంటి వ్యాధులనైనా నయం చేసే శక్తి ఆధునిక వైద్యరంగానికి ఉంది! కానీ, అదే సమయంలో వేగంగా పెరుగుతున్న రోగాలు వైద్యులకూ సవాళ్లు విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం అంటున్నారు వైద్యులు. గతంతో పోలిస్తే.. ఈ మధ్య కాలంలో ఎలాంటి వ్యాధులు పెరుగుతున్నాయి, అందుకు కారణాలేంటి? మారుతున్న జీవనశైలి మనిషి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నది? తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం!ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' నానుడి ఆరోగ్యానికి సంబంధించినదే! సంపాదన వేటలో పరుగులు తీస్తున్న మనిషి ఆరోగ్యాన్ని చాలా నిర్లక్ష్యం చేస్తున్నాడు. దీనికితోడు జిహ్వ చాపల్యాన్ని చంపుకోలేక, అలవాట్లు మానుకోలేక, వ్యాయామం చేసే తీరిక లేక? ఇలా రకరకాల కారణాలతో రోగాలను కొని తెచ్చుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో నడి వయసులోనే దవాఖానల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముప్పయ్ ఏండ్లలోనే గుండె జబ్బులు పలకరిస్తున్నాయి. నలభై రాకముందే కిడ్నీలు మొరాయిస్తున్నాయి. డబ్బుల్లో రావాల్సిన నరాల సమస్యలు? యాభై రాకముందే ముంచుకొస్తున్నాయి. దీనికంతటికీ కారణంఆరోగ్యంపై శ్రద్ధ లేకపోవడమే!

**ముప్పయ్ రాకుండానే.. గుండెకు ముప్పు**

ఒకప్పుడు యాభై ఏండ్లు దాటాక గానీ, గుండె సమస్యలు పలకరించేవి కావు. కానీ, ఇప్పుడు ముప్పయ్‌లోకి అడుగు పెట్టకముందే గుండె సంబంధిత రుగ్మతలు వస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది, 20–30 ఏళ్లలోపు వయసు వారు కూడా తీవ్రమైన గుండె జబ్బులకు గురవడం విచారకరం. అయితే చిన్న వయసులోనే గుండె సంబంధిత వ్యాధులకు గురైనవారిలో ఎక్కువ శాతం రక్తపోటు లేదా అధిక కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడుతున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. ఈ తరహా సమస్యల్లో చిక్కుకుంటున్న వాళ్లు కనీస ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోకపోవడం గమనార్హం. తాజా అధ్యయనాల ప్రకారం గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగుల్లో సుమారు 30 శాతం మంది 30 ఏళ్లలోపు వారే ఉంటున్నారట. వీరంతా అసహజమైన జీవనశైలి కారణంగానే ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. గణాంకాల ప్రకారం భారతదేశంలో 40 ఏళ్లలోపు వయసున్న ప్రతి నలుగురిలో ఒకరికి గుండెపోటును చూస్తున్నాం. సరైన జీవనశైలి, వ్యాయామం, నడక, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా గుండెకు వచ్చే జబ్బులను చాలా వరకు నియంత్రించవచ్చు.యువతలో బలహీనతన్యూరాలజిస్టుల నివేదికల ప్రకారం స్ట్రోక్ కేసులను పరిశీలిస్తే, దాదాపు మూడోవంతు యువతలోనే నమోదవుతున్నాయి. దీనికి అధిక రక్తపోటు, పొగ తాగడం, మద్యం సేవించడం, ఒకేచోట ఎక్కువ సేపు కూర్చుని ఉండే ఉద్యోగాలు చేయడం వల్ల న్యూరాలజీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకోకుండా.. ముందస్తుగా మేల్కొనాలి. దురలవాట్లకు చెక్ పెట్టాలి. వర్క్ ?స్టైల్‌నిమీ ఆరోగ్యానికి తగ్గట్టుగా డిజైన్ చేసుకోవాలి. ఆరోగ్యపరంగా ఏదైనా అసౌకర్యాన్ని గుర్తించిన వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి. పీడిస్తున్న మధుమేహంజీవనశైలి రుగ్మతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కాస్త అలవాట్లు పక్కదారి పట్టినా.. మధుమేహం దాడి చేస్తున్నది. గతేడాది యువ ఉద్యోగులు, విద్యార్థుల్లో మధుమేహం, ఊబకాయ సమస్య అనూహ్యంగా పెరగడం కనిపించింది. ఎండోక్రైనాలజీ విభాగం గణాంకాల ప్రకారం, టైప్–2 మధుమేహం యువతలో వేగంగా పెరుగుతున్నది. సుమారు 40 శాతం మందికి తమకు డయాబెటిస్ ఉందన్న విషయమే తెలియకపోవడం గమనార్హం. అంతేకాదు, మధుమేహ బాధితుల్లో 50 శాతం మందిలో వ్యాధి అస్సలు నియంత్రణలో ఉండటం లేదట. దీనివల్ల మూత్రపిండాల సమస్యలు, గుండె వ్యాధులు, సంతానలేమి తదితర సమస్యలు చాపకింద నీరులా విస్తరిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. నెఫ్రాలజీ రికార్డుల ప్రకారం, డయాబెటిస్, హైపర్ టెన్షన్‌ను సమయానికి గుర్తించకపోవడం వల్ల యుక్త వయసులోనే తీవ్రమైన కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నారు. వీటిని ప్రాథమిక దశలో గుర్తించి, తగిన చికిత్స తీసుకుంటే ప్రమాద తీవ్రత గణనీయంగా తగ్గుతుంది.

# మున్సిపల్ ముసాయిదా ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

**అభ్యంతరాలను తమ దృష్టికి తీసుకురావాలి**

**అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, అశ్విని తానాజీ వాకడే.**

**కరీంనగర్ :** ఓటరు ముసాయిదా జాబితా పై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే. రాజకీయ పార్టీల ప్రతినిధుల కు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, నగరపాలిక కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ. మునిసిపాలిటీల్లో చనిపోయిన వారి ఓట్లు తొలగించాలని కోరారు. కుటుంబ సభ్యులందరికీ ఓట్లు ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా సజావుగా నిర్వహించాలన్నారు. పోలింగ్ స్టేషన్ల సంఖ్య పెంచాలని కోరారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. ఇప్పటికే అన్ని మునిసిపాలిటీల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వార్డుల వారీగా ముసాయిదా ప్రకటించామన్నారు. వినతులు స్వీకరించినట్లు పేర్కొన్నారు. మరణించిన వారి ఓట్లు, రెండు చోట్ల నమోదైన ఓట్ల సమాచారం తెలిస్తే మాకు అందించాలని సూచించారు తొలగిస్తామని పేర్కొన్నారు. అభ్యంతరాల పరిశీలన అనంతరంతుది ఓటరు జాబితా ప్రకటిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో చొప్పదండి, జమ్మికుంట, హుజురాబాద్




మునిసిపల్ కమిషనర్లు నాగరాజు, అయాస్, సమ్మయ్య, రాజకీయ పార్టీల ప్రతినిధులు వై. సునీల్ రావు, నాంపల్లి శ్రీనివాస్ బిజెపి, చల్లా హరిశంకర్, సత్తినేని శ్రీనివాస్ బి ఆర్ ఎస్, మడుపు మోహన్ కాంగ్రెస్, పైడిపల్లిరాజు, సిపిఐ, మిల్కూరి వాసుదేవ రెడ్డి సిపిఐఎం, తేజ దీప్ రెడ్డి ఏఐఎఫ్ ఎఫ్ బి,తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాల్టీల్లో కాంగ్రెస్ జెండా ఎగారాలి

**మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశంలో కార్యకర్తలు, నాయకులకు జగ్గారెడ్డి దిశా నిర్దేశం**

**సంగారెడ్డి :** సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాల్టీల్లో కాంగ్రెస్ జెండా ఎగారాలని మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం లో కార్యకర్తలు, నాయకులకు పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి దిశా నిర్దేశం చేసారు.... రానున్న మూడు సంవత్సరాలు మనం అధికారం లో ఉంటాం, మరో ఐదేళ్లు అధికారం లో తీసుకురావడానికి పిసిసి అధ్యక్షుడు మహేష్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డి ప్రయత్నం చేస్తున్నారు... మీ వార్డ్ లలో క్యాండేట్ లను మీరే డిసైడ్ చేసుకోండి..... రిజర్వేషన్ లకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేసుకోండి... గత మున్సిపల్ ఎన్నికల్లో కౌన్సిలర్ లు గా పోటీ చేసి గెలిచిన వారు, ఓడిపోయిన వారు పూర్తి బాధ్యత తీసుకోండి... బీసీ ఉన్న వార్డ్ లు, ఎస్సీ అయిన, ఎస్సీ ఉన్న వార్డ్ లు బీసీ అయిన అంతకుముందు ఆ వార్డుల్లో పోటీ చేసినా, గెలిచిన వారు బాధ్యత తీసుకోండి.... కొత్తగా పార్టీ లో వచ్చిన వారికి కౌన్సిలర్ టికెట్ ఇవ్వం... పది వత్సరాలు అధికారం లో లేనప్పుడు పార్టీ లో ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల ముందు పార్టీ లోకి వచ్చిన వారికి రెండవ ప్రాధాన్యత.... నేను టీఆర్ఎస్ లో ఉన్నప్పుడు కాంగ్రెస్ రూలింగ్ లో ఉన్నా సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీ చైర్మన్ లు టీఆర్ఎస్ గెలిపించిన.... నా కష్టం తో నేను బీజేపీ నుండి సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ గా గెలిచిన.... నా జీవితమంతా ప్రజలే...




రాజకీయాలే.... నేను మున్సిపల్ ఎన్నికల్లో ప్రచారానికి రాను... నన్ను ఎవరు పిలువొద్దు..... వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే నిర్మలను ప్రచారానికి కుచుకొండి....మీ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ పథకాలు మీరే చెప్పుకుని ఒట్లడగండి.... నేను పోలీసులతో పోరాడి రాజకీయం చేశాను, పోలీసులను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయలేదు.... బతిమాలుదుతరా, దండం పెడుతరా ఎదైన చేయండి, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటి ల పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. మీరు ఎన్నికల్లో ఎన్ని వాగ్దానా లైన చేయండి.. ఆ వాగ్దానాలను సీఎం రేవంత్ రెడ్డి నీ అడిగి చేయించే బాధ్యత నాది.... సదాశివపేట మున్సిపాలిటీకి, సిడిసి చైర్మన్ రామ్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి ఆంజనేయులు , వాసిం భాయ్ ఇంచార్జ్ లు గా ఉంటారు.... సంగారెడ్డి మున్సిపాలిటీ కి తోపాజి అనంత్ కిషన్, చిద్రుప్ప రఘు, జార్జ్, బొంగుల రవి ఇంచార్జ్ లుగా ఉంటారు..... మున్సిపల్ ఎన్నికల్లో అభ్యర్థుల ఓటమికి ఎవరు ప్రయత్నం చేసినా , టికెట్ రాని వారు వ్యతిరేఖంగా పనిచేసిన నా దగ్గరకు రానివ్వ ను నేను ఒప్పుకోను.... మున్సి పల్ ఎన్నికల్లో మన వారి దగ్గర డబ్బులు లేవని, వేరే డబ్బులున్న వ్యక్తి పోటీ చేస్తా అంటే నేను ఒప్పుకోను.... నా కూతురు కూచి కూడా ప్రచారానికి రాదు..... నేను ప్రచారానికి రాకున్నా సంగారెడ్డి పట్టణ ప్రజలు జగ్గారెడ్డి ని నమ్ముతారు. ... నన్ను ఎవరు వచ్చి కౌన్సిలర్ టికెట్ అడగవద్దు... సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గా కూన సంతోష్ ఉంటాడు.... బీసీ అయినా, బీసీ మహిళా అయిన, జెనరల్ అయిన కూన సంతోష్ మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గా ఉంటాడు... వైస్ చైర్మన్ అభ్యర్థి గా షఫీ హాఫీజ్ ఉంటాడు...సంగారెడ్డి మున్సిపల్ చైర్మన్ ఎస్సీ రిజర్వేషన్ అయితే మహేష్ లాల్ చైర్మెన్ గా ఉంటాడు. కమిటీ లు ఫైనల్ చేసిన వ్యక్తులే ఫైనల్..... ఎవరు టికెట్ కోసం గాంధీ భవన్ వెళ్లి పిసిసి ప్రెసిడెంట్ ను కలిసి ఇబ్బంది పెట్టొద్దు....సదాశివపేట ఎస్సీ రిజర్వ్ అయితే చిరు చైర్మన్ అభ్యర్థి గా ఉంటాడు....కాంగ్రెస్ అభ్యర్థులుగా నిర్ణయిం చిన వారిని ఓడగొట్టే ప్రయత్నం చేసేవారిని ఎన్నికల సమయం అని చూడకుండా సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు.

# 10వ తరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి

**సిద్దిపేట :** సిద్దిపేట జిల్లాలో 10వ తరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణత సాధించేలా కార్యాచరణ బద్ధంగా పదో తరగతి విద్యార్థులచే ప్రత్యేకంగా చదివించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ప్రభుత్వ విద్యాలయాల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి సమావేశ మందిరంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, వివిధ గురుకులాల ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్ లతో పదవ తరగతి విద్యార్థుల ఉత్తీర్ణతపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీల వారీగా గత సంవత్సరం పదవ తరగతిలో సాధించిన ఉత్తీర్ణత శాతం మరియు ఈసారి 100% ఉత్తీర్ణత సాధించడానికి తీసుకున్న చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. గత మూడు సంవత్సరాలుగా పదో తరగతి ఫలితాల్లో జిల్లా ఉన్నత స్థానాలను సాధిస్తూ ఆదర్శంగా నిలిచిందని అదే మాదిరిగా ఈసారి కూడా 100% ఉత్తింద్రత సాధించేలా ప్రత్యేక కార్యచరణ ప్రకారం విద్యార్థులను చదివించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో నేటి నుండే ఉదయం 8 గంటల నుండి 9 గంటల వరకు సాయంత్రం 4:30 గంటల నుండి 5:30 గంటల వరకు పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక స్టడీ అవర్స్ నిర్వహించి విద్యార్థులు వీక్ ఉన్న సబ్జెక్టులలో కచ్చితంగా ఉత్తీర్ణత అయ్యేలా ప్రత్యేకంగా తర్ఫీదు నివ్వాలని అన్నారు. విద్యార్థులచే బట్టి పట్టించడం కాకుండా సబ్జెక్ట్ అర్థమయ్యేలా బోధించాలని అన్నారు. పేరెంట్స్ మరియు సంక్షేమ హాస్టల్లో సంక్షేమ అధికారులతో సమావేశాలు నిర్వహించి కచ్చితంగా ప్రతి ఒక్క విద్యార్థి ప్రతిరోజు పాఠశాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థులు పరీక్ష సమయంలో టెన్షన్ కు గురికాకుండా ముందుగా ట్రేస్ మేనేజ్మెంట్ పై తర్ఫీదు నివ్వాలని అన్నారు. పిల్లలు చదువుతోపాటు వాళ్ళు చెప్పదలుచుకున్నది ధైర్యంగా చెప్పినప్పుడే పరీక్షలలో మరియు భవిష్యత్తులో కూడా రాణిస్తారు కాబట్టి ఆదిశగా వారిని మోటివేట్ చేయాలని అన్నారు. పదవ తరగతి చదువుతున్న ఇప్పటికీ సరిగా చదవడం రాయడం రాని విద్యార్థులు ఉండడం దురదృష్టకరమని ఇలాంటి పరిస్థితి రాకుండా ప్రాథమిక స్థాయి నుండే రాయడం చదవడం పై త్వరలోనే ప్రైమరీ స్కూల్స్ టీచర్లతో కూడా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తానని అన్నారు. హైస్కూలలో కూడా అన్ని తరగతుల



విద్యార్థులు సరిగా చదివేలా, రాసేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని అన్నారు. అందరికీ సమాన విద్య అవకాశాలు లభించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆమెరకు ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులను నెలకొల్పడం జరిగిందని, మంచి నైపుణ్యత గల ఉపాధ్యాయులు అన్ని ప్రభుత్వ పాఠశాలలో ఉన్నారని అన్నారు. కొన్ని స్కూళ్లలో విద్యార్థుల అడ్మిషన్స్ చాలా తక్కువ ఉన్నాయని విద్యార్థుల అడ్మిషన్ పెరిగేలా ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యాబోధన జరగాలని అన్నారు. అదేవిధంగా విద్యార్థులు ఆరోగ్యంగా పెరిగేలా ప్రభుత్వ మెనూ ప్రకారం ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు మరియు కేజీబీవీ లలో మెనూ ప్రకారం ఆహారం అందించాలని సూచించారు. ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థుల ప్రత్యేక అభ్యసన ప్రణాళిక బుక్లెట్లను ఆవిష్కరించారు. రాష్ట్రస్థాయి చెకుమకీ సైన్స్ సంబరాలు 2025 లో రాష్ట్రస్థాయిలో మొదటి బహుమతులను పొందిన సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్ విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు, అన్ని మండలాల ఎంఈఓ లు, సోషల్ వెల్ఫేర్ , బీసీ వెల్ఫేర్ మైనార్టీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ల డిసిఓ లు, ప్రిన్సిపాల్ లు విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నా రు. అంతకుముందు రహదారి భద్రత మహోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ప్రధానోపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడుతూ మీ పాఠశాలలకు ఆటోలు, ప్రైవేటు, బస్సులు తర్వాత వచ్చే సమయంలో ఆయా వాహనాల డ్రైవర్ల కండిషన్లు లైసెన్సులు వాహన కండిషన్లు, వాహనం కాల పరిమితి అన్ని పరిశీలించాలని అన్నారు. ముఖ్యంగా అధిక లోడుతో ఆటోలలో విద్యార్థులను రవాణా చేయడం లంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఆటోలో ఆరుగురికి మించి విద్యార్థులను తీసుకురాకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, డిఇఓ శ్రీనివాసరెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

## సౌదీ నుంచి స్వదేశానికి పెరాలసిస్ పేషెంట్

**నిమ్స్‌లో అడ్మిషన్‌కు ఏర్పాట్లు పూర్తి**

**జగిత్యాల :** జగిత్యాల జిల్లా, మల్లాపూర్ మండల కేంద్రానికి చెందిన బైకెన్ శ్రీనివాస్ (నక్క శ్రీను) సంవత్సరం క్రితం ట్రక్ డ్రైవర్ వీసాపై సౌదీ అరేబియాలోని రియాద్ సమీప మజ్మా ప్రాంతానికి వెళ్లాడు. గత డిసెంబర్ 15న అక్కడ ఆయనకు స్వల్ప పక్షవాతం (పెరాలసిస్) రావడంతో మజ్మాలోని కింగ్ ఫాహద్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. బీపీ మందులు క్రమం తప్పకుండా వాడకపోవడం, తీవ్రమైన చలి కారణంగా ఈ పరిస్థితి తలెత్తి ఉండవచ్చని భావిస్తున్నారు. పక్షవాతానికి గురైన బైకెన్ శ్రీనివాస్‌ను సౌదీ అరేబియా నుంచి స్వదేశానికి తీసుకువచ్చి, హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ ఆయన కుటుంబ సభ్యులు గత డిసెంబర్ 30న హైదరాబాద్‌లోని సీఎం ప్రవాసీ ప్రజావాణి లో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బాధితుని తల్లి మల్లు, భార్యలు హారిక, రాధ, ముగ్గురు పిల్లలు, బంధువు రాకేష్‌లు తమ సమస్యను ఎన్నారై అడ్వయిజరీ కమిటీ చైర్మన్, అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, వలంటీర్ మహ్మద్ బషీర్ అహ్మద్‌లకు వివరించారు. ఈ వినతిపై స్పందించిన తెలంగాణ ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగం అధికారులు సమస్యను 'మదద్' (కాన్సులార్ సర్వీసెస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) లో నమోదు చేసి, రియాద్‌లోని ఇండియన్ ఎంబసీకి, న్యూఢిల్లీలోని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు వైర్ మెసేజ్ పంపించారు. రియాద్‌లో నివసిస్తున్న కోరుట్లకు చెందిన సామాజిక సేవకుడు ఖాజా ముజమిలుద్దీన్, ఇండియన్ ఎంబసీ రియాద్‌తో సమన్వయం చేసి అవసరమైన ఏర్పాట్లు చేశారు. ఆయన సహకారంతో పెరాలసిస్ బాధితుడు బైకెన్ శ్రీనివాస్ బుధవారం 07 జనవరి 2026 ఫ్లయినాస్ విమానంలో రియాద్ నుంచి హైదరాబాద్‌కు ఉదయం 8 గంటలకు చేరుకోనున్నారు. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి 108 అంబులెన్స్ సేవల ద్వారా నిమ్స్ ఆస్పత్రికి తరలించనున్నారు. ఇదిలా ఉండగా, తెలంగాణ ప్రభుత్వ జీఏడీ ఎన్నారై విభాగం విజ్ఞప్తి మేరకు బైకెన్ శ్రీనివాస్ (నక్క శ్రీను) ను హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) లో అడ్మిషన్ కల్పించి వైద్యం అందించేందుకు నిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ అధికారికంగా అంగీకార పత్రం (ఎన్‌ఓసీ) జారీ చేశారు.

## ఓసి జేఏసీ జగిత్యాల జిల్లా కో ఆర్డినేషన్ కమిటీకన్వీనర్ గా మహంకాళి రాజన్న

**జగిత్యాల :** జగిత్యాల జిల్లా ఓసి జేఏసీ కో ఆర్డినేషన్ కమిటీని ఓసి జేఏసీ సామాజిక సమాఖ్య సంఘాల జాతీయ అధ్యక్షులు పోలాడి రామారావు ఆదేశాల మేరకు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి నియామకం చేశారు. కో ఆర్డినేషన్ కమిటీ జగిత్యాల జిల్లా కన్వీనర్ గా మహంకాళి రాజన్న, జిల్లా కో కన్వీనర్లుగా వెలమ, రెడ్డి, బ్రాహ్మణ, వైశ్య సంఘాల జిల్లా అధ్యక్షులైన అయిల్నేని సాగర్ రావు, కోప్పెర వెంకట్ రెడ్డి, మోతే ఉమాపతి శర్మ, మైలారపు లింబాద్రిలను నియమించినట్లు కిషన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లా కో కన్వీనర్లుగా సిరిసిల్ల శ్రీనివాస్,గడ్డం భాస్కర్ రెడ్డి, చీటి శిరీషా రావు,సిరిసిల్ల రాజేందర్ శర్మ, పుల్లూరి సత్యనారాయణ, దన్నపనేని వేణుగోపాల్ రావు, దేవరశెట్టి జనార్దన్, మందల గోపాల్ రెడ్డి,ఊటూరి నవీన్, బోయినిపెల్లి శ్రీధర్ రావు,బండారి చంద్రశేఖర్, ఇమ్మనేని ప్రశాంత్ రావు,అయిల్నేని వెంకటేశ్వర్ రావు, నమిలకొండ సాకేత, అయిల్నేని స్వప్న, నాగిశెట్టి అపర్ణ,ఉటూరి హరిత,నాగిరెడ్డి రజిత తదితరులను నియమించినట్లు ఆయన తెలిపారు. ఓసిల సింహగర్జన బహిరంగ సభను విజయవంతం చేయడానికి ఈ కమిటీ ఓసి బంధువులందరిని సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని కిషన్ రెడ్డి సూచించారు. ఈనెల 11 వరంగల్ లో ఓసిల సింహ గర్జన పేరిట నిర్వహించనున్న బహిరంగ సభకు జగిత్యాల జిల్లానుండి పెద్ద సంఖ్యలో ఓసిలు హాజరు కావాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు.

## రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ శ్రేణులకు బిజెపి చీఫ్ దిశానిర్దేశం

**హైదరాబాద్ :** బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అధ్యక్షతన ఈరోజు జీహెచ్ఎంసీ పరిధిలోని 8 జిల్లాల్లోని ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారని తెలిపారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యాచరణపై రాష్ట్ర అధ్యక్షుడు నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ , పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతమ్ రావు , పార్టీ సీనియర్ నాయకులు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రబాకర్ పార్టీకి చెందిన ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారని తెలిపారు. రాష్ట్ర పదాధికారుల సమావేశంలో తీసుకున్న నిర్ణయాల మేరకు రాబోయే ఎన్నికల నేపథ్యంలో ప్రతి డివిజన్ వారీగా సీనియర్ నాయకుల సమన్వయంతో ముందుకు వెళ్లాలని, అదే విధంగా అక్కడి కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ సంస్థాగతంగా, రాజకీయంగా పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించినట్లు డా. గౌతమ్ రావు వివరించారు.

## మేడారం మహాజాతరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అధికారిక ఆహ్వానం

**హైదరాబాద్ :** ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న ప్రపంచ ప్రసిద్ధి చెందిన అతిపెద్ద ఆదివాసీ-గిరిజన ఆధ్యాత్మిక వేడుక మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ మహాజాతరలో పాల్గొనాల్సిందిగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారికంగా ఆహ్వానించారు. ఈ మేరకు మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మేడారం ఆలయ పూజారులతో కలిసి అసెంబ్లీ ఛాంబర్‌లో ముఖ్యమంత్రి కలసి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మేడారం శ్రీ సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది భక్తులు తరలివచ్చే ఈ మహాజాతరను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

## నూతనంగా ఎన్నికైన సిద్దిపేట నియోజక వర్గ సర్పంచులకు,ఉప సర్పంచులకు ఆత్మీయ సత్కారం

**ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు, ఎంఎల్సి దేశపతి శ్రీనివాస్, మాజీ ఎంఎల్సి పారుక్ హుస్సేన్.**

**సిద్దిపేట :** నూతనంగా ఎన్నికైన సిద్దిపేట నియోజక వర్గ సర్పంచులకు,ఉప సర్పంచులకు ఆత్మీయ సత్కారం జరిగింది. ముఖ్య అతిథిగా మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు, ఎంఎల్సి దేశపతి శ్రీనివాస్, మాజీ ఎంఎల్సి పారుక్ హుస్సేన్ హజరయ్యారు.. ఈ సందర్భంగా హరీష్ రావు మాట్లాడుతుసర్పంచ్ ఎన్నికలు గెలవడం ఛాలెంజ్.. ప్రజల నమ్మకం పొందిన వారిని గెలిపించారునా సర్వ శక్తులు ఉపయోగించి మీకు సహాయ సహకారం అందిస్తా. కేసీఆర్ హయాంలో గ్రామాలను ముత్యంలా తీర్చిదిద్దారు. దేశంలో ఎక్కడ లేని విధంగా కేసీఆర్ ప్రతి గ్రామానికి ట్రాక్టర్, డంప్ యార్డ్, వైకుంఠ ధామం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేండ్ల నుండి గ్రామాలను మురికి కుపాలగా మార్చారు. కేసీఆర్ హయాంలో దేశంలో అవార్డ్ లు ప్రకటిస్తే తెలంగాణ పేరు ఉంటే, కాంగ్రెస్ ప్రభుత్వం లో అవార్డ్ ల పేరే లేకుండా పోయింది. రెండెండ్ల కాంగ్రెస్ పాలన లో పేరుకుపోయిన చెత్తను తీసే బాధ్యత ప్రస్తుత సర్ంచుల పై పడిందికేసీఆర్ గ్రామాలకు ప్రతినెల డబ్బులు వేశారు. రేవంత్ రెడ్డి గ్రామాలకు నిధులు ఇవ్వాలిగతంలో మనం ప్రతిపక్షంలో ఉండి కూడా అభివృద్ధి చేసుకున్నాం. 2017కి ముందు సిద్దిపేట లో 8వేల ఎకరాల్లో మాత్రమే వరి సాగు చేసేవారు, 80వేల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారురేవంత్ రెడ్డి జుట మాటలు మాట్లాడుతున్నారు. సిద్దిపేట ను విద్యాలయాలకు, ఆలయాలకు నిలయంగా, రిజర్వాయర్ లకు నిలయంగా మార్చుకున్నాము అందరం కుటుంబంలా కలసి పనిచేద్దాం.



## బిజినెస్

### హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీలో ఆర్‌యూఎఫ్



హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), తన విశాఖపట్నం రిఫైనరీలో అవశేషాల అప్‌గ్రేడేషన్ కేంద్రాన్ని (ఆర్‌యూఎఫ్) ప్రారంభించింది. ఫలితంగా ప్లాంటు డీప్-కన్వర్షన్ సామర్థ్యం, డిస్టిలేట్ ఉత్పత్తి, లాభదాయకత గణనీయంగా పెరిగాయని తెలిపింది. డిస్టిలేట్ ఉత్పాదకత 10% అధికమవుతుందని పేర్కొంది. ఏటా 3.55 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంటులో దేశంలోనే తొలి అవశేష హైడ్రోక్రాకింగ్ యూనిట్, ప్రపంచంలోనే తొలి ఎల్‌సీ-మ్యాక్స్ యూనిట్ ఉన్నాయి. ముడిచమురులో తక్కువ విలువైన భాగాన్ని కూడా, 93% అధిక విలువైన పెట్రోలియం ఉత్పత్తులుగా ఇవి మార్చగలవని సంస్థ వివరించింది. చమురు శుద్ధి సంక్లిష్టతను మెరుగుపరచడంలో, దిగుమతి చేసుకున్న ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడంలో ఈ ప్రాజెక్ట్ ఒక ప్రధాన అడుగు అని తెలిపింది.

### ఎల్ఐసీ నుంచి జీవన్ ఉత్సవ్ సింగిల్ ప్రీమియం ప్లాన్




ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్‌ఐసీ (ఒఎఅ) జీవన్ ఉత్సవ్ పేరిట సింగిల్ ప్రీమియం ప్లాన్‌ను ప్రకటించింది. జనవరి 12 నుంచి దీని విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. నాన్ పార్టిసిపేటింగ్, నాన్‌లింక్డ్, ఇండివిడ్యువల్, సేవింగ్స్, పూర్తి జీవితకాలానికి బీమా అందించే ప్లాన్ ఇది. ప్రీమియం, ఇతర వివరాలు వెల్లడించలేదు. జీవన్ ఉత్సవ్ పేరిట రెండేళ్ల క్రితం ఓ పాలసీని ఎల్‌ఐసీ తీసుకొచ్చింది. దానికే మార్పులు చేసి సింగిల్ ప్రీమియంగా తీసుకొచ్చే అవకాశం ఉంది. ఒకసారి పాలసీని కొనుగోలు చేస్తే జీవితాంతం ఆదాయం పొందొచ్చున్నమాట.పాలసీ పునరుద్ధరణకు అవకాశంమరోవైపు లాప్స్ అయిన పాలసీలను పునరుద్ధరించుకునే అవకాశం కల్పిస్తూ ప్రత్యేక పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఎల్‌ఐసీ చేపట్టింది. ప్రీమియం చెల్లింపుల గడువు దాటి, కాలవ్యవధి పూర్తికాని పాలసీలను ఈ కార్యక్రమంలో భాగంగా పునరుద్ధరించుకోవచ్చు. జనవరి 1 నుంచి మార్చి 2 వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. ఇందులోభాగంగా ఆలస్య రుసుము విషయంలోనూ రాయితీ ఇస్తున్నట్లు ఎల్‌ఐసీ ప్రకటించింది. నాన్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లపై గరిష్ఠంగా 30 శాతం (రూ.5వేల వరకు), మైక్రో ఇన్సూరెన్స్ ప్లాన్లపై నూరు శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. ప్రీమియం చెల్లింపులు నిలిచిపోయి ఐదేళ్లు లేదా అంతకంటే తక్కువ సమయం ఉన్న పాలసీలను మాత్రమే పునరుద్ధరించుకోవచ్చని ఎల్‌ఐసీ స్పష్టం చేసింది.

# నిబంధనల అమలుకే బోర్డులు

**హైదరాబాద్:** 'దేశ కార్పొరేట్ రంగంలో, అగ్రశ్రేణి సంస్థల బోర్డులు నిబంధనల అమలుకే పరిమితం అవుతున్నాయి. కంపెనీల భవిష్యత్తును తీర్చిదిద్దే వ్యూహ రచనల్లో చురుకైన పాత్ర పోషించడం లేదు' అని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) నివేదిక వెల్లడించింది. 'ది బోర్డ్స్ లుకింగ్ గ్లాస్' పేరుతో విడుదల చేసిన కార్పొరేట్ గవర్నెన్స్ రిపోర్టు 2025 ప్రకారం.. 17% బోర్డులు మాత్రమే కంపెనీ వ్యూహాలను రూపొందించడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాయి. మిగిలిన 83% బోర్డులు.. కంపెనీ నిర్వహణలో చురుకైన పాత్ర పోషించకుండా, నిష్క్రియగా ఉండిపోతున్నాయని స్పష్టం చేసింది. బీఎస్‌ఈ 500 కంపెనీల్లోని 200 మందికి పైగా డైరెక్టర్ల అభిప్రాయాలను సేకరించి ఈ నివేదిక రూపొందించినట్లు ఐఎస్‌బీ వెల్లడించింది. ప్రొఫెసర్లు సంజయ్ కల్లాపూర్, నిర్మాల్య కుమార్, హరీష్ రాయ్ చందానీ సారథ్యంలో ఈ అధ్యయనం జరిగింది. సమీక్షించడంతోనే సరి..ఈ నివేదిక ప్రకారం 98% మంది డైరెక్టర్లు తమ బోర్డులు నిబంధనలను పాటించడంలో పరిణతి సాధించాయని భావిస్తున్నారు. భవిష్యత్తు అవసరాలను గుర్తించి, వ్యూహాత్మక మార్గదర్శకత్వం చేయడంలో మాత్రం బోర్డులు వెనకబడి ఉన్నాయి. యాజమాన్యం సిద్ధం చేసిన ప్రణాళికలను సమీక్షించడం మినహా, తాము అదనంగా ఇచ్చే సూచనలు చాలా పరిమితంగానే ఉన్నాయని 36% మంది డైరెక్టర్లు అంగీకరించారు. బోర్డులో పని అంటే.. సమావేశాలకు హాజరవ్వడం మాత్రమే కాదని, నిర్మాణాత్మక చర్చలు, స్వతంత్ర ఆలోచనలు ఉండాలని నిర్మాల్య కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సమర్థ పర్యవేక్షణ నిమిత్తం, డైరెక్టర్లు ముందస్తు జాగ్రత్తలతో రిస్కులను అంచనా వేయాలని సంజయ్ కల్లాపూర్ సూచించారు.స్పష్టత లోపిస్తోందిబోర్డు సభ్యులు - కంపెనీ సీఈఓ మధ్య ఉండాల్సిన స్పష్టత, నిజాయితీ విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సీఈఓలకు నచ్చని అభిప్రాయాలను వెల్లడించేందుకు డైరెక్టర్లు వెనకాడుతున్నారు. 38% మంది మాత్రమే ఈ విషయంలో స్పందిస్తున్నారు. సంస్థల్లో పారదర్శకతకు ఆధారమైన ప్రజావేగు, విజిలెన్స్ యంత్రాంగాల విషయంలో 22% బోర్డులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. నిబంధనల అమలు కోసం చేసే ప్రక్రియ లుగానే చూస్తున్నారు మినహా, నమ్మకాన్ని పెంపొందించే సాధనాలుగా వీటిని పరిగణించడం లేదు. భారతీయ కార్పొరేట్ బోర్డుల్లోని స్వతంత్ర డైరెక్టర్లు తమ పనితీరును, నైతికతను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని పరిశో ధకుడు హరీష్ రాయ్ చందానీ పేర్కొన్నారు. నివేదికలోని ఇతర అంశాలేమిటంటే.. ప్రతి ముగ్గురు డైరెక్టర్లలో ఒకరు బోర్డు సమావేశాలకు తగినంతగా సిద్ధం కావడం లేదు.అయిదుగురు డైరెక్టర్లలో ఇద్దరికి కంపెనీ లక్ష్యాలపై సరైన అవగాహన లేదు.ఆరుగురు డైరెక్టర్లలో ఒక్కరు మాత్రమే బయట జరిగే పరిణామాలను పరిగణనలోకి తీసుకుని, చర్చల్లో వినిపిస్తున్నారు.



# ప్రత్యేక ధరలను ప్రకటించిన యమహా

యమహా మోటార్ తన 70వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా, ఇండియా యమహా మోటార్ జనవరి 5 నుంచి అమల్లోకి వచ్చేలా యమహా ఆర్15 సిరీస్‌పై రూ. 5,000 ప్రత్యేక ధర ప్రయోజనాన్ని ప్రకటించింది. ఈ వార్షికోత్సవ ఆఫర్‌తో, యమహా ఆర్15 సిరీస్ ధర ఇప్పుడు రూ. 1,50,700 (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ) నుండి ప్రారంభమవుతుంది. ఐకానిక్ స్పోర్ట్ మోటార్‌సైకిళ్లను మరింత విస్తృతంగా ఔత్సాహికులకు అందుబాటులోకి తీసుకురావాలనే యమహా నిబద్ధతను ఇది మరింత బలపరుస్తుంది.ప్రారంభం నుంచే, యమహా ఆర్15 భారతదేశంలో ఎంట్రీ-లెవల్ పెర్ఫార్మెన్స్ మోటార్‌సైకిల్ విభాగాన్ని కొత్త దిశగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తోంది. రేసింగ్ నుంచి ప్రేరణ పొందిన డిజైన్, అత్యాధునిక సాంకేతికత మరియు రోజువారీ వినియోగానికి అనుకూలమైన రైడబిలిటీతో, దేశవ్యాప్తంగా యువ రైడర్లలో విస్తృత గుర్తింపు మరియు బలమైన ఆదరణను సంపాదించింది. భారతదేశంలో ఇప్పటివరకు ఒక మిలియన్ యూనిట్లకు పైగా ఉత్పత్తి కావడంతో, ఆర్15 యమహా యొక్క బలమైన తయారీ సామర్థ్యాలకు ప్రతీకగా నిలవడమే కాకుండా, భారతీయ మోటార్‌సైక్లింగ్ సంస్కృతితో బ్రాండ్‌కు ఉన్న లోతైన అనుబంధాన్ని కూడా ప్రతిబింబిస్తుంది.యమహా యొక్క అధునాతన 155 సిసి లిక్విడ్-కూల్డ్, ఫ్యూయల్-ఇంజెక్టెడ్ ఇంజిన్‌కు బ్రాండ్‌కు చెందిన డయాసిల్ సిలిండర్ టెక్నాలజీ మరియు ప్రఖ్యాత డెల్టాబాక్స్ ఫ్రేమ్ మద్దతు ఇవ్వడంతో, ఆర్15 పనితీరు మరియు హ్యాండ్లింగ్ ప్రమాణాలను నిరంతరం కొత్త స్థాయికి తీసుకెళుతోంది. ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, అసిస్ట్ & స్లిప్పర్ క్లచ్, ఎంపిక చేసిన వేరియంట్లలో క్విక్ షిఫ్టర్, అప్సైడ్-డౌన్ ఫ్రంట్ ఫోర్కులు మరియు లింక్-టైప్ మోనోక్రాస్ సస్పెన్షన్ వంటి అధునాతన ఫీచర్లతో, ఈ మోటార్‌సైకిల్ తన సెగ్మెంట్‌లో ముందంజలో ఉన్న పనితీరును అందిస్తుంది. ట్రాక్ నుంచి ప్రేరణ పొందిన డిజైన్ మరియు స్పష్టమైన రేసింగ్ డీఎన్ఏతో, యమహా ఆర్15 సిరీస్ భారతదేశంలో అత్యంత ఆకాంక్షితమైన, పనితీరు-కేంద్రిత మోటార్‌సైకిళ్లలో ఒకటిగా తన స్థానాన్ని మరింత బలపరుస్తోంది.



## స్పోర్ట్స్

# దుమ్మురేపిన హైదరాబాదీ బ్యాటర్..
# అమన్ రావ్ డబుల్ సెంచరీ

**రాజ్‌కోట్:** విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాదీ బ్యాటర్ అమన్ రావ్ దుమ్మురేపాడు. డబుల్ సెంచరీతో హడలెత్తించాడు. బెంగాల్‌తో రాజ్‌కోట్‌లో జరిగిన మ్యాచ్‌లో బౌండరీలో మోత మోగించాడు. కేవలం 154 బంతుల్లోనే అతను 200 పరుగులు చేశాడు. అతని డబుల్ సెంచరీలో 12 ఫోర్లు, 13 సిక్సర్లు ఉన్నాయి. అమెరికాలో పుట్టిన హైదరాబాదీ బ్యాటర్ అమన్ రావ్.. ఐపీఎల్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు సొంతం చేసుకున్నది. అయితే లిస్ట్ ఏ మ్యాచ్‌ల్లో తొలి సారి అతను సెంచరీ చేశాడు. ఇది అతనికి కేవలం మూడో మ్యాచ్ మాత్రమే. షమీ, ఆకాశ్ దీప్, ముఖేశ్ కుమార్ లాంటి బలమైన బౌలర్లు ఉన్న బెంగాల్ జట్టుపై అమన్ రావ్ డబుల్ సెంచరీ కొట్టడం విశేషం. టాస్ గెలిచిన బెంగాల్ జట్టు.. హైదరాబాద్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. అయితే ఇన్నింగ్స్ ఆఖరి బంతికి సిక్సర్ కొట్టిన అమన్ రావు.. తన ఖాతాలో డబుల్ సెంచరీ వేసుకున్నాడు. ఆకాశ్ దీప్, షమీ, ముఖేశ్ బౌలింగ్‌లో అతను 120 రన్స్ స్కోర్ చేశాడు. విజయ్ హజారే ట్రోఫీలో ఈ సీజన్‌లో ఇది రెండో డబుల్ సెంచరీ. ఒడిశా బ్యాటర్ స్వస్తిక్ సమల్ కూడా డబుల్ సెంచరీ బాదిన విషయం తెలిసిందే.



# విజయ్ హజారే ట్రోఫీ 'విజేత' బీహార్




విజయ్ హజారే ట్రోఫీ 2025-26 సీజన్ ప్లేట్ గ్రూప్ విజేతగా బీహార్ నిలిచింది. మంగళవారం రాంచీ వేదికగా జరిగిన ఫైనల్‌లో 6 వికెట్ల తేడాతో మణిపూర్‌ను చిత్తు చేసిన బీహార్.. ఈ దేశవాళీ వన్డే టోర్నీ టైటిల్‌ను ముద్దాడింది. ఈ తుది పోరులో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన మణిపూర్ 47.5 ఓవర్లలో కేవలం 169 పరుగులకే కుప్పకూలింది. బీహార్ స్పిన్నర్ షబీర్ ఖాన్ ఏకంగా 7 వికెట్లు పడగొట్టి మణిపూర్ పతనాన్ని శాసించాడు. అతడితో పాటు హిమాన్షు తివారీ 3 వికెట్లు సాధించాడు. మణిపూర్ బ్యాటర్లలో ఉలెనయ్ ఖ్వైరాక్‌పమ్(61), ఫిరోయిజామ్ జోటిన్(51) హాఫ్ సెంచరీలతో రాణించారు. అనంతరం 170 పరుగుల లక్ష్యాన్ని బీహార్ కేవలం 4 వికెట్లు మాత్రమే కోల్పోయి 31.2 ఓవర్లలో ఛేదించింది. బీహార్ బ్యాటర్లలో ఆయుష్ లోహారుక 75 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా.. మంగల్ మహరౌర్(32), ఆకాష్ రాజ్(20) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ షబీర్ ఖాన్‌కు దక్కగా.. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఫిరోయిజామ్ జోటిన్ నిలిచాడు. కాగా ఈ సీజన్‌లో బీహార్ జట్టు అద్భుతమైన ప్రదర్శన కనబరిచింది. లీగ్ దశలో ఆడిన 5 మ్యాచ్‌ల్లోనూ విజయం సాధించి, పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు చేరింది. ఫైనల్‌లో కూడా అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా ఈ టోర్నీలో అరుణాచల్ ప్రదేశ్‌పై బీహార్ 574 పరుగుల భారీ స్కోరు చేసి ప్రపంచ రికార్డు సృష్టించింది. అదేవిధంగా 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ బీహార్ తరఫున కేవలం 36 బంతుల్లోనే సెంచరీ సాధించి అందరి దృష్టిని ఆకర్షించాడు. అయితే జాతీయ విధుల కారణంగా టోర్నీ మధ్యలోనే వైభవ్ వైదొలిగాడు.

# దీప్తీ శర్మకు భారీ షాక్

ఐసీసీ మహిళల టీ20 బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ అన్నాబెల్ సదర్లాండ్ తిరిగి అగ్రస్థానాన్ని అధిరోహించింది. తాజాగా ప్రకటించిన ర్యాంకింగ్స్‌లో భారత్ స్టార్ ఆల్‌రౌండర్ దీప్తీ శర్మను వెనక్కి నెట్టి నంబర్ వన్ స్థానాన్ని సదర్లాండ్ కైవసం చేసుకుంది. సదర్లాండ్ 736 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా.. దీప్తీ శర్మ(735) రెండో స్థానంలో ఉంది. దీప్తికి ఆసీస్ ప్లేయర్‌కు కేవలం ఒక్క పాయింట్ మాత్రమే తేడా ఉంది. ఇటీవల శ్రీలంక మహిళలతో జరిగిన టీ20 సిరీస్‌లో శర్మ చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయకపోవడంతో తన టాప్ ర్యాంక్‌ను కోల్పోవల్సి వచ్చింది. ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఆమె కేవలం 5 వికెట్లు మాత్రమే పడగొట్టింది. మరోవైపు, భారత బౌలర్లు రేణుకా సింగ్ ఠాకూర్ ఐదు స్థానాలు దిగజారి 11వ స్థానానికి, రాధా యాదవ్ రెండు స్థానాలు తగ్గి 18వ స్థానానికి పడిపోయారు. ఇక బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో మాత్రం మన అమ్మాయిలు అదరగొట్టారు. శ్రీలంకతో సిరీస్‌లో దుమ్ములేపిన భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రెండు స్థానాలు ఎగబాకి 13వ ర్యాంక్‌కు చేరుకుంది. ఈ సిరీస్‌లో వరుసగా మూడు హాఫ్ సెంచరీలు బాదిన షఫాలీ తన 6వ స్థానాన్ని మరింత పదిలం చేసుకుంది. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ క్రికెటర్ అరుంధతి రెడ్డి సత్తాచాటింది. ఆల్ రౌండర్ల జాబితాలో ఆమె ఏకంగా 44 స్థానాలు ఎగబాకి 21వ స్థానానికి చేరుకుంది.








## సైలెంట్ హిట్‌గా మారిన ‘శంబాల’ ఆది సాయికుమార్‌కి ఊపిరి పోసిన హారర్ అడ్వెంచర్

డిసెంబర్ 25న విడుదలైన పలు సినిమాల మధ్య పెద్దగా హడావిడి లేకుండా వచ్చి అనూహ్యంగా మంచి ఫలితాన్ని అందుకున్న చిత్రం శంబాల. భారీ బ్లాక్‌బస్టర్ టాక్ కాకపోయినా, “ఒక్కసారి థియేటర్‌లో చూసేయొచ్చు” అనే పాజిటివ్ వర్డ్ ఆఫ్ మౌత్‌తో ఈ సినిమా నిలకడగా ప్రేక్షకులను ఆకర్షించింది. ముఖ్యంగా గత కొన్నేళ్లుగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆది సాయికుమార్‌కి ‘శంబాల’ ఒక కీలక మలుపుగా మారింది. సినిమా రిలీజ్‌కు ముందే టీజర్, ట్రైలర్‌లు ఆసక్తిని పెంచాయి. హారర్‌అడ్వెంచర్ జానర్‌లో కొత్త ప్రయత్నంగా కనిపించిన కంటెంట్‌కి థియేటర్లలో ఆదరణ లభించింది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్ రావడంతో వసూళ్ల పరంగా కూడా సినిమా ఆశించిన దానికంటే మెరుగ్గా రాణిస్తోంది. మేకర్స్ విడుదల చేసిన సమాచారం ప్రకారం ‘శంబాల’ ఇప్పటివరకు రూ.20 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. షేర్ పరంగా చూస్తే దాదాపు రూ.11 కోట్ల వరకు వచ్చింది. మొత్తం బిజినెస్ సుమారు రూ.5 కోట్లుగా ఉండటంతో, సినిమా ఇప్పటికే మంచి లాభాల దిశగా దూసుకెళ్తోంది. ప్రస్తుత రన్ చూస్తే ఫైనల్‌గా రూ.25 కోట్ల గ్రాస్ దాటే అవకాశముందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అదనంగా హిందీ వెర్షన్ రిలీజ్ కూడా ప్లాన్‌లో ఉండటంతో రెవెన్యూ మరింత పెరగనుంది.యుగంధర్ ముని దర్శకత్వంలో రూపొందిన ఈ హారర్ అడ్వెంచర్ చిత్రం శంబాల అనే పురాతన గ్రామం చుట్టూ తిరుగుతుంది. వెయ్యేళ్ల చరిత్ర ఉన్న ఆ గ్రామంలో 1980లలో ఓ ఉల్క పడిన తర్వాత వింత ఘటనలు మొదలవుతాయి. గ్రామస్తులు దానిని ‘బండ భూతం’గా భావిస్తారు. పాలకు బదులుగా రక్తం రావడం, వరుస హత్యలు, అనూహ్య మరణాలు గ్రామాన్ని భయాందోళనలకు గురిచేస్తాయి. ఈ పరిస్థితులను పరిశీలించేందుకు ప్రభుత్వం పంపిన సైంటిస్ట్ విక్రమ్ (ఆది సాయి కుమార్) ఆ గ్రామంలో అడుగుపెడతాడు. అక్కడి దేవత కథ, గ్రామ చరిత్ర, వరుస ఘటనల వెనుక ఉన్న రహస్యాలు క్రమంగా బయటపడతాయి. సస్పెన్స్‌తో పాటు హారర్ ఎలిమెంట్స్‌ను బ్యాలెన్స్ చేయడం సినిమా ప్రధాన ఆకర్షణగా నిలిచింది.కొత్తదనం ఉన్న కథనాన్ని ప్రేక్షకులు ఆదరిస్తారనడానికి ‘శంబాల’ ఒక ఉదాహరణగా నిలిచింది. ఆది సాయికుమార్‌కి ఇది కేవలం హిట్ మాత్రమే కాకుండా, కెరీర్‌లో మళ్లీ బలమైన స్థానం తీసుకొచ్చిన సినిమా అని చెప్పొచ్చు. చిన్న సినిమాగా వచ్చి, సైలెంట్‌గా విజయం సాధించిన ‘శంబాల’ ఇప్పుడు ట్రేడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది.

## సంక్రాంతికి ‘అనగనగా ఒక రాజు’తో రాబోతున్న మీనాక్షి చౌదరి .. పెళ్లి రూమర్స్‌పై పూర్తి క్లారిటీ



టాలీవుడ్‌లో తనదైన గుర్తింపుతో దూసుకెళ్తున్న హీరోయిన్ మీనాక్షి చౌదరి ఈ సంక్రాంతికి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. నవీన్ పోలిశెట్టితో కలిసి నటించిన తాజా చిత్రం ‘అనగనగా ఒక రాజు’ జనవరి 14న గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే ఈ సినిమాపై మంచి అంచనాలు ఏర్పడగా, ప్రమోషన్స్‌లో భాగంగా మీనాక్షి ఇచ్చిన తాజా ఇంటర్వ్యూ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్, పాత్రల ఎంపిక, అలాగే వ్యక్తిగత జీవితం గురించి వస్తున్న రూమర్స్‌పై స్పష్టంగా స్పందించారు. ఇటీవల ‘లక్కీ భాస్కర్’ చిత్రం తర్వాత తల్లి పాత్రలు చేయనని మీనాక్షి వ్యాఖ్యానించారంటూ ప్రచారం జరిగింది. ఈ విషయంపై ప్రశ్నించగా ఆమె స్పష్టంగా ఖండించారు.“అలాంటి కామెంట్స్ నేను ఎక్కడా చేయలేదు. రూమర్స్‌ను ఎలా సృష్టిస్తారో నాకు అసలు అర్థం కావడం లేదు. నేను చెప్పని మాటలను నా పేరుతో ప్రచారం చేయడం బాధగా ఉంది” అని ఆమె అన్నారు. తన పాత్రల ఎంపికపై కూడా మీనాక్షి క్లారిటీ ఇచ్చారు. “నేను ఎప్పుడూ కథకు, పాత్రకు ప్రాధాన్యం ఇస్తాను. కథ బాగుంటే, పాత్రకు బలం ఉంటే అది ఏ క్యారెక్టర్ అయినా చేయడానికి సిద్ధమే. హీరోయిన్, సపోర్టింగ్, క్యారెక్టర్ రోల్స్ అన్న భేదం నాకు లేదు” అని తెలిపారు. ఇటీవల మీనాక్షి పెళ్లి గురించి మీడియాలో, సోషల్ మీడియాలో జోరుగా వార్తలు వినిపిస్తున్నాయి. టాలీవుడ్‌కు చెందిన ఓ యువ హీరోతో ఆమె ప్రేమలో ఉన్నారని, ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారని, త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని కథనాలు వచ్చాయి. దీనిపై మీనాక్షి కాస్త భావోద్వేగంగా స్పందించారు.నేను పెళ్లి చేసుకోబోతున్నానని ఎన్నో వార్తలు చూశాను. నిజంగా ఈ రూమర్స్ విని అలసిపోయాను. వాటిలో ఎలాంటి నిజం లేదు. నేను ఇప్పుడే పెళ్లి చేసుకునే ఆలోచనలో లేను” అని తేల్చిచెప్పారు.




## ది రాజాసాబ్’ నుంచి ఆ రెండు సీన్లు కట్.. రన్‌టైమ్ ఎంతంటే?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన తొలి హారర్ కామెడీ థ్రిల్లర్ ‘ది రాజాసాబ్’. మారుతి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. విలన్ పాత్రలో సంజయ్‌దత్ కనిపించబోతున్నాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఫ్యాన్స్ కోసం ఒకరోజు ముందే..అనగా జనవరి 8న సాయంత్రమే ప్రీమియర్స్ వేయబోతున్నారు. ఇటీవల ఈ మూవీ సెన్సార్ పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ మూవీ రన్ టైమ్ బయటకు వచ్చింది. ఈ సినిమా రన్‌టైమ్ 189 నిమిషాలు. అంటే 3 గంటల 9 నిమిషాల నిడివితో ప్రేక్షకులను అలరించబోతుంది. ఇక ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికేట్ ఇచ్చిన సెన్సార్ సభ్యులు.. సినిమా మొత్తంలో రెండు కట్స్ మాత్రమే చెప్పారట. సినిమాలో తల నరికే సీన్‌తో పాటు నేలపై ఎక్కువ రక్తం కనిపించే సన్నివేశాన్ని తొలగించాలని సూచించారు. దీంతో ఆ రెండు సీన్స్ సినిమాలో నుంచి తొలగించిన 189 నిమిషాల నిడివితో ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారట. బాహుబలి తర్వాత పాన్ ఇండియా సినిమాలన్నీ దాదాపు మూడు గంటల నిడివితోనే రిలీజ్ అవుతున్నాయి. బాహుబలి తర్వాత ప్రభాస్ నుంచి వచ్చిన చిత్రాలన్నీ దాదాపు ఎక్కువ రన్‌టైమ్‌నే కలిగి ఉన్నాయి. ఇప్పుడు ది రాజాసాబ్ కూడా అత్యధిక నిడివితో విడుదల కాబోతుంది. హారర్ కామెడీతో ప్రేక్షకులను మూడు గంటలు కూర్చోబెట్టడం కాస్త రిస్కే. ఏమాత్రం తేడా వచ్చిన ఫలితం తారుమారు అవుతుంది. ‘రాజాసాబ్’ మాత్రం రిస్క్ చేసి మరీ పెద్ద నిడివితో వస్తున్నాడు. ఫలితం ఎలా ఉంటుందో చూడాలి.



## జన నాయగన్ రిలీజ్ టైం.. మద్రాస్ హైకోర్టుకు విజయ్..!

కోలీవుడ్ స్టార్ యాక్టర్ దళపతి విజయ్ నటిస్తున్న చిత్రం జన నాయగన్ తెలుగులో ప్రజల నాయకుడు టైటిల్‌తో రాబోతున్న ఈ మూవీ జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కావాల్సి ఉంది. అయితే జననాయగన్ మూవీకి సెన్సార్ బోర్డ్ సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో విజయ్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించాడు. రాజకీయ కారణాలతో సినిమాకు ఇబ్బందులు కలిగిస్తున్నారని టీవీకే ఆరోపిస్తోంది. కాగా విజయ్ పిటిషన్‌పై మద్రాస్ హైకోర్టు మధ్యాహ్నం విచారించనుంది. కార్తీ (ఖాకీ) ఫేం హెచ్.వినోద్ దర్శకత్వం వహిస్తున్నఈ చిత్రం తెలుగులో జన నాయకుడు టైటిల్ తో వస్తోంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో సెన్సార్ సర్టిఫికెట్ ఇవ్వకపోవడం.. విజయ్ టీం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించడం అభిమానులను కలవర పెడుతోంది. ఇంతకీ జననాయగన్ అనుకున్న టైంకు థియేటర్లలోకి వస్తుందా..? అంటూ తెగ చర్చించుకుంటున్నారు అభిమానులు, సినీ జనాలు. ఇప్పటికే లాంచ్ చేసిన ఫస్ట్ లుక్, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీతం అందిస్తుండగా.. కన్నడ టాప్ బ్యానర్ కేవీఎన్ ప్రొడక్షన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. ఈ మూవీలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ కీ రోల్‌లో కనిపించనున్నారు. మమితా బైజు, గౌతమ్ వాసుదేవ్ మీనన్, ప్రకాష్ రాజ్, నరైన్, ప్రియమణి ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే విడుదలైన పాటలు సూపర్ హిట్‌గా నిలిచాయి. ఇటీవల మలేసియాలో ‘జన నాయగన్’ ఆడియో లాంచ్ కార్యక్రమం గ్రాండ్‌గా జరిగిందని తెలిసిందే. మొత్తంగా దళపతి విజయ్ కెరీర్‌కు ముగింపు పలికే ఈ సినిమా ఎలాంటి స్పందన రాబట్టుకుంటునేది ఆసక్తికరంగా మారింది.

## బాలయ్య సినిమా నుండి స్టార్ హీరోయిన్ ఔట్.. అదే కారణమా?

తెలుగు సినీ పరిశ్రమలో ఎనర్జీకి, మాస్ ఇమేజ్‌కు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన నటుడు నందమూరి బాలకృష్ణ. కెరీర్ నాలుగు దశాబ్దాలు దాటినా ఆయన జోరు మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఇటీవలి కాలంలో బాలయ్య చేస్తున్న సినిమాలు చూస్తే, ఆయన అభిమానులే కాదు సాధారణ ప్రేక్షకులు కూడా ఆశ్చర్యపోతున్నారు. ‘అఖండ’, ‘వీర సింహారెడ్డి’, ‘భగవంత్ కేసరి’, ‘డాకు మహరాజ్’ , అఖండ 2 వంటి చిత్రాలతో యాక్షన్‌తో పాటు భావోద్వేగాలను సమర్థంగా ప్రేక్షకులకు చేరువ చేశారు. అఖండ తొలి భాగం సాధించిన ఘన విజయం నేపథ్యంలో అఖండ 2 చిత్రం చేసిన బాలయ్య రీసెంట్‌గా ఈ చిత్రంతో ప్రేక్షకులని పలకరించారు. ఈ మూవీ ఓ మోస్తరు విజయాన్ని సాధించింది. ఇక ఇప్పుడు గోపీచంద్ మలినేని దర్శకత్వంలో చిత్రం చేస్తుండగా, ఈ చిత్రాన్ని చీదీఖ111గా పిలుస్తున్నారు. ఇంతకుముందు ఈ కాంబినేషన్‌లో వచ్చిన ‘వీర సింహారెడ్డి’ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసింది. బాలయ్య స్క్రీన్ ప్రెజెన్స్, పవర్‌ఫుల్ డైలాగ్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. అదే జోరును మరింత భారీ స్థాయిలో కొనసాగించాలనే ఉద్దేశంతో ఈసారి మరింత బలమైన కథతో ముందుకు వస్తున్నారని చిత్ర బృందం చెబుతోంది. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సతీష్ కిలారు ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇది చారిత్రక నేపథ్యంతో కూడిన యాక్షన్ డ్రామాగా రూపుదిద్దుకుంటుందని సమాచారం. బాలకృష్ణ ఇందులో రెండు విభిన్న కాలాల్లో కనిపించే పాత్రలు చేయనున్నారని, అందులో ఒకటి రాజుగా ఉండే పవర్‌ఫుల్ క్యారెక్టర్ అని టాక్ వినిపిస్తోంది. ఈ అంశమే అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. హీరోయిన్ ఎంపిక కూడా ఈ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. బాలయ్య సరసన లేడీ సూపర్ స్టార్ నయనతారను ఎంపిక చేయడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు రెట్టింపు అయ్యాయి. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన సినిమాలు మంచి విజయాలు సాధించడంతో, ఈ జోడీ మళ్లీ తెరపై కనిపించబోతుండడం వార్త అభిమానుల్లో ఆనందాన్ని నింపింది. గత ఏడాది నవంబర్ 26న నయనతారను హీరోయిన్‌గా అధికారికంగా పరిచయం చేస్తూ మేకర్స్ ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. అయితే ఇప్పుడు ఈ భామ తప్పుకున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. స్క్రిప్ట్ దశలో భారీ బడ్జెట్ అవుతుండడం, నయన్‌కి దాదాపు 8 కోట్ల రెమ్యునరేషన్ ఇవ్వాల్సి ఉండడం, మేకర్స్‌ని ఆలోచనలో పడేసిందట. వేరే హీరోయిన్ అయితే రెండు కోట్లతో అయిపోతుందని అనుకుంటున్నారట.




Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

ధర్మఘంట

# వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం చట్టబద్ధమైన సబ్ ప్లాన్ అమలు చేయాలి

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్





ధర్మఘంట, జనవరి 06, సూర్యాపేట

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే వెనుకబడిన తరగతుల (బీసీ) సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇంచార్జ్ వట్టె జానయ్య యాదవ్ తెలిపారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కు కలెక్టర్ కార్యాలయంలో కలిసి మెమోరాండం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా వట్టె జానయ్య యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగం పైగా ఉన్న వెనుకబడిన తరగతుల సామాజిక, ఆర్థిక స్థితిగతులు మెరుగుపడాలంటే వారికి ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చేయడంతో పాటు చట్టపరమైన రక్షణ కల్పించాల్సిన అవసరం అత్యంత కీలకమని తెలిపారు. బీసీ వర్గాలకు న్యాయం జరగాలంటే, ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలవ్వాలంటే బీసీ సబ్ ప్లాన్‌ను చట్టబద్ధంగా అమలు చేయడమే ఏకైక మార్గమని, ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ బీసీ వర్గాల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం చేస్తుందని, బీసీ సబ్ ప్లాన్ అమలు అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి మీర్ అక్బర్, పట్టణ అధ్యక్షులు కుంభం నాగరాజు, సూర్యాపేట జిల్లా మహిళా అధ్యక్షురాలు కొన్నె మంజుల గౌడ్, ప్రధాన కార్యదర్శి నారాయణదాసు కవిత, ఉపాధ్యక్షురాలు కవిత, పెన్ పహాడ్ మండల అధ్యక్షులు ఆవుల అంజయ్య, ఆత్మకూరు మండల అధ్యక్షులు బొల్లె సైదులు, కరుణాకర్, మహేష్, శివ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి చాణక్యం

హైదరాబాద్

రాజకీయాలలో ఉన్న వారంతా వ్యూహాలు రచిస్తుంటారు. అందులో కొంతమంది వ్యూహాలు మాత్రమే సఫలీకృతం అవుతుంటాయి. తెలంగాణ రాజకీయాలలో వ్యూహాలు రచించి.. పరిణామాలను తనకు అనుకూలంగా మార్చుకోవడంలో మొదటి నుంచి కూడా కేసీఆర్ అగ్రస్థానంలో ఉండేవారు. 2014 నుంచి 2018 వరకు ఆయన వ్యూహాలు తెలంగాణలో విజయవంతం అయ్యాయి. ఎప్పుడైతే రెండు ఉప ఎన్నికలలో ఓటమి.. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు రావడంతో.. కెసిఆర్ కు బ్యాడ్ టైం మొదలైంది. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు మీడియాను తన అదుపులో ఉంచుకునేవారని.. భయభ్రాంతులకు గురి చేసేవారని ఆరోపణలు వినిపించేది. ఇప్పుడు కెసిఆర్ అధికారానికి దూరం కావడంతో.. కేవలం గులాబీ మీడియా మాత్రమే ఆయన దండకం చదువుతోంది. ఇక మిగతా మీడియా పెద్దగా పట్టించుకోవడం లేదు.ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆర్థికంగా బలమైన, రాజకీయంగా శక్తివంతుడైన కేసీఆర్ ను ఎదిరించి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అంతేకాదు, కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడంలో విజయవంతం అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మూడోవంతు స్థానాలను గెలుచుకోవడంలో రేవంత్ రెడ్డి సఫలీకృతులయ్యారు. ఇదే ఊపులో పురపాలకం, నగర పాలక ఎన్నికలు నిర్వహించబోతున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు.. గులాబీ మీడియా, గులాబీ పార్టీ




అనుకూల సోషల్ మీడియా ప్రతిరోజు బురద చిమ్ముతున్నప్పటికీ.. ఇష్టానుసారంగా విష ప్రచారం చేస్తున్నప్పటికీ రేవంత్ రెడ్డి ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదు. పైగా తనకు ఎదురవుతున్న ప్రతిబంధకాల నుంచి విజయ పాఠాలు నేర్చుకుంటున్నారు.ఇటీవల నూతన సంవత్సరం సందర్భంగా రేవంత్ రెడ్డి ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ స్వగృహానికి వెళ్లారు. ఆయనతో చాలాసేపు మాట్లాడారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వాస్తవానికి ఒక ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లడం చాలామందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే రాజకీయంగా వ్యూహాలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి కాస్త విభిన్నమైన శైలి. ముఖ్యంగా మీడియాతో అనుకూలంగా ఉండడం.. మీడియా పెద్దల సలహాలు తీసుకోవడంలో రేవంత్ రెడ్డి ఎప్పటికీ ముందు వరుసలో ఉంటారు. పిసిసి అధ్యక్షుడు అయిన తర్వాత ఆయన ఎన్టీవీ, టీవీ5, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయాలకు వెళ్లారు. తనకు సపోర్ట్ ఇవ్వాలని కోరారు. ఆ చానల్స్ యాజమాన్యాలతో నేరుగా భేటీ అయ్యారు.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావలసిన ఆవశ్యకతను వారికి చెప్పారు. వారి దగ్గర నుంచి సలహాలు కూడా స్వీకరించారు. వాటిని రేవంత్ రెడ్డి అమల్లోపెట్టి అధికారంలోకి వచ్చారు.అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ఆ మీడియా సంస్థలను దూరం పెట్టలేదు. అలాగని తనకు భజన చేసుకునే మాధ్యమాలుగా మార్చుకోలేదు. ప్రభుత్వపరంగా తాను వేగంగా పరిపాలన సాగిస్తూనే.. మీడియా పరంగా ఆ చానల్స్ యాజమాన్యాల సపోర్ట్ కోరారు. తద్వారా యాజమాన్యాలు కూడా రేవంత్ కు సుముఖంగా మారిపోయాయి. ఫలితంగా రేవంత్ చాణక్యం ఫలవంతమై.. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో సరికొత్త శకాన్ని ఆవిష్కరిస్తుంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీపై ఏమాత్రం ప్రజలకు నమ్మకం లేని స్థితిలో.. రేవంత్ రెడ్డి పార్టీ పగ్గాలు అందుకున్నారు. సీనియర్ విమర్శలు చేస్తున్నప్పటికీ.. కుర వృద్ధులు అడ్డగోలుగా మాట్లాడుతున్నప్పటికీ.. కెసిఆర్ అడ్డు పుల్లలు వేస్తున్నప్పటికీ.. వాటన్నింటిని తట్టుకొని రేవంత్ రెడ్డి ఇక్కడ దాకా వచ్చారు. రాజకీయాలలో చాణక్యాన్ని ఎలా ప్రదర్శించాలో నిరూపించి చూపిస్తున్నారు. ఇదే సమయంలో తాను వేస్తున్న ఉచ్చుల్లో గులాబీ పార్టీ నాయకులు పడి గిలగిల కొట్టుకుంటున్నారు. ఒకప్పుడు ఈ పరిస్థితి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఉండేది. ఇప్పుడు రేవంత్ రెడ్డి వల్ల కాంగ్రెస్ పార్టీ అప్పర్ హ్యాండ్ ప్రదర్శిస్తోంది.. కాకపోతే అధికారంలోకి ఉన్నామని రేవంత్ రెడ్డి తల బిరుసుతనాన్ని ప్రదర్శించడం లేదు. కేవలం ప్రజలు ఇచ్చిన అవకాశం లాగానే దీన్ని చూస్తున్నారు. అందువల్లే గులాబీ పార్టీ నేతలు ఏ స్థాయిలో ఆరోపణలు చేసినప్పటికీ.. రేవంత్ రెడ్డికి వ్యతిరేక ఫలితం రావడం లేదు. వ్యతిరేక స్వరం వినిపించడం లేదు.

# కవిత శపథం



హైదరాబాద్

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. గులాబీ కోటలో ముసలం పుట్టిందన్న వార్తలకు బలం చేకూర్చుతూ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన నిర్ణయం తీసుకున్నారు. శాసన మండలి వేదికగా ఆమె చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఉద్యమ పార్టీగా ఎదిగిన బీఆర్ఎస్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ, తన తండ్రి స్థాపించిన పార్టీతో పూర్తిగా తెగదెంపులు చేసుకుంటున్నట్టు ప్రకటించారు. ఇన్నాళ్లు సాంస్కృతిక వేదికగా ఉన్న తెలంగాణ జాగృతిని ఇకపై పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారుస్తున్నట్లు ప్రకటించారు.శాసన మండలిలో కవిత భావోద్వేగానికి గురై కంటతడి పెట్టడం చర్చనీయాంశమైంది. ఆమె మాటల్లో తీవ్రమైన ఆవేదన, ఆగ్రహం స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా “ఇది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ” అని ఆమె చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ అంతర్గత విభేదాల తీవ్రతను బయటపెట్టాయి. పుట్టింటి బంధాలను తెంచుకుని బయటకు వస్తున్నానని చెప్పడం ద్వారా, కేసీఆర్ కుటుంబంలోనూ, పార్టీలోనూ ఆమెకు దక్కిన ప్రాధాన్యతపై, లేదా ఆమె ఎదుర్కొన్న అవమానాలపై అనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్ ఇప్పుడు ఉద్యమ ద్రోహులకు పునరావాస కేంద్రంగా మారిందని ఆమె విమర్శించడం గమనార్హం.తెలంగాణ ఉద్యమ సమయంలో బతుకమ్మ పండుగ ద్వారా సాంస్కృతిక పునరుజ్జీవనానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ జాగృతి సంస్థ ఇప్పుడు రాజకీయ అవతారం ఎత్తనుంది. ఈ మేరకు కవిత కీలక ప్రకటన చేశారు. దీంతో జాగృతి ఇకపై కేవలం ఎన్జీవోగా కాకుండా, ఎన్నికల కమిషన్ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా ఈ కొత్త పార్టీ బరిలోకి దిగనుంది. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలే అజెండాగా ఈ పార్టీ పనిచేస్తుందని కవిత స్పష్టం చేశారు. దీనిని బట్టి చూస్తే, కవిత కేవలం ఉద్వేగంతో ఈ నిర్ణయం తీసుకోలేదని, దీని వెనుక ఒక పక్కా రాజకీయ వ్యూహం ఉన్నట్లు అర్థమవుతోంది. యువతను, అసంతృప్త వర్గాలను తన వైపు తిప్పుకునేందుకు ఆమె ప్రయత్నిస్తున్నారు.కవిత నిర్ణయం బీఆర్ఎస్‌కు రాజకీయంగా దెబ్బేనని విశ్లేషకులు భావిస్తున్నారు. కవితకు మహిళల్లో, ముఖ్యంగా బతుకమ్మ ఆడే తెలంగాణ ఆడబిడ్డల్లో ఒక ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. ఆమె వేరు కుంపటి పెట్టడం వల్ల బీఆర్ఎస్‌కు పడాల్సిన సంప్రదాయ ఓట్లు, మహిళా ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉంది. ఉద్యమ కాలం నుంచి పనిచేస్తున్న అనేక మంది కవిత వర్గీయులు బీఆర్ఎస్‌లో ఉన్నారు. ఇప్పుడు వారు కవిత వెంటే నడుస్తారా లేక కేసీఆర్ నాయకత్వంలోనే ఉంటారా అన్నది పార్టీలో గందరగోళం సృష్టిస్తుంది. సొంత కూతురే పార్టీ విధానాలను తప్పుబడుతూ, బయటకు రావడం ప్రత్యర్థి పార్టీలకు బలమైన ఆయుధంగా మారుతుంది.కవిత కొత్త పార్టీ ఏర్పాటు కాంగ్రెస్, బీజేపీలకు పరోక్షంగా లాభం చేకూర్చే అవకాశం ఉంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదా బీఆర్ఎస్ అనుకూల ఓటు చీలిపోవడం వల్ల ముక్కోణపు పోటీ ఏర్పడి, అది ప్రధాన పార్టీల సమీకరణాలను మారుస్తుంది. అయితే, కవిత జాగృతి ద్వారా సెంటిమెంట్‌ను ఎంత బలంగా రగిలిస్తారు, యువతను ఎంతగా ఆకర్షిస్తారు అనే అంశంపైనే ఆమె పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.“వ్యక్తిగా వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగి వస్తా” అని కవిత చేసిన శపథం ఆమెలోని పట్టుదలను చూపిస్తోంది. అయితే, కుటుంబ పార్టీని, బలమైన నాయకత్వాన్ని ఎదిరించి, కొత్త పార్టీతో నెట్టుకురావడం అంత సులభం కాదు. కానీ, తెలంగాణ రాజకీయ యవనికపై జాగృతి రూపంలో కొత్త పోరాటం మొదలైందని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు.

## మహిళా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా ... జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కన్వీనర్ గోలి శ్రావణి రెడ్డి

### జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ ట్రేడ్ యూనియన్ - ఐ.ఎన్. టి.యు.సి మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా గోలి శ్రావణి రెడ్డికి అధనపు బాధ్యతలు



ధర్మఘంట, జనవరి 06, నల్లగొండ:

జిల్లా కాంగ్రెస్ పార్టీ అనుబంధ ట్రేడ్ యూనియన్ – ఐ.ఎన్. టి.యు.సి మహిళా విభాగం ఉపాధ్యక్షురాలుగా నకిరేకల్ నియోజకవర్గ పరిధిలోని నార్కెట్ పల్లి మండలం షాపల్లి గ్రామానికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కన్వీనర్ గోలి శ్రావణి రెడ్డికి అధనపు బాధ్యతలు అప్పగించారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని నేడు కాంగ్రెస్ పార్టీ అనుబంధ ట్రేడ్ యూనియన్ – ఐ.ఎన్. టి.యు.సి జిల్లా అధ్యక్షులు అంబటి సోమయ్య నియమకపత్రాన్ని అందించారు. ఐ.ఎన్. టి.యు.సి జాతీయ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎర్రగాని నాగన్న గౌడ్ సహాయ – సహకారాలతో అధనపు పదవిని పొందిన శ్రావణి రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తన నియామకానికి సహకరించి, ఆశీర్వదించిన కోమటిరెడ్డి బ్రదర్స్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, వేముల వీరేశం, శంకర్ నాయక్ తదితర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రేస్ పార్టీకి, దాని అనుబంధ ట్రేడ్ యూనియన్ – ఐ.ఎన్. టి.యు.సి కార్యక్రమాల ద్వారా కార్మిక, కర్షక, కూలీలకు మరియు మహిళలకు నిరంతరం అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ప్రజలకు అత్యంత చేరువలో కంటి వైద్య సేవలు

### టీపీసీసీ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు చింతల నిర్మల రెడ్డి







ధర్మఘంట, జనవరి 06, హైదరాబాద్

రాష్ట్ర ప్రజలకు అత్యంత చేరువలో కంటి వైద్య సేవలు అందనున్నట్లు టీపీసీసీ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు చింతల నిర్మల రెడ్డి తెలిపారు. నేడు తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సెల్ చైర్మన్ గా నియామితులైన మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపెల్లి సత్యనారాయణ ను మహిళా కాంగ్రెస్ తరపున శాలువా సత్కరించి, స్వీట్లు తినిపించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చింతల నిర్మల రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజలకు అత్యంత చేరువలో కంటి వైద్య సేవలను ప్రజా ప్రభుత్వం అందించనున్నట్లు తెలిపారు. కంటి వైద్యం కోసం ప్రభుత్వం కొత్త విధానం తీసుకురానున్నట్లు, రాష్ట్ర వ్యాప్తంగా ఐ కేర్ క్లినిక్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు, కంటి వైద్యానికి హబ్ ఎగా సరోజినీదేవి ఐ హాస్పిటల్‌ను మారుస్తున్నట్లు పేర్కొన్నారు.

## లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

### తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



ధర్మఘంట, జనవరి 06, సూర్యాపేట

సోమవారం నాడు వారి నివాసంలో తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ ఎఫ్) ద్వారా సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన వివిధ గ్రామాల 29 మంది లబ్దిదారులకు మొత్తం రూ. 11,88,500/- విలువైన చెక్కులను అందజేశారు. ప్రతి ఒక్కరికి అవసరమైన వైద్య చికిత్స కోసం ఈ సాయాన్ని మంజూరు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో లబ్దిదారుల కుటుంబ సభ్యులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యత. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడం మా బాధ్యత. ప్రతి అవసరమైన కుటుంబానికి సకాలంలో సాయం అందేలా నిరంతరం కృషి చేస్తాను” అని తెలిపారు. అలాగే గత 18 నెలల కాలంలో ఇప్పటివరకు సూర్యాపేట నియోజకవర్గంలోని 73 మంది లబ్దిదారులకు రూ. 30,98,500/- విలువైన ఆర్థిక సహాయం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైందని పేర్కొన్నారు. ఇది ప్రజల సంక్షేమానికి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు డా: వూర రామ్మూర్తి యాదవ్, గట్టు శ్రీనివాస్, వెలుగు వెంకన్న, సైదిరెడ్డి, ఫారుక్, యాట ఉపేందర్, యాట వెంకన్న, అరవింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మారిషస్ దేశాధ్యక్షుడికి ఘనంగా వీడ్కోలు

గన్నవరం

లమారిషస్ రిపబ్లిక్ దేశ అధ్యక్షులు ధరంబీర్ గోకుల్ జిసిఎస్కేకి మంగళవారం ఉదయం గన్నవరం విమానాశ్రయంలో రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ నెల 3వ తేదీన రాష్ట్రానికి అతిథిగా వచ్చిన మారిషస్ దేశాధ్యక్షులు, వారి కుటుంబ సభ్యులతో కలిసి కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో మూడు రోజుల పర్యటనను విజయవంతంగా ముగించుకున్నారు. గుంటూరు నుండి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాన్వాయ్‌లో బయలు దేరి గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న వారికి కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఘన స్వాగతం పలికారు. అనంతరం వారు విమానాశ్రయంలోని రిజర్వ్ లాంజ్‌లో కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. ఈ సందర్భంగా గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు గన్నవరం విమానాశ్రయానికి చేరుకోగా, రిజర్వ్ లాంజ్‌లో మారిషస్ దేశాధ్యక్షులతో స్నేహపూర్వకంగా ముచ్చటించారు. తదుపరి రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కూడా మారిషస్ దేశాధ్యక్షులతో కాసేపు భేటీ అయ్యారు. తిరుపతికి బయలుదేరుతున్న మారిషస్ దేశాధ్యక్షులు, వారి కుటుంబ సభ్యులకు మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యటనకు గుర్తుగా రాష్ట్ర మంత్రి మారిషస్ దేశాధ్యక్షులకు జ్ఞాపికను అందజేశారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు నేతృత్వంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా, విజయవాడ ట్రాఫిక్ డీసీపీ షరీనా బేగం



ప్రముఖుల కాన్వాయ్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. గుంటూరు నుండి కాన్వాయ్ ఇన్‌చార్జిగా ఏఆర్ డీఎస్పీ గాంధీ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మారిషస్ దేశ హైకమిషన్ కార్యదర్శి గీతాంజలి, ప్రోటోకాల్ డైరెక్టర్ మోహన్ రావు, విమానాశ్రయం డైరెక్టర్ ఎం.ఎల్.కే. రెడ్డి, టెర్మినల్ ఇన్‌చార్జ్ అంకిత్ జైస్వాల్, సిఎస్ఓ ధర్మేంద్ర, సాంస్కృతిక శాఖ సంచాలకులు ఆర్. మల్లికార్జునరావు, గుడివాడ ఆర్డీఓ జి. బాల సుబ్రమణ్యం, గన్నవరం డీఎస్పీ శ్రీనివాసరావు, మచిలీపట్నం పీటీసీ ఇన్‌చార్జ్ డీఎస్పీ శ్రీనివాసరావు, జిల్లా ఆహార భద్రత తనిఖీ అధికారి గోపాలకృష్ణ, గన్నవరం తహసిల్దారు శివయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల భద్రతకు పూర్తి హామీ ఇచ్చేలా కట్టుదిట్టమైన చర్యలు

**ఆడబిడ్డలు మానవ అక్రమ రవాణా బారిన పడకూడదన్నదే లక్ష్యం**

**మానవ అక్రమ రవాణాపై సమస్యలు రాకముందే నివారణే ప్రభుత్వ ధ్యేయం**

**మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ. సూర్యకుమారి**

విజయవాడ

సమస్యలు ఉద్భవించిన తరువాత వాటికి పరిష్కారాలు వెతకడం కంటే, అవి తలెత్తకముందే కట్టుదిట్టమైన నివారణ చర్యలను అధికారులు సమర్థవంతంగా అమలు చేస్తే అనుకూల ఫలితాలు ఉంటాయని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఏ. సూర్యకుమారి తెలిపారు. స్థానిక బందరు రోడ్డు బెంజ్ సర్కిల్ సమీపంలోని జేడ్ సూట్స్ హోటల్లో మంగళవారం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయిలో బాలికల సంరక్షణ మరియు మానవ అక్రమ రవాణా నిరోధంపై శిక్షకులకు శిక్షణ అనే అంశం మీద శిక్షణా కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఏ. సూర్య కుమారి హాజరై మాట్లాడుతూ.. బాలల రక్షణ, మహిళా సాధికారత కోసం మహిళలు, గర్ల్ చైల్డ్స్ కోసం ప్రభుత్వం అనేక పథకాలు ప్రవేశపెట్టడంతోపాటు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ పథకాల సమన్వయానికి ప్రతి జిల్లాలో డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ (ఐవీజ) ను నోడల్ అధికారిగా నియమించినట్లు వెల్లడించారు. యువకుల కోసం 'యువ', బాలికల కోసం 'సఖి' గ్రూపులను ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 23 లక్షల మంది పిల్లలను గ్రూపులుగా చేశామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, రెసిడెన్షియల్ సంస్థలు, బడి బయట పిల్లలతో సహా 100 శాతం కవరేజ్ సాధించడమే లక్ష్యమని చేస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజల జీవితాలను ప్రభావితం చేస్తూ, వారి గౌరవాన్ని మానవ అక్రమ రవాణా దోచుకుంటుందన్నారు. కుటుంబ వ్యవస్థలో వస్తున్న మార్పులు, సోషల్ మీడియా ప్రభావం వల్ల




యువత తప్పుదారిలోకి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, పిల్లల భద్రతకు టోల్ ఫ్రీ నంబర్ 112, వన్-స్టాప్ సెంటర్స్ ద్వారా అత్యవసర సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. సమస్యలు వచ్చిన తర్వాత కాకుండా, ముందస్తు నివారణే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, బాలల భద్రత, మహిళా సాధికారతలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అధికారులకు కార్యదర్శి ఏ. సూర్యకుమారి తెలియజేశారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు పద్మశ్రీ సునీతా కృష్ణన్ మాట్లాడుతూ... ట్రాఫికింగ్ విముక్తి, నివారణా కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ సామాజిక కార్యకర్త సునీతా కృష్ణన్ మానవ అక్రమ రవాణా బాధితుల దయనీయ పరిస్థితిని వివరించారు. సాంకేతికతకు ప్రతి ఒక్కరూ బాధితులుగానే ఉంటున్నారని, అక్రమ రవాణాలో చిక్కుకున్న అమ్మాయిలలో 2530 శాతం మంది హెచ్ఐవి బారిన పడుతున్నారని, వారు తీవ్ర శారీరక, మానసిక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం ఎంతో క్లిష్టమని, షెల్టర్ హోమ్స్ అనుభవాలే ఇందుకు నిదర్శనమని తెలిపారు. మానవ అక్రమ రవాణాను అరికట్టడమే కాకుండా, అసలు జరగకుండా ముందస్తు నివారణ అత్యంత అవసరమని పేర్కొన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఏటా సుమారు 30 లక్షల మంది అక్రమ రవాణాకు గురవుతుండగా, అందులో 45 శాతం మంది పిల్లలేనని తెలిపారు. వేశ్యావృత్తి మాత్రమే కాకుండా బాల కార్మికులు, అక్రమ దత్తతలు, అవయవ వ్యాపారం కోసం కూడా మహిళలు, పిల్లలు అక్రమ రవాణాకు గురవుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2003లోనే దేశంలో తొలిసారిగా అక్రమ రవాణా నిరోధక పాలసీని అమలు చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో అందుతున్న సహకారాన్ని అభినందించారు. కార్యక్రమంలో మిషన్ వాత్సల్య జాయింట్ డైరెక్టర్ ఎం. శిరీషా, మిషన్ శక్తి జాయింట్ డైరెక్టర్ (ఇన్ చార్జ్) ఎస్. నాగ శైలజ, జాయింట్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎస్. సునంద, అసిస్టెంట్ డైరెక్టర్ పి. లావణ్య, ఎన్టీఆర్ జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పీడీ షేక్ రుక్సానా సుల్తానా బేగం, నోడల్ ఆఫీసర్ సాయి శైలజ, ప్రజ్వల జూనియర్ డైరెక్టర్ మహ్మద్ అలీ, తదితరలు పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగుల సంక్షేమమే ఏపీ ఎన్జీజీవో ధ్యేయం






విజయవాడ

రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఏపీ ఎన్జీజీవో సంఘం అడుగులు వేస్తోందని, మహిళలకు సంబంధించిన ప్రత్యేక డిమాండ్ల సాధనకు కృషిచేస్తామని ఏపీ ఎన్జీజీవో రాష్ట్ర సంఘ అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ తెలిపారు. ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర మహిళా విభాగం రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం మంగళవారం ఛైర్‌పర్సన్ నిర్మల కుమారి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ ఎన్జీజీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో మహిళా ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని.. ప్రభుత్వ కార్యాలయాల్లో లక్ష్యాల సాధనకు అంకితభావంతో పనిచేస్తూ శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేయడంలో అధికారులకు మహిళా ఉద్యోగులు అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఒకవైపు గృహిణిగా మరోవైపు ఉద్యోగినిగా ద్విపాత్రాభినయాన్ని సమన్వయం చేసుకుంటూ అలుపెరగని సేవలందిస్తున్న మహిళా ఉద్యోగుల సంక్షేమం సంఘ ప్రధాన ధ్యేయమన్నారు. ప్రభుత్వం మహిళా ఉద్యోగుల హక్కుల పట్ల ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరముందన్నారు. మహిళా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని ఇందుకు ఇటీవల మహిళా ఉద్యోగులకు సంబంధించి చైల్డ్ కేర్ లీవ్ వినియోగంలో పరిమితుల ఎత్తివేయడం వల్ల సుమారు రెండు లక్షల మందికి పైగా మహిళా ఉద్యోగులు ప్రయోజనం పొందగలిగారని.. దీనికి ఏపీ ఎన్జీజీవో కృషి ఫలితమేన్నారు. కార్యాలయాల్లో ప్రత్యేక వసతులు, ఆరోగ్య సేవలు, మహిళా ఉద్యోగుల క్షేమం, సంక్షేమంపట్ల సంఘం ప్రత్యేకంగా దృష్టిసారిస్తుందని పేర్కొన్నారు. ప్రతి శాఖలో మహిళా రక్షణ సెల్స్ ఏర్పాటుకు కృషిచేయనున్నట్లు తెలిపారు. ఉద్యోగినుల భద్రతపైనా దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కన్వీనర్ మాధవి, కోకన్వీనర్ లలితాంబ, కోశాధికారి శివలీల, రాష్ట్ర ప్రచార కార్యదర్శి బి.జానకి, ఏఐఎస్‌జీఈఎఫ్ ఉమెన్ సబ్ కమిటీ కన్వీనర్ యం.రాజ్యలక్ష్మి, ఎన్ఈసీ మెంబర్ శాంతిశ్రీ, రాష్ట్ర మహిళా విభాగ కోశాధికారి శివలీల, కో-కన్వీనర్ వి.వి.లలితాంబ, కో-చైర్ పర్సన్ కె.గౌరి, వైస్ చైర్ పర్సన్లు కె.నాగలలిత, పి.స్వర్ణలత, వై.పద్మజ, వి.జయలక్ష్మి, జి.హైమావతి పాల్గొన్నారు. అలాగే జాయింట్ కన్వీనర్లు పి.సురేఖ, టి.కుసుమకుమారి, సి.హెచ్. నాగమల్లేశ్వరి, జి.సుబ్బలక్ష్మి, ఎస్.దివ్య, ఎల్.అర్చన పాల్గొన్నారు.

## సూర్యాపేట లో త్యాగరాజ ఆరాధనోత్సవాలు




ధర్మఘంట, జనవరి 06, సూర్యాపేట:

ఈ నెల 07-01-2026 న బుధవారం, సాయంత్రం సుధా బ్యాంక్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధన ఉత్సవాలు జరగనున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి సన్మాన గ్రహీతగా ప్రముఖ సినీ సంగీత దర్శకులు మాధవపెద్ది సురేష్ విచ్చేయుచున్నారు. ప్రముఖ పాత్రికేయులు రచయిత పులగం చిన్నారాయణ విశిష్ట అతిథిగా పాల్గొంటారు. సుధా బ్యాంక్ చైర్మన్ మీలా మహదేవ్ అధ్యక్షతన జరిగే ఈ ఆరాధన ఉత్సవాలు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్ నిర్వహిస్తారు. ఈరోజు సుధా బ్యాంకులో జరిగిన సన్నాహక సమావేశంలో పుర ప్రముఖులు పెద్దిరెడ్డి రాజా, బ్యాంక్ వైస్ చైర్మన్ కక్కిరేణి చంద్రశేఖర్, డాక్టర్ మిన్నా రామకృష్ణ, అప్పం శ్రీనివాస్ , పటేల్ నరసింహారెడ్డి, ఏపూరి శ్రవణ్ కుమార్, బోనగిరి భాస్కర్, బొలిశెట్టి మధు, తోట శ్యాం ప్రసాద్ ఇరిగి కోటేశ్వరి తదితర ప్రముఖులు పాల్గొని ఆహ్వాన పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ త్యాగరాజ ఆరాధన ఉత్సవాలలో ప్రముఖ కళాకారులచే నృత్య కార్యక్రమాలు శాస్త్రీయ సంగీతక చర్యలు నిర్వహించబడతాయి.

## రాచకొండ జ్యోతి పుట్టిన రోజు సందర్భంగా పలు సేవలు

**ఏరియా ఆస్పత్రి, లయన్స్ కంటి ఆసుపత్రిలో అల్పాహారం పంపిణీ**



ధర్మఘంట/జనవరి సూర్యాపేట:

జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు, పబ్లిక్ క్లబ్ ఈసీ మెంబర్ రాచకొండ శ్రీనివాస్ సతీమణి జ్యోతి పుట్టినరోజు సందర్భంగా మంగళ వారం స్థానిక ఏరియా హాస్పిటల్ లో పేషంట్ల సహాయకుల కి 200 మందికి అల్పాహారం పంపిణీ చేశారు. వీరు స్థానిక ఏరియా హాస్పిటల్ లో గత మూడు సంవత్సరాల నుంచి ప్రతి రోజు ఉచిత అల్పాహారాన్ని దాతల సహకారంతో భానుపురి సేవ బృందం శ్రీరంగం, రాము రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరగడం విశేషం. తదనంతరం లయన్స్ కంటి ఆసుపత్రిలో భానుపురి సేవా బృందం శ్రీరంగ రామ ఆధ్వర్యంలో 100 పేషెంట్లకు చపాతీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాను సేవా బృందం శ్రీరంగం రాము, కలకోట్ల లక్ష్మయ్య, గుండా శ్రీధర్, వెంపటి శబరినాథ్, జూలకంటి నాగరాజు, మిట్టపల్లి రమేష్, శ్రీదేవి, యమా సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల్లో మిగిలింది వారే

హైదరాబాద్ : తెలంగాణను మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చే దిశగా ప్రభుత్వం వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో ఉన్న 17 మంది తెలంగాణ వాదులు జనజీవన స్రవంతిలో కలిస్తే.. రాష్ట్రం నుంచి ఆ సిద్ధాంతం పూర్తిగా కనుమరుగవుతుందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీతో పాటు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.తెలంగాణ రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చే దిశగా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వ్యూహాత్మక అడుగులు వేస్తోందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్న తెలంగాణ వాళ్లంతా జన జీవన స్రవంతిలో కలిస్తే.. రాష్ట్రం నుంచి ఆ సిద్ధాంతం పూర్తిగా కనుమరుగవుతుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అడవుల్లో ఉన్నవారు లొంగిపోయి శాంతియుత జీవనం గడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డీజీపీ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో తెలంగాణకు చెందిన 17 మంది ఉన్నారు వీరిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్‌గ్రౌండ్‌లో ఒకరితో పాటు మరొకరు ఉద్యమంలో కొనసాగుతున్నారు.ఈ 17 మంది మావోయిస్టులపై ప్రభుత్వం మొత్తం రూ. 2.25 కోట్ల భారీ రివార్డును ప్రకటించింది. వీరు గనుక ఆయుధాలు వీడి లొంగిపోతే.. పునరావాస ప్యాకేజీ కింద ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని డీజీపీ హామీ ఇచ్చారు. ప్రస్తుతం అడవుల్లో ఉన్న ఆ 17 మందిలో ఐదుగురు మహిళలు ఉన్నట్లు డీజీపీ అధికారికంగా ప్రకటించారు. వీరంతా కీలక బాధ్యతల్లో ఉన్నట్లు సమాచారం. మహిళా మావోయిస్టులు లొంగిపోతే వారి కుటుంబాలకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.కాగా, గత కొన్నేళ్లుగా తెలంగాణలో మావోయిస్టుల ప్రాబల్యం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. కీలక నేతలు చనిపోవడం, లొంగిపోవడం పార్టీని ఆత్మరక్షణలో పడేసింది. ఇటీవల మావోయిస్టు పార్టీలో కీలక నేతగా ఉన్న పాక హనుమంతు ఎన్‌కౌంటర్‌లో మరణించడం పార్టీకి పెద్ద ఎదురుదెబ్బగా మారింది. సుదీర్ఘ కాలం పాటు అండర్‌గ్రౌండ్‌లో ఉన్న అగ్రనేత రాజిరెడ్డి ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు టాప్ మావోయిస్టు బర్సే దేవా మరికొందరు కీలక నాయకులు కూడా హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. ఈ పరిణామాలు మిగిలి ఉన్న 17 మందిపై కూడా ఒత్తిడి పెంచుతున్నాయి. 'ఆపరేషన్ కగార్' గడువు ముగిసేలోపే తెలంగాణ పూర్తిస్థాయిలో మావోయిస్టు రహిత రాష్ట్రంగా అవతరిస్తుందని డీజీపీ ధీమా వ్యక్తం చేశారు.మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సాయుధ పోరాటం ద్వారా సాధించేది ఏమీ లేదని, ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను పరిష్కరించుకోవాలని పోలీసులు కోరుతున్నారు. లొంగిపోయిన వారికి ఇంటి స్థలాలు, పిల్లల చదువు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని

# కమాలాపూర్ సమ్మక్క సారలమ్మ జాతర కమిటీ చైర్మన్‌గా చేరాల రోహిత్





**కమలాపూర్**

కమలాపూర్ మండలంలోని సమ్మక్క సారలమ్మ జాతర కమిటీలకు నూతన అధ్యక్షులు హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ప్రణవ్ బాబును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేసినారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ ప్రణవ్ బాబు కమలాపూర్ , కన్నూరు గ్రామాల జాతర కమిటీ అధ్యక్షులకు జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నీటి వసతి, పారిశుధ్య నిర్వహణ, కరెంటు సమస్యలు ,ఆరోగ్య సమస్యలు వంటివి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అందుకు కావలసిన అవసరాలు ఏమైనా ఉంటే నన్ను సంప్రదించి ఆ సమస్యలను పరిష్కారం చేసి ప్రజలకు సౌకర్యం కల్పించాలని కన్నూరు, కమలాపూర్ సమ్మక్క సారక్క జాతర చైర్మన్లు పల్లె సంతోష్ గౌడ్ , చేరాల రోహిత్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల జాతర కమిటీ చైర్మన్ లను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎంపీపీ మాట్ల రమేష్, కమలాపూర్ ఉప సర్పంచ్ పుల్ల శ్రీనివాస్, పెరుమండ్ల పరుశరాములు, ఇంద్రసేనారెడ్డి ,కన్నూరు మాజీ ఉపసర్పంచ్ నల్లని సురేష్, కమలాపూర్ వార్డు మెంబర్లు గంధసిరి అనిల్ , జన్ను బిక్షపతి, మౌటం కుమారస్వామి, ఆదేపు శ్రీకాంత్, పుల్ల శోభన్, రామస్వామి, వెంగళ విజయ్, శనిగర పవన్ ,గుంపుల అశోక్, బత్తుల చంద్రశేఖర్, పుల్ల రాజు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన పిల్లలకు ఆర్థిక సహాయం సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు

**హైదరాబాద్**

తల్లిదండ్రుతిద్దరినీ కోల్పోయిన పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలకు స్పాన్సర్షిప్ దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీ: 24.01.26 హైదరాబాద్ జిల్లాలోని 18 సంవత్సరాల లోపు పిల్లలకు స్పాన్సర్షిప్, ప్రత్యేక ఆర్థిక సహాయం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తల్లిదండ్రుతిద్దరినీ కోల్పోయిన పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న బాధితుల పిల్లలు స్పాన్సర్షిప్ పథకం కింద దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. దరఖాస్తు చేసుకునే పిల్లలు తాము ఏ విభాగానికి (పైన పేర్కొన్న) చెందినవారో తెలిపి సంబంధిత పత్రాలు, వాటి జిరాక్స్ కాపీలను (మరణ ధృవీకరణ పత్రం, ఆరోగ్య, వైద్య పత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాఠశాల నుండి పొందిన బోనఫైడ్), పాస్పోర్ట్ సైజు ఫోటోను జతచేసి, కార్యాలయంలో లభించే దరఖాస్తు ఫారంతో పాటు సమర్పించాలని తెలిపారు. స్వీకరించిన దరఖాస్తులను బాలల పరిరక్షణ విభాగం అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి అర్హులైన పిల్లల జాబితాను నివేదికతో పాటు స్పాన్సర్షిప్ కమిటీకి సమర్పిస్తారు. ఆర్థిక సహాయం అందించడానికి కమిటీ మొత్తం 150 మంది పిల్లలను ఎంపిక చేస్తుంది. అర్హులైన వారికి ప్రతి నెలా రూ.4,000 ఇవ్వబడుతుంది, స్పాన్సర్పిప్ మొత్తం పిల్లల బ్యాంకు, లేదా పోస్ట్ ఆఫీస్ ఖాతాలో జమ చేయబడుతుందని తెలిపారు. అర్హులు ఈ డబ్బును తల్లి, లేదా సంరక్షకుల ద్వారా తీసుకోవచ్చు, అలాగే సహాయం పొందుతున్న పిల్లల పరిస్థితిని తెలుసుకున్న తర్వాత కమిటీ ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్ష నిర్వహించి జిల్లా కలక్టర్ కు నివేదికను సమర్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. దరఖాస్తులను జిల్లా బాలల పరిరక్షణ విభాగం, హైదరాబాద్ జిల్లా, గది నెం. 405, 4వ అంతస్తు, స్నేహ సిల్వర్ జుబ్లీ భవన్- కలెక్టరేట్ ప్రాంగణం, లక్షీకాపూల్, హైదరాబాద్ చిరునామాకు జనవరి 24వ తేదీ, 2026 లోపు సమర్పించాలని ఒక ప్రకటనలో తెలిపారు.

## అలైడ్ పారామెడికల్ వివిధ కోర్సులలో ప్రవేశానికి కౌన్సెలింగ్

**హైదరాబాద్**

హైదరాబాద్ జిల్లా జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయంలో 20252026 విద్యా సంవత్సరానికి సంబంధించి అలైడ్ పారామెడికల్ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు వివిధ కోర్సులలో ప్రైవేట్ పారామెడికల్ ఇన్స్టిట్యూట్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహించబడనున్నదనీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలైడ్ పారామెడికల్ కోర్సుల కౌన్సెలింగ్ 07-01- 2026 న జిఎన్ఎం కోర్స్ కౌన్సిలింగ్ 08-01-2026 న ఉదయం 10.00 గంటల కు, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి కార్యాలయం, హైదరాబాద్, హరిహర కళాభవన్, పాట్నీ, సికింద్రాబాద్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించబడుననీ తెలిపారు. కౌన్సె లింగ్‌కు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకురావలసినదిగా, కౌన్సెలింగ్ సమయంలో అసలు(ఒరిజినల్) సర్టిఫికెట్లు సమర్పించడంలో విఫలమైతే, సంబంధిత అభ్యర్థి దరఖాస్తు తిరస్కరించబడే అవకాశమున్నదని, అభ్యర్థులందరూ ఈ విషయాన్ని గమనించి, సమయానికి కౌన్సెలింగ్ కు హాజరుకావలసిందిగా ఒక ప్రకటనలో తెలిపారు.

## కొంపల్లి జయభేరి పార్క్ గుండా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు ప్రారంభమైన బస్సు సేవలు



**కొంపల్లి**

కొంపల్లి లోని జయభేరి పార్క్ కాలనీ నుండి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు బస్సు సౌకర్యం లేక ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నందుకు స్పందించిన కొంపల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకులు జయభేరి గోపాల్ రెడ్డి, నాయకుల చొరవతో మేడ్చల్ నుండి కొంపల్లి జయభేరి పార్క్ గుండా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకు బస్సు సేవలను మంగళ వారం కాలనీ వాసుల సమక్షంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ విజ్ఞప్తి మేరకు బస్సు సౌకర్యం కల్పించిన మేడ్చల్ ఆర్టీసీ డిపో మేనేజర్ కి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జయభేరి కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు, మహాదేవ సేవా ట్రస్ట్ సభ్యులు, జయభేరి కాలనీ యూత్ వారియర్స్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన, రేవంత్ అన్న కా సహారా మిస్కినో కె లియే పథకాల కింద దరఖాస్తులు ఆహ్వానం

**ఆసక్తి, అర్హత గల వ్యక్తులు ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి**

**హైదరాబాద్**

ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన అలాగే రేవంత్ అన్న కా సహారా మిస్కినో కె లియే పథకాల కింద తెలంగాణ రాష్ట్ర మైనారిటీల ఆర్థిక సంస్థ, హైదరాబాద్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి ఇలియాస్ అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. "ఇందిరమ్మ మైనారిటీ మహిళా యోజన" పథకం (ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన్, పార్సీ) కింద ప్రభుత్వం వితంతువులు, విడాకులు తీసుకున్నవారు, అనాథ, అవివాహిత మహిళలు చిన్న వ్యాపారాలు ప్రారంభించడానికి రూ.50 వేలు అందిస్తుంది. అలాగే "రేవంత్ అన్న కా సహారా మిస్కినో కె లియే" పథకం కింద తెలంగాణ మైనారిటీల ఆర్థిక సంస్థ ఫకీర్, దూదేకుల, దుర్భల ముస్లిం కమ్యూనిటీ వారికి సభ్యులకు మోపెడ్‌లు, బైకులు, ఇ-బైకులను పంపిణీ చేయాలని ప్రతిపాదించిందని తెలిపారు. పై తెలిపిన రెండు పథకాల కింద ప్రయోజనాలను పొందడానికి ం+టాదీవీమీ వెబ్ పోర్టల్ https://tgobmms.cgg.gov.in/ లో తేదీ: 05.01.2026 నుండి 10.01.2026 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ రి-ఓపెన్ చేయడం జరిగిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# జ్వరాలతో బాధపడుతున్న కాంపల్లి, గ్రామలో తనిఖీలు చేసిన సంబంధిత శాఖ అధికారులు





**డోర్నకల్**

నియోజకవర్గం సీరోల్ మండలం కాంపల్లి లో జ్వరాల బారిన పడ్డ పిల్లలు అనే కథ కథనానికి స్పందించిన అధికారులు మంగళవారం ఫుడ్ కలెక్టర్, ఎక్సైజ్ డిపార్ట్మెంట్ ఎస్సై మౌనిక, మధు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్ కల్లు త్రాగడం వలన వచ్చింది అని పరీక్షలు చేసుకోవడానికి వచ్చిన ఎక్సైజ్ డిపార్ట్మెంట్ సిరోల్ మండలం తాసిల్దార్ పున్నం చందర్ ఆధ్వర్యంలో గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్లను, ఓపెన్ వెల్ అన్ని వాటర్ సప్లై సెంటర్లను తనిఖీ చేసినారు. ఈ కార్యక్రమంలో కాంపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ రేపాల ఎల్లమ్మ వెంకట వీరయ్య, గ్రామ కార్యదర్శి కృష్ణ కుమార్, వార్డు సభ్యులు రేపాల నరేష్, ఫుడ్ ఇన్స్పెక్టర్ ధర్మేంద్ర. టీము పర్యవేక్షణలో ఫుడ్ అండ్ వాటర్ సెంటర్లను శాంపిల్స్ తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ శాంపిలను పరీక్ష చేసిన తర్వాత కల్తీ ఎలా జరిగింది, దేంట్లో జరిగింది అనే వివరణ రెండు రోజుల్లో మేము అందిస్తామని చెప్పారు. సీరోల్ తహసిల్దార్ మాట్లాడుతూ కాంపల్లి గ్రామ ప్రజలు అందరూ నీటిని కాచి వడ పోసుకొని త్రాగవలసిందిగా మనవి చేశాడు, రెండు రోజుల క్రితం నుంచి పరిణామాలను పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రజలు జాగ్రత్తగా తీసుకోవాలన్నారు.

## ఫకీర తండాలో అభివృద్ధికి శ్రీకారం



**నర్సింహుల పేట**

నర్సింహులపేట మండలలో ని ఫకీర తండా గ్రామ సర్పంచ్ గుగులోతు కైలా రవి, ఉప సర్పంచ్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో తండాలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఫకీర తండా రోడ్డు ప్రక్కన పరిసర ప్రాంతాల్లో ఉన్న ముళ్లకంచె చెట్ల పొదలను జేసీబీ సహాయంతో తొలగించారు. సర్పంచ్ గుగులోతు కైలా రవి మాట్లాడుతూ, స్థానిక ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెల తిరగకముందే అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా మరెన్నో కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు. ఫకీర తండా, బుడ్డి తండాల్లో ఉన్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని స్పష్టం చేశారుఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు కవిత, ఉదయ్ లతా రెడ్డి, ఆంబోతు రవి, రాజేష్, పద్మ, భూక్య పరంగన్, తండా పెద్దమనుషులు వీర నాయక్, గూగ్యా నాయక్, శీను నాయక్‌తో పాటు గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామ ప్రజల సంక్షేమ కోసం పని చేస్తా

**- కన్నూర్ మాజీ సర్పంచ్ పుల్లూరి రాం చందర్ రావు**



**కమాలాపూర్**

కమలాపూర్ మండలం కన్నూర్ గ్రామంలో కోతుల బెడద ఎక్కువ ఉన్నందున కన్నూర్ గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని చూసి కన్నూర్ గ్రామ మాజీ సర్పంచ్ పుల్లూరి రాంచందర్ రావు తన సొంత ఖర్చు నలభై ఐదు వేల రూపాయల తో కొండెంగ ని కొనుగోలు చేసి కన్నూర్ గ్రామంలో గ్రామ ప్రజలకు కోతుల బెడద లేకుండా చేసిన కన్నూర్ గ్రామ మాజీ సర్పంచ్ పుల్లూరి రామచందర్ రావు ని కన్నూర్ గ్రామ ప్రజలు అభినందిస్తున్నారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంలో కొంతమంది ప్రజా ప్రతినిధులు వెనకాడితే తాను మాత్రం కన్నూర్ గ్రామ ప్రజల సంక్షేమం కోసం అభివృద్ధి కోసం ముందుంటాడని కన్నూర్ గ్రామ ప్రజలు పుల్లూరి రామచందర్ రావుని ఆదర్శంగా తిసుకోవాలని తెలిపారు.

## నేను పుట్టి పెరిగిన గ్రామానికి సహాయం చేస్తా : మాజీ కలెక్టర్



**డోర్నకల్**

సీరోల్ మండలం రూపుల నాయక్ తండాలో తేజావత్ రామచంద్ర నాయక్ 1984లో ఒడిశాలో ఐపీఎస్ గా జాయిన్ అయి భారత రక్షణ శాఖలో సెక్రటరీగా పదవి బాధ్యతలు చేపట్టి రిటైర్డ్ అయిన తేజావత్ రామచంద్రనాయక్ తన స్వగ్రామమైన సీరోల్ కు వచ్చారు. కాంపల్లి సర్పంచ్ రేపాల ఎల్లమ్మ వెంకట వీరయ్య, శ్రీరామ్, హనుమంతుల, రమణ వారిని మర్యాదపూర్వకంగా కలిసి మా గ్రామాలకు సహాయం చేయవలసిందిగా అడిగారు. రామచంద్ర నాయక్ పెద్ద మనసుతో వారు అడగగానే సరే అని మనస్ఫూర్తిగా ఒప్పుకున్నారు. నేను పుట్టి పెరిగిన గ్రామానికి సేవ చేయడంలో వెనకాడనని మా వంతు సహాయంగా కృషి చేస్తానని ఇద్దరు సర్పంచులకు వారు మాట ఇచ్చారు. స్కూలు డెవలప్మెంట్, హాస్పటల్ విషయంలో గాని విద్యార్థులకు అవసరమయ్యే గ్రంథాలయమే గాని దూర ప్రాంతాలనుండి వచ్చే బడి పిల్లలకు సైకిల్ గాని ఇప్పిస్తానని మాట ఇచ్చినాడు. అడగగానే ఒప్పుకున్న ఒడిస్సా మాజీ కలెక్టర్ రామచంద్రు నాయక్ కు సర్పంచులు ఇద్దరు ధన్యవాదాలు తెలిపారు.

## బండి రమేష్ కి నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలియజేసిన కర్కనాగరాజు

**కూకట్పల్లి**



నూతన సంవత్సరం పురస్కరించుకొని కూకట్పల్లి నియోజకవర్గం ఐ.యన్.టి.యు.సి అధ్యక్షులు కర్కనాగరాజు ఆధ్వర్యంలో కూకట్పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు బండి రమేష్ ని ఆంజనేయనగర్ లో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి బాబాసాహెబ్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటాన్ని ఇచ్చి వారికి నూతన సంవత్సరం శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి కంటైనర్ కార్పొరేషన్, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ నాయకులు దావుద్ షరీఫ్, యాసీన్, జగన్, నరేష్, పాషా, అశ్వక్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మఘంట

# బ్యాంకుల సహకారంతో నేరాల నియంత్రణ - ఎస్పీ శబరీష్

**మహబూబాబాద్**

జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాలు, ఆర్థిక మోసాలు, ఎటిఎం భద్రత, బ్యాంకు సెక్యూరిటీ మరియు కస్టమర్లకు అవగాహన అంశాలపై మహబూబాబాద్ జిల్లా ఎస్పీ బ్యాంకు మేనేజర్లు మరియు బ్యాంకు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇటీవలి కాలంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఫేక్ కాల్స్,ఫిషింగ్ లింక్స్,క్యూఆర్ కోడ్ మోసాలు, ఆన్‌లైన్ లోన్ మరియు తక్షణ రుణాల (ఇన్‌స్టంట్ లోన్స్) పేరుతో జరుగుతున్న ఆర్థిక మోసాల నేపథ్యంలో బ్యాంకు ఉద్యోగులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ సూచించారు. ముఖ్యంగా బ్యాంకు ఉద్యోగులపై నిఘా (సర్వైలెన్స్), సున్నితమైన లావాదేవీల పర్యవేక్షణ మరింత కఠినంగా ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో సైబర్ నేరాలకు సంబంధించి సైబర్ ప్రొఫైల్స్ తయారీ, పునరావృతంగా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులపై ప్రత్యేక నిఘా, బ్యాంకులకు పోలీస్ శాఖ మధ్య సమన్వయంతో సమాచారం పంచుకోవడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనుమానాస్పద లావాదేవీలు గుర్తించిన వెంటనే సంబంధిత ఖాతాలను తాత్కాలికంగా ఫ్రీజ్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని బ్యాంకు అధికారులకు సూచించా రు. ఎటిఎం సెంటర్ల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఎటిఎం వద్ద సరిపడా లైటింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాల ని, సీసీటీవీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా తరచుగా తనిఖీ చేయాలని ఆదేశించారు. అలాగే డోర్ లాకింగ్ సిస్టమ్, ఫైళ్ల భద్రత, బ్యాంకు లోపలి సెక్యూరిటీ వ్యవస్థలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. బ్యాంకుల్లో పనిచేసే సెక్యూరిటీ గార్డులు, సిబ్బందికి భద్రతా విధానాలపై (సూప్స్ )స్పష్టమైన అవగాహన కల్పించాలని, విధుల్లో అప్రమత్తత తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. బ్యాంకు పని




వేళల్లోను,ఆఫీస్ ముగిసిన అనంతరం కూడా సెక్యూరిటీపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. కస్టమర్లు తమ ఏటిఎం పిన్, ఓటీపీ, సివివి, బ్యాంకు ఖాతా వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ తెలియజేయకూడదని బ్యాంకులు తరచుగా అవగాహన కార్యక్రమాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు. సైబర్ మోసాలకు గురైన బాధితులు ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నెంబర్ లేదా ద్వారా ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆర్థిక భద్రత కోసం పోలీస్ శాఖ మరియు బ్యాంకులు సమన్వయంతో పనిచేయాలని, ఇలాంటి సమీక్ష సమావేశాలు భవిష్యత్తులో కూడా నిరంతరం నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ అడ్మిన్ గంద్రతి మోహన్, టౌన్ డిఎస్పీ తిరుపతిరావు, ఎస్.బి ఇన్స్పెక్టర్ నరేందర్,రూరల్ సీఐ సరవైయ్య, బయ్యారం సీఐ రవికుమార్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

# స్మార్ట్ ఇరిగేషన్‌తో సుస్థిర వ్యవసాయం దిశగా ఆంధ్రప్రదేశ్

**వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు**

**స్మార్ట్ వ్యవసాయంతో రైతు ఆదాయం పెంపు**

**ప్రతి నీటి చుక్కను ఆదాయంగా మారుస్తాం**

**ఆటోమేషన్ మైక్రో ఇరిగేషన్‌తో దిగుబడులు పెంపే లక్ష్యం**

**అమరావతి**

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగం సాంకేతికత, ఖచ్చితత్వం, స్థిరమైన అభివృద్ధి దిశగా ముందడుగు వేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. మంగళవారం విజయవాడలోని గవర్నర్ పేట నందు గల సమగ్ర జలవనరుల నిర్వహణ & రైతు శిక్షణ కేంద్రంలోని సమావేశ మందిరంలో రాష్ట్ర ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సూక్ష్మ సాగునీటిలో ఆటోమేషన్ ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ నీటి వనరుల తగ్గుదల, వాతావరణ మార్పులు, సాగు వ్యయాల పెరుగుదల వంటి సవాళ్ల మధ్య రైతును కాపాడాలంటే వ్యవసాయాన్ని స్మార్ట్ వ్యవసాయంగా మార్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. దేశానికి మార్గదర్శకమైన మైక్రో ఇరిగేషన్‌ను మరింత బలోపేతం చేస్తూ, "పర్ డ్రాప్ మోర్ క్రాప్" నుంచి "పర్ డ్రాప్ మోర్ రిటర్న్" దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఇకపై నీరు, ఎరువుల వినియోగం ఊహలపై కాకుండా సెన్సర్లు, డేటా, ఆటోమేషన్ ఆధారంగా జరగడంతో 2030 శాతం నీటి ఆదా, కార్మిక వ్యయాల తగ్గింపు, దిగుబడి,నాణ్యత పెరుగుదల సాధ్యమవుతాయని చెప్పారు. ఉద్యాన, తోట, షేడ్ నెట్, గ్రీన్ హౌస్ మరియు అధిక విలువైన పంటలకు ఈ పథకం అత్యంత ఉపయోగకరమని వివరించారు. ప్రాఖీఖ్ కింద హెక్టారుకు ₹40,000 వరకు మద్దతుతో రాష్ట్రవ్యాప్తంగా



అమలు జరుగుతోందని తెలిపారు. చిన్న, సన్నకారు మరియు ఎస్సీ,ఎస్టీ రైతులకు 55శాతం, ఇతర రైతులకు 45శాతం సబ్సిడీ అందిస్తూ, ఇప్పటికే ఉన్న డ్రిప్‌లలోనూ ఆటోమేషన్ అమర్చుకునే వీలుందని చెప్పారు. ఎంపానెల్ చేసిన కంపెనీల ద్వారానే పారదర్శక అమలు, స్థిర ధరలు, అధికారి తనిఖీ అనంతరమే చెల్లింపులు, ప్రతి భాగంపై "ఖ్రావీఖ్రా" ముద్ర తప్పనిసరిగా ఉంటుందని పేర్కొన్నారు. వారంటీ, సర్వీస్ సపోర్ట్, త్వరితగతిన ఫిర్యాదు పరిష్కారం కల్పిస్తూ రైతును ఎప్పుడూ భరోసాగా నిలబెడతామని స్పష్టం చేశారు. నీటి, విద్యుత్, ఎరువుల ఖర్చులు తగ్గి, దిగుబడులు పెరిగి, రైతు ఆదాయం స్థిరపడేలా ఆటోమేషన్ ఆధారిత మైక్రో ఇరిగేషన్ వ్యవసాయ సంస్కరణగా నిలుస్తుంది. స్మార్ట్ వ్యవసాయంతో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికి ఆదర్శంగా నిలబెడదామని మంత్రి అచ్చెన్నాయుడు గారు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, ఉద్యాన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## కాలనీ సమస్యలపై కమిషనర్ కు వినతి పత్రం అందజేత



**ఆమనగల్లు**

ఆమనగల్ మున్సిపాలిటీ లోని12వ వార్డులో పలు సమస్యలపై మున్సిపాలిటీ కమిషనర్ కు వినతి పత్రం అందజేసిన కాలనీ వాసులు ముఖ్యంగా కాలనీలో అండర్ డ్రైనేజ్ మిషన్ భగీరథ పైప్ లైన్ నల్లలు మరియు సిసి రోడ్ల వీధిలైట్లు పురాతన గోడల సమస్యలను పరిష్కరించాలంటూ మున్సిపల్ కార్యాలయంను ముట్టడించిన 12వ వార్డు కాలనీ వాసులు ఈ కార్యక్రమంలో నాగిళ్ల జగన్, పల్లె నారాయణ, పల్లె సైదులు, పి.పద్మ, పి.లలిత. కే.సంతోష. కే.కవిత.ఎన్ భాగ్యమ్మ. పి.కవిత. పల్లె.శివ. ముజాహిద్ హైమద్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోస్టర్ ఆవిష్కరణ




**గట్టుప్పల్**

లైట్ అండ్ లైఫ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి సందర్భంగా గట్టుప్పల మండల కేంద్రం లో 18 న జరిగే జిల్లా స్థాయి బాల్ బాడ్మింటన్ క్రీడల పోస్టర్ సూర్యాపేట జిల్లా ఎస్పీ కొత్తపల్లి నరసింహా మంగళవారం ఆవిష్కరించారు . యూత్ అధ్యక్షులు దోర్నాల వినయ్ కుమార్ సభ్యులు బి సుభాష్, టి. తిరుమలేష్, ఎస్. భాస్కర్,డి. కుమారస్వామి. ఏ.భాస్కర్, కె. మల్లికార్జున్, ఎన్. వాసు, ఎన్.రాజు, .జి. సురేష్, ఆర్. గోపినాథ్, జి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు విడుదలంటు జిల్లా కలెక్టర్ కు వినతి



**యాదాద్రి**

యాదాద్రి భువనగిరి సంస్థాన్ నారాయణపురం,గుడిమల్కాపురం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల భవనం శిథిలావస్థలో ఉండటంతో విద్యార్థుల భద్రతకు ముప్పు ఏర్పడిందని, అలాగే గ్రామంలో నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన బిల్లులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొంటూ గ్రామ సర్పంచ్ జిల్లా కలెక్టర్ హనుమంత రావుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మన్నె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ,మా గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాల ఆదర్శ పాఠశాలగా ఎంపిక కావడం గ్రామానికి గర్వకారణమని తెలిపారు. ఆదర్శ పాఠశాలగా ఎంపికైనప్పటికీ భవనం శిథిలావస్థలో ఉండటం దురదృష్టకరమని,తక్షణమే నూతన భవనం లేదా మరమ్మతులు చేపట్టాలని అలాగే చదువు బోధించడానికి ఒక ఉపాధ్యాయుడు అవసరమని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ఇందిరమ్మ పథకం కింద నిర్మాణం పూర్తయిన ఇళ్లకు సంబంధించిన ఫైనల్ బిల్లులు విడుదల కాకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ సువర్ణ, గ్రామపంచాయతీ జిపిఓ బాలరాజు,ఉపసర్పంచ్ గాదె సైదులు వార్డు మెంబర్ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు పెరిగేలా చూడాలి

**జిల్లా కలెక్టర్ వి హనుమంతరావు**



యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రి లో మొత్తం పరిశుభ్రత పాటించాలని సూచించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఓ వ్యక్తిని అందుతున్న వైద్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు 100శాతం ప్రభుత్వ ఆసుపత్రిలోనే డెలివరీలు జరిగేలా సిబ్బంది పనిచేయాలని. ఆ వైపుగా గ్రామంలో ప్రజలను ప్రోత్సహించాలని డాక్టర్ ఏయన్ యంఓ ఆశలు లకు కలెక్టర్ సూచించారు అయన వెంట చౌటుప్పల్ ఆర్డిఓ శేఖర్ రెడ్డి తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఎంపీడీఓ ప్రమోద్ కుమార్ ఎస్ఐ జగన్ మెడికల్ ఆపిసార్లు డాక్టర్ రవీనా జ్యోత్న ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల ఓటర్ తుది జాబితా జనవరి 10న విడుదల

**రంగారెడ్డి**



రంగారెడ్డి జిల్లాకు సంబంధించిన మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి తుది ఓటరు జాబితాను ఈ నెల 10న వెలువరించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె. శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) కె. శ్రీనివాస్ అధ్యక్షతన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయడం జరిగిందని అన్నారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట జనవరి 10వ తుది జాబితా వెలువరిస్తామని సూచించారు. మున్సిపల్ స్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కోరడం జరిగిందన్నారు. తుది ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితా తయారీలో బి.ఎల్.ఓలు, బి.ఎల్.ఎలు సమన్వయంతో పనిచేసి జాబితాను తయారు చేయాలని, వివాహాలు చేసుకొని వెళ్ళిన వారి పేర్లు, ఇండ్లు మరిన వారి పేర్లు, చనిపోయిన వారి పేర్లను తొలగించాలని, ఓటర్ జాబితాలో తప్పులు దొర్లకుండా క్షుణ్ణంగా పరిశీలించి ఫైనల్ గా ఓటర్ జాబితాను తయారు చేయాలని రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిషనల్ కలెక్టర్ ను కోరగా అందుకు అడిషనల్ కలెక్టర్ స్పందిస్తూ ఓటర్ జాబితా తయారీలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఫైనల్ జాబితా తయారు చేయడం జరుగుతుందని తెలిపారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికల పై స్థానిక సంస్థల జిల్లా కలెక్టర్ శ్రీనివాస్ తో టిఆర్ఎస్, టిడిపి, బిజెపి నాయకులు భేటీ జిల్లాలో ఉన్న 6 మున్సిపాలిటీలలో ఓటర్ల అవకతవకలపై 355 ఫిర్యాదులు రాగా, ఇబ్రహీంపట్నం మున్సిపల్ నుండే 250 ఫిర్యాదులు,ఓటర్ల అవకతవకలు పై ఫిర్యాదు చేస్తూ, సంబంధిత అధికారుల పై చర్యలు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జెలమోని రవీందర్,బిఆర్ఎస్ నాయకులు నిట్టు జగదీశ్, మదుపు వేణుగోపాల్ రావు, ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, పిడి మెప్మా వెంకట సత్యనారాయణ, బిఆర్ఎస్ నుండి మదుపు వేణుగోపాల్, నిట్టూ జగదీశ్వర్, బి.శ్రవణ్, సి.హెచ్.దేవదాస్, బిజెపి నుండి ఎన్.మల్లారెడ్డి, మల్లేశ్ యాదవ్, వై.నారాయణ యాదవ్, లక్ష్మీపతి గౌడ్, టిడిపి నుండి జెలమోని రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.